# మిసిమి

మాస పత్రిక

మే - 2002

2546వ బుద్ధ జయంతి సంచిక



వెల రూ. 8/-



రాణి మాయాదేవి శుక్రవారం జూన్ 15, పూర్ణిమ దినాన (ఇది థాయి సంప్రదాయం ప్రకారం)

లుంబినీ సుఖ వన ప్రవేశం చేసింది.

సౌరమానం ప్రకారం ఈ రోజు మే నెలలో వచ్చే పూర్ణిమకు సమానం.

ఎండ వేడిమి ఎక్కువ కావడంతో ప్రయాణ మధ్యమంలో చెట్లనీడన సేదదీరింది.

వెంటనే ఆమె ఒక కుమారుని ప్రసవించింది.

బోధిసత్త్వ రాకుమారుడు పుట్టీపుట్టగానే ఏడు పద్మాలపై నడచి వెళ్ళాడు.

# మిసిమి

**"All that we are is the product of what we have thought" is "We are what we think." - Dammapada.**


సంపుటి 13 | మే 2002 | సంచిక 5

వ్యవస్థాపక సంపాదకుడు : **డాక్టర్ రవీంద్రనాథ్ ఆలపాటి**


## విషయ సూచిక


అశ్వత్థవృక్షమూ – పడక కుర్చీ - అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి

నరసింహ క్షేత్రాలైన బౌద్ధ క్షేత్రాలు - డా॥ ఈమని శివనాగిరెడ్డి

బౌద్ధం నుండి భారతం దాకా - వావిలాల సుబ్బారావు

మాధ్యమిక శూన్యత - ఎమ్. రాజగోపాలరావు


'మిసిమి' వ్యవస్థాపకసంపాదకులు డా॥ ఆలపాటి రవీంద్రనాథ్ బౌద్ధాభిమాని ఆయన అడుగు జాడల్లో... 2546వ బుద్ధ జయంతి సందర్భంగా వెలువరిస్తున్న 'మిసిమి' ప్రత్యేక సంచికకు తమ అమూల్య వ్యాసాలను పంపి సహకరించిన వారికి మిసిమి కృతజ్ఞతలు తెలుపుకొంటోంది. ఈ సందర్భంగా మిసిమి పాఠకులకు బ్రహ్మ విహార మైత్రి, కరుణ, ముదిత, ఉపేక్షలు ప్రేరిత శుభాకాంక్షలు. ఈ బ్రహ్మ విహార మా పాఠకులకు ఈషన్మాత్రం ప్రభావితం చేసినా ఈ పైరు బొండు వోక పండినట్లే.


బౌద్ధ శిధిలాలు 'లంజదిబ్బ' లెట్లైనవి? - జి. ఆర్. వర్మ

యశోధర - డా॥ యు. ఏ. నరిసింహమూర్తి

బౌద్ధమత – ప్రవచనాలు - డా॥ యన్.సి. రామానుజాచార్యులు

వేదాంతదృష్టిలో బౌద్ధం - శివలింగం

ప్రపంచ సంస్కృతిలో బుద్ధ ధమ్మ విశిష్టత - ఎమ్. వి.ఎస్. అప్పారావు



విడిప్రతి రూ. 8/- వార్షిక చందా రూ. 100/- విదేశీయులకు $ 20

ముఖచిత్రం : **బుద్ధప్రతిమ**

Printed & Published by BAPANNA ALAPATI at Kala Jyothi Process Ltd., 1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad, Hyd - 20. Ph. 7645536 E-mail : misimieditor@rediffmail.com

సంపాదకుడు : **అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి**

# బుద్ధ కరుణ కరువైన వేళ

బాణం గుచ్చుకొంది
జరగవలసింది వైద్యం
బాణం, పొడవు, దిశ
వేగంలపై కాదు చర్చ
జరగవలసింది వైద్యం
(బుద్ధుడు చెప్పాడు)
నిబంధనల చర్చకాదు
( 184 నిబంధన లేదా 193 నిబంధన)
ఆ చర్చకుర్చీ కోసం
అధికార రాజకీయం
కళ్ళ దుమ్ము నింపింది
( బుద్ధుడు చెప్పాడు Men have dust in their eyes)
పార్లమెంట్ దుమ్ము
నిండిన కళ్ళతో, చీకట్లో
గోడ కొట్టుకొంది
దారి కానరాక
అడుగులు పడక
ఆగిపోయింది
బొంగురు పోయిన గొంతుతో.
అక్కడహ్మదాబాద్‌లో
మత రథ చక్రం క్రింద
మనిషి మట్టిగరిచాడు
మత గంధ కాగ్నికీలలు
మసి చేశాయి మానవావాసాలను
పూలమ్మిన ఊళ్లో
కట్టెలమ్ముతున్నాడు
బిచ్చమెత్తుతున్నాడు
శరణార్థుల శిబిరాల్లో
బ్లడీ ఇండియాలో
రక్తసిక్తుడు అహ్మదాబాదీయుడు
స్వతంత్ర భారతంలో
అస్వతంత్రుడు భారతీయుడు.

# అశ్వత్థవృక్షమూ - పడక కుర్చీ

- అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి

అశ్వత్థ వృక్షం అంటే ఇక్కడ బోధివృక్షం ఇది బుద్ధునికి ప్రతీక, పడక కుర్చీ ఫ్రాయిడ్‌ను ప్రతీకీకరిస్తుంది. రోగులను ఫ్రాయిడ్ వాలుకుర్చీలో పడుకోబెట్టి చికిత్సచేసే వాడు. వాస్తవానికి "The tree and the Couch" Dialogues in Psychoanalysis and Buddhism అనే పేరుతో ఒక ఆంగ్ల వ్యాస సంకలనమే వచ్చింది.

ప్రాచ్యదేశాలలో మతం, మనోవిజ్ఞానం, నీతి శాస్త్రం, దర్శనం అంటూ దేనికది విడివిడిగా లేదు. పాశ్చాత్య దేశాలలో మరీ మొదట్లో అన్నీ తత్వ శాస్త్రంలో మిళితమై ఉన్నా కాలక్రమంలో అవి విడవడిపోయాయి. వాటిల్లో మనోవిజ్ఞాన శాస్త్రం ఒక శతాబ్దం క్రింద అంటే 1912లో విడివడి పోయింది. ఈ శాస్త్రం ముఖ్యంగా మనస్సు, అందలి విషయాలను, ప్రవర్తనను, ప్రేరణను అధ్యయనం చేసింది.

తూర్పు దేశాలలో మతాదర్శం ముక్తే అయినా, ఆముక్తిని చేరడానికి అనుసరించవలసిన మార్గం, ఆమార్గంలోని అనుభవాన్ని ముఖ్యంగా పరిశీలించడం జరిగింది. ఈ అనుభవ పరిశీలనే ప్రాచ్యమతాలలోని సైకాలజీ. అయితే గమ్మత్తు ఏమిటంటే ఇప్పటికి గూడ పాశ్చాత్య మనో విజ్ఞానం ''అనుభవం'' గురించి అంతగా అధ్యయనం చేయలేదు.

అయితే అలాన్ వాట్స్ చెప్పినట్లు ప్రాచ్యుల విముక్తి మార్గాలకు, పాశ్చాత్యుల మానసిక రోగుల చికిత్సా విధానాలకు మధ్య సారూప్యత ఉంది. రెండూ - విముక్తి మార్గం, చికిత్సా విధానం కూడా ప్రజలలో, తమను గురించి తమకు కలిగే అనుభూతులను, ఇతరులతోడి తమ సంబంధాలను, భవిష్యత్తు గురించి తమకున్న అభిప్రాయాలను మార్చడానికే ప్రయత్నిస్తాయి. పాశ్చాత్యం ముఖ్యంగా రోగులకు స్వాస్థ్యం చేకూర్చాలని ప్రయత్నిస్తుంటే, ప్రాచ్యమతాలు మామూలు ఆరోగ్యవంతులను తమను గురించి తాము తెలుసు కొనేట్టు చేయ ప్రయత్నిస్తాయి.

అయితే ప్రాచ్య దేశ మతాలలోకెల్ల. అంతే కాదు, అసలు ప్రపంచ మతాలలోనే మానసిక విషయాలలో అత్యంతంగా ఉన్నత శిఖరాలకు చేరుకొంది బౌద్ధం. బుద్ధుడు గొప్ప మనో విజ్ఞాన వేత్త. బుద్ధుని ధ్యాన పద్ధతి, అదే విపశ్యన విధానం లాంటి ధ్యానం మరొకటిలేదు. ఇతర విధానాలలో సమాధి స్థితితోనే ధ్యానం ఆగిపోతుంది. అంటే మనస్సును ధ్యాన వస్తువుపై కేంద్రీకరించి, ఆవస్తువుతో మమేకం కావడం, అక్కడే ఆనంద డోలికలలో తేలియాడడం అంతవరకే. ఇంక ఆపైన ఏమీ ఉండదు. కాని బుద్ధుని విపస్సనా ధ్యానంలో ఈగో ప్రవాహం రెండుగా చీట్లి, అందులో ఒక భాగం రెండో భాగంలో సంభవించే అనుక్షణిక మార్పులను పరిశీలించే శక్తిని సంతరించుకొంటుంది. అంటే ఇక్కడ ఈగో ప్రవాహం తనకు తానే కర్త కర్మ అవుతుంది. అంటే అనుక్షణం మనస్సు రూపొందే విధానాన్ని గమనించడం ఈ విపస్సనలో జరుగుతుంది.

బుద్ధుడు అందరి ప్రవక్తల లాగా కేవల బుద్ధిపరంగా ఆలోచించి సిద్ధాంతాలను తయారు చేసి బోధించలేదు. అతడు అనుభవవాది. అనుభవంలోకి రాని దానిని తానెన్నడూ చెప్పలేదు. అలాగే తాను ఈ ప్రపంచ వాస్తవికతను అనాత్మ( అనత్త)గా, అనిత్యం( అనిచ్చ)గా, దుఃఖంగా అనుభవంలోకి తెచ్చుకొన్నాడు. అదే ఆయన ఆరేళ్ళు తపస్సు చేసి సాధించింది. మనిషిలో ఆత్మ ఎలా లేదో, అతడు ఎలా అగనిత్యుడో అంటే ఒక ప్రవాహమో, క్షణం క్షణం మారేవాడో - ప్రతిమనిషికి బుద్ధి పరంగా కాక అనుభవ పరంగా తెలియ జేశాడు. దీనిని ప్రతి మనిషి అనుభవంలోకి తేవడానికే విపశ్యన విధానాన్ని బుద్ధుడు ప్రపంచానికి ఇచ్చాడు.

ఈ విపశ్యనలో మొదటి దశలో సమాధి ఉంటుంది. ఆ తరవాత, అనుక్షణం తనలో ఏమి జరుగుతుందో, ఆ మార్పులను, తాను వాటిల్లో ఇరుక్కోక, నిర్లిప్తంగా, ఉపేక్షభావంతో చూస్తూ ఉంటాడు. ఇలా క్షణం క్షణం సంభవించే మార్పులను, ఆ మార్పుల స్వభావ స్వరూపాలను అంటే ఆ అనుభవాల గురించి ఆధునిక మనోవిజ్ఞానశాస్త్రం ఏమైనా చెప్పగలుగుతుందా? చెప్పిందా? ఫ్రాయిడిన్ మనో విశ్లేషణ దీనిని వివరించడానికి ఏమైనా ప్రయత్నం చేసిందా అనే విషయాలను ఇప్పుడు మనం చూద్దాం.

ప్రపంచ మతాలన్నింటిలోకి బౌద్ధం అత్యంతంగా మనో వైజ్ఞానికమైనదని అందరూ అంగీకరించినా, ఆచరణలో - అంటే ధ్యాన పద్ధతిలో - విపశ్యనలో - సంభవించే అనుభవాల గురించి పరిశీలన చాల పరిమితంగానే జరిగింది. ఏ ధ్యాన స్థితిలో ఏమి జరుగుతుంది? అనే విషయాన్ని అంతగా పరిశీలించ లేదు.

సిగ్మండ్ ఫ్రాయిడ్ అసలు ప్రాచ్య ధ్యాన స్థితుల లక్షణాల గురించి అంతగా పరిశీలించలేదు. కాని వివేకానంద, రామకృష్ణ పరమహంసల శిష్యుడైన రోమారోలా (Romain Rolland) ఫ్రాయిడ్‌తో పదమూడేళ్ళపాటు, ఈ ప్రాచ్య ధ్యాన స్థితుల మీద ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపాడు. ఇలా ఉత్తర ప్రత్యుత్తరాలు జరపడంలో రోమారోలా ఉద్దేశం ఏమిటంటే ఆ స్థితులను ఫ్రాయిడ్ పరిశీలించి, వాటి మీద అతడు ఏమి చెబుతాడో వినాలని.

రోమారోలా హిందూ ధ్యాన వర్ణనలను ఆధారం చేసుకొని ఫ్రాయిడ్ తన జగత్ప్రసిద్ధమైన ''మహా సాగరానుభూతి'' భావన (Oceanic feeling) విశ్లేషణను చెప్పాడు. అది అనంతమైన, హద్దులు లేని విశ్వంతో మమేకమైన ''అహం అనుభూతి'' (ego-feeling). ఈ అనుభూతిని ''అనంత స్వానురాగ పునరావృతం''గా (restoration of limitless narcissism) (స్వాను రాగం అంటే తనను తాను ప్రేమించుకోవడం), ''శైశవ నిస్సహాయత పునరుజ్జీవనం (resurrection of infantile helplessness)గా ఫ్రాయిడ్ 1930లో వర్ణించాడు.[1] మనోవిశ్లేషణ సాహిత్యంలో ధ్యానానుభవాన్ని గురించి - అది హైందవం కాని, బౌద్ధం కాని - చెప్పింది ఫ్రాయిడ్‌కు ముందు వెనుక కూడ ఇంతే. ఎంత సేపు చెప్పినా, ఆ అనుభవం మాటలు రాకముందరి పసిపిల్లల అనుభవం లాంటిదని. తల్లి -

బిడ్డల పరస్పర బంధ సుఖం లాంటిదని మాత్రమే. మనో విశ్లేషణ ఈ అనుభవాల గురించి ఇంక ఎక్కువ చెప్పలేక పోవడానికి కారణం ఎవరికీ బౌద్ధ ధ్యానాన్ని గురించిన పరిచయం లేక పోవడమే.

వాస్తవానికి బౌద్ధ ధ్యానంలో రెండు విస్పష్ట దశలున్నాయి. మొదటిది ఏకాగ్రత (concentration). ఇందులో శ్వాస లేదా మరేదైనా వస్తువు మీద మనస్సును చెదరకుండ ఎక్కువ సేపు లగ్నం చేయడం. ఇది ప్రారంభం. ఇదే తరవాత తరవాత సమాధిగా పరివర్తిత మవుతుంది. ఈ స్థితిలో మహా విశ్రాంతి, సుఖ సంతోషాలు కలుగుతాయి. ఇదే ఫ్రాయిడ్ వర్ణించిన మహా సాగరానుభూతి.

అయితే బౌద్ధం ఇంతటితో ఆగిపోదు. మనిషి ఎరుక క్షేత్రంలో (field of awareness) క్షణక్షణం పుడుతూ గిడుతూ ఉండే ఆలోచనలను, వేదనలను, ప్రతిమలను, సంవేదనలను ప్రతి క్షణం పరిశీలించే పద్ధతిని అవలంబిస్తుంది. దీనినే జ్ఞాన పోనిక మాటలలో చెప్పాలంటే, ''క్షణక్షణంకు, తనకు తనలో వరుసగా వాస్తవంగా ఏమి జరుగుతోందో దానిని స్పష్టమైన ఏక మనస్సు ఎరుకతో ఎరుగుట.''[2]

సమాధి (concentration) తో మనస్సు కుదురు కొంటుంది. అంత మాత్రం చాలదు. బౌద్ధానికి విపశ్యన (mindfulness) ప్రత్యేకమైంది. దీని ద్వారా మాత్రమే తన ఆత్మ స్వభావం (nature of the self) లోకి తొంగిచూసుకొనే అంతర్ప్రజ్ఞా స్థితులు ఏర్పడతాయి. మనో విశ్లేషకు లెవరూ ఈ విపస్సనా స్థితుల అనుభవాలను పరిశీలించలేదు. ఎంత సేపటికి ఫెరెన్జ్కి, జోన్స్, అలెగ్జాండర్, గ్రాన్‌బెర్గర్ మొదలైన వారు సమాధి మార్మికానుభవాలను శైశవాను భవాలకు మాత్రమే జోడించారు అంతే.

తరవాత సైద్ధాంతికంగా విపశ్యనను మొదటిసారిగ విశ్లేషించిన వాడు (1924) జో టామ్సన్. ఇతని అసలు పేరు జోసెఫ్ థామ్సన్. వ్యాసం పేరు ''ప్రాక్తాన బౌద్ధంలో మనో విజ్ఞానం'' (Psychology in Primtive Buddhism). ఈ వ్యాసంలో అతడు మనోవిశ్లేషణలోని స్వేచ్ఛా సంసర్గాని(free association)కి ధ్యానానికి మధ్య ఉన్న సాదృశ్యాలను ఎత్తి చూపడమే కాక, విపస్సనలోని ఉన్నత దశలలో ఆత్మ నిర్మితి (structure of self) భావనల గురించి చెప్పాడు. ఇతడు మాత్రమే విపస్సనను ప్రత్యేకంగా, దాని నిజ స్వరూపంలో చూడగలిగాడు. తతిమ్మావారు చాలమంది ఫ్రాయిడ్ చెప్పిన శైశవ స్వానురాగం వయోజన దశలో కొనసాగింపు మాత్రమే విపశ్యనానుభవమని చెప్పారు. ఇది సరికాదు. శైశవంలో పరిపూర్ణుల మనే ఒక భావన ఉంటుంది. అది మనలో అంతరీకరణం చెంది ఉంటుంది. ఆ తరవాత పెరిగి పెద్ద వారమయ్యే కొలది దానిని పోగొట్టు కొంటాము. ఆ పోగొట్టుకొన్న పరిపూర్ణ స్థితితో మమేకం కావాలని చేసే ప్రయత్నమే ధ్యానం (concentration). ఇది సంప్రదాయ ఏకాగ్రత (ధ్యాన) ఆచరణకు మాత్రమే వర్తిస్తుంది, కాని విపస్సనకు కాదు.

విపస్సన ఏకాగ్రత ధ్యానం కంటే పూర్తిగా భిన్నమైంది. మామూలు ధ్యానంలో అయితే ప్రశాంతత, సంతోషంలాంటి స్థితులు సంభవిస్తాయి. అదే విపస్సనలో అయితే పై చెప్పిన స్థితులతో సంబంధంలేని అంతర్ప్రజ్ఞ, చేతన (విజ్ఞాన) స్థితులకు దారితీస్తుంది. ఈ స్థితులలో విపస్సన శక్తి పెరిగి, ''ఈ క్షణంలో మనస్సు ఎలా రూపొందుతున్నదో, ఆ రూపొందే విధాన్ని చూడగలుగుతుంది'', అన్నాడు

జానె.[3] తన నుంచి దూరం దూరంగా, ఒక దానికొకటి సంబంధం లేకుండా జరిగిపోయే వాటిని సంశ్లేషించి, సమగ్రం, ఐక్యం కావించడానికి ఈగోను అటువంటి శక్తి సమర్థవంతం చేస్తుంది. సరిగ్గా ఇటువంటి అనుభవాలనే విపస్సన ప్రగతిని గురించి చెప్పిన బౌద్ధ మనోవిజ్ఞాన గ్రంథాలు వాకొంటున్నాయి.

సంప్రదాయ ఏకాగ్ర ధ్యానం ఈగో బయటి సరిహద్దులను తుడిచి వేస్తుంది. విపస్సన అలా కాక, ఈగో వెలుపల కాక లోపల, దానిలో జరిగే చేతన (విజ్ఞాన) ప్రవాహాన్ని అనుక్షణం పూర్తిగా, ఎడతెగకుండ పరిశీలించడాన్ని సాధ్యం చేస్తుంది. అలా పరిశీలించడం ద్వారా అంతిమంగా అనుభవం యొక్క అనిత్య స్వభావం అవగతం కావడానికి వీలవుతుంది.

విపస్సనలో ధ్యాని ''ఆంతరంగిక అనుభవ ప్రవాహానికి'' సమాయత్తుడవడం మొదటి దశ. ఏది ఏమైనా విపస్సన ధ్యానంలో ప్రగతి సాధించే కొలది, అంతర్గత మానసిక విషయం (intrapsychic content) మీదినుంచి ''అంతర్గత మానసిక ప్రక్రియ'' (intrapsychic process) మీదకి దృష్టి మారుతుంది. ఈ విధంగా దృష్టి ఎప్పుడైతే 'విషయం' మీదినుంచి 'ప్రక్రియ' మీదకు మారుతుందో, ఆ సమయంలో నిష్పన్నమయ్యే ''ఆలోచనలు'' (thoughts) ''జనన ప్రక్రియ'' (generic process) మీదికి అవధానం మళ్ళుతుంది. అంతే గాని ఆ ''ఆలోచనల విషయం'' (content of thought) మీద కేంద్రీకృతం కాదు.

అంటే దీని అర్థం, ధ్యాని 'ఆలోచన అసారత' (thoughts insubstantiality), దాని క్షణ భంగురత (transient)ల మీద, ఏ విధంగా ధ్యాని, అక్కడ లేని ''చింతను'' (thinker)నితో తనను తాదాత్మ్యం చెందించుకొంటున్నాడు - అనే విషయాల మీద దృష్టి కేంద్రీకృతమవుతుంది.

ఈ రకమైన బౌద్ధ విపస్సన ధ్యానలక్ష్యం 'నేను' కు అర్థం తెలుసుకోవడమే. మనిషిలో ఒక అంతర్గత అస్తిత్వం ఉన్నదని, ఒక సత్వం ఉందనీ, ఒక స్వతంత్ర, సారవంత, శాశ్వత, స్వాయత్త, స్వయం సమృద్ధ సత్వం ఉందనే విశ్వాసాన్ని పరిశీలించి, అది ఎలా నిలవదో తేల్చి చెప్పడం. అటువంటి సత్యాన్ని (ఆత్మను) మన అనుభవంలోని తెచ్చుకోగలమా? అనే ప్రశ్నకు సమాధానం చెప్పడం. లక్ష్యం 'నేను' ను కాదనడం కాదు. మన నిత్య వ్యవహారం నడపడానికి అది ఒక 'భావన' (concept)గా అవసరమేనని, అది ఒక శాశ్వత, స్వతంత్ర సత్వం కాదని చెప్పడమే. అది ఒక ప్రతిమ అనీ, ''ప్రతిమ'' అయిన ఏజెంట్ అనీ, అంతర్గత అస్తిత్వం లేని శూన్య గర్భ అయిన ప్రతిమ అని తెలిపేందుకే.

ఈ అంతర్గత అస్తిత్వాన్ని మన మనో విశ్లేషణ భాషలో ''ఆదర్శ ఈగో'' (ideal ego) గా వ్యవహరించవచ్చు. వాస్తవానికి ఈ ఆదర్శ ఈగో ఆత్మ ప్రతిమ (self image) తప్ప అన్యం కాదు. ఇది సకారాత్మక స్థితి (positive state)ని, అది వాస్తవానికి, ఒక భ్రమే అయినా, సూచిస్తుంది. వాస్తవంలో ఆదర్శ ఈగో ఆదర్శీకరణం వల్ల వికృత రూపం దాల్చిన ఆత్మ ప్రతిమ కంటే భిన్నంకాదు. కాని ఈ ఆదర్శ ఈగో, ఈగో కంటె సత్యంగా అనుభవంలోకి వస్తుంది. ఈ విధంగా ఆదర్శీకృత

ఆత్మ ప్రతిమతో - తాదాత్మ్యం చెందే ప్రవృత్తి లాకన్ (Lacan) ''అద్దపు నేను'' ''దర్పణ అహం'' (specular "I") అన్నాడు.[4] ఇదే అంతర్గత అస్తిత్వం మీద విశ్వాసం కలిగించేది. దీనినే బౌద్ధులు లక్ష్యంగా పెట్టుకొని ఢీకొనేది. ఏతావాతా అసలు గమనించాల్సిన విషయం ఏమిటంటే, ఎలా ఉన్న ఆత్మ (self) ను అలాగే, ఉన్నదానిని ఉన్నట్లు, మనకు ఎలా గోచరమవుతుందో అలాగే, ఒక స్థిరీకృత సత్యం (fixed intity) గా కాక అనుభవించాలి. ''అతడు తన స్వంత ఆత్మ అనస్తిత్వాన్నిచూస్తాడు. ఇతరుని ఆత్మ లక్షణం కాని తన ఆత్మ (self)ను కూడా అతడు దర్శిస్తాడు. అతడు ఇతరుని ఆత్మ అనస్తిత్వాన్ని (nonexistence) చూస్తాడు.... తన ఆత్మ లక్షణం కాని ఇతరుని ఆత్మను దర్శిస్తాడు.... అలాగ కేవలం ఈ నిర్మితుల సమాహారం మాత్రమే కనిపిస్తుంది... ఆత్మశూన్యతలాగ లేదా ఆత్మ ధర్మంలా'' అని బుద్ధ ఘోషుడు అన్నాడు.[5]

ఇది బౌద్ధం చెప్పే 'అనత్త' (అనాత్మ) వాదం. మనం మామూలుగా ఆత్మ అనుకొనేది ''తప్పుగా భావన' చేయబడినదనీ, దానికి అంతర్గత అస్తిత్వం లేదనీ గ్రహించాలి. మనం విపస్సన ద్వారా లక్షించేది ఏమిటంటే, ఆత్మలో మామూలుగా మనకు కనిపించే సంహతి, నిబిడత్వం (compactness) సంఘటిత్వం, కూర్పు, సాంద్రత, అమరికల భ్రమను పారదోలడం, అలా భ్రమను పారదోలి, సంప్రదాయానుసారంగా మనం భావిస్తూ వచ్చిన, ఆత్మ నిస్సారతను బహిర్గతం చేయడమని బుద్ధ ఘోషుడు చెప్పాడు.

''ఆత్మరహితత్వం అంటే ఒకప్పుడున్న ఆత్మను ఇప్పుడు లేదనడం కాదు. అసలు ఇటువంటి ఆత్మ ఎప్పుడూ లేదు. చేయవలసింది ఎమిటంటే ఎప్పుడూ అనస్తిత్వంగా ఉన్న ఆత్మ (non-existent self)ను అనస్తిత్వమైనదానిగానే గుర్తించడం...''[6]

ఇలా గుర్తించడం అనేది బౌద్ధ మనోవైజ్ఞానిక, తాత్విక ఆలోచనకు మూలస్తంభం.

బౌద్ధం చెప్పడమేకాదు, ఆత్మ భావన రూపొందిన ప్రక్రియను మనోవిజ్ఞాన శాస్త్రం పరిశీలించిన రీతిలో చూసినా, ఆత్మ ఒక చిరస్థాయి కలిగిన సత్యం (entity) కాదనీ, అది ఒక మనో నిర్మితి అనీ అర్థమవుతుంది.

మనో విశ్లేషణ సిద్ధాంతం ప్రకారం, మనం, మన శైశవదశలో, ''నేనెవరిని? నాకూ ఇతరులకు ఉన్న సంబంధాలేమిటి? అనే వాటిని అమర్చడం కోసం, కూర్చడం కోసం కొన్ని ప్రణాళికలు తయారు చేసుకొంటాం. ఈ తొలి అనుభవాల స్మృతి జాడలు, ''నేను ఎవరిని, ఇతరులెవరు? వారితో నా సంబంధాలేమిటి? అవి ఎలాంటివి?'' అనే వాటికి సంబంధించిన సాధారణ ప్రణాళికలలో క్రమంగా ఘనీభవిస్తాయి. ఈ ఘనీభవించిన ప్రణాళికే ఆత్మ. ఇది బౌద్ధులు చెప్పిన మానసిక నిర్మితి (mental construct) లేదా మానసిక ప్రతినిధి (mental representation). అంతే కాదు ఇది వ్యక్తి అనుభవంలో, అనుభవంతో, నిత్యనూతనంగా అనుక్షణమూ నిర్మితమవుతూ ఉంటుంది. ఇదొక సత్యం కాక నిరంతర ప్రక్రియ, ప్రవాహం. ఆధునిక మనోవిజ్ఞాన శాస్త్రం దీనిని ఈ విధంగానే

అర్థం చేసుకొంటున్నది. ఈ ప్రక్రియనే బుద్ధుడు విపస్సన ద్వారా క్షణక్షణం జరిగే మనో నిర్మితిని, ఆత్మ అంతర్ధానాన్ని పరిశీలించమన్నాడు.

ఫ్రాయిడ్ మనో విశ్లేషణ సిద్ధాంతంలో సుఖసూత్రాన్ని ప్రతిపాదించాడు. అంటే మనషులు సుఖాన్నిచ్చేదాని కోసం వెంపర్లాడతారని, బాధను కలిగించేదానికి దూరంగా జరుగుతారనీ దీని సారాంశం. సుఖాన్నిచ్చేదానికి అనుకూలంగా ప్రతి స్పందించడం, దుఃఖాన్నిచ్చేదానికి అనుకూలంగా ప్రతిస్పదించడం అంతస్సిద్ధమనీ, అవి నేర్చుకొంటే వచ్చినవి కావనీ, ఆ ప్రతిస్పందనలు సహజాలని, అవి స్వయంచాలితాలనీ పాశ్చాత్యులంటున్నారు. కాని బుద్ధుడు తన అంతర్ప్రజ్ఞద్వారా, దీనికి విరుగుడును కనిపెట్టాడు. అది ఉపేక్షభావన. విపస్సన ఉన్నతదశలలో ఉపేక్ష ఈ భావన (equanimity) ఉదయిస్తుంది. ఈ భావనలో సుఖసూత్రాన్ని, దాని సహజత్వాన్ని బుద్ధుడు తిప్పి కొట్టాడు.

ఉపేక్ష అంటే సుఖ దుఃఖాలను రెండింటిని సమానంగా చూడడం. అంటే ఇక్కడ బుద్ధుడు చేసినగొప్ప పని ఏమిటంటే, విపస్సనా ధ్యానం ద్వారా, సుఖాన్నిచ్చే వస్తువుకు దాని యెడ మనిషిచేసే ప్రతిస్పందనకు మధ్య ఉన్న బంధాన్ని తెంచడమే, అలాగే దుఃఖాన్నిచ్చే వస్తువుకు దానికి మనం చేసే ప్రతిస్పందన ( దూరంగా పోవడం) కు మధ్య సంబంధాన్ని తెంచడమే. ఈ సంబంధం సహజమని పాశ్చాత్య మనో విజ్ఞానం అంటే, బుద్ధుడు కాదు అది అభ్యసితం (నేర్చుకొన్నదే) అన్నాడు. నేర్చుకొన్నదే కనుక దానిని దానికి వ్యతిరేకంగా గూడా నేర్చుకోవచ్చు. అప్పుడే ఉపేక్ష ఉదయిస్తుంది.

ఎప్పుడైతే ఉపేక్ష దృష్టి ఏర్పడుతుందో, అనుసయాలు ((proclivities=ప్రవృత్తులు) తొలగిపోయి సమ్యక్ దృష్టి ఉదయిస్తుందో, అప్పుడు ప్రపంచ వాస్తవికత గోచరిస్తుంది. ప్రపంచం అనత్త ( అనాత్మ) అని, అనిచ్చ ( అనిత్య) అని, దుక్ఖ ( దుఃఖ) మని గ్రహిస్తాడు. అలాంటి ప్రపంచం కోసం ఎవడూ అర్రులు చాచడు. తృష్ణ ఉండదు. జన్మ రాహిత్యం జరుగుతుంది. నిర్వాణం పొందుతాడు. బుద్ధుడు ఆశించింది ఇదే. దీనిని పొందడానికి ''విపశ్యన'' అనే ఆచరణ యోగ్య విధానాన్ని ప్రపంచానికి అందించాడు బుద్ధుడు.


1. Civilization and Its Discontents, Standard Edition 21.
2. Nyanaponika, Thera (1962) The Heart of Buddhist Meditation. Newyork : S. Weiser.
3. Ellenberger, H.P. (1970). The Discovery of unconscious London Allen Lane P. 376
4. Morris. H (1988) Reflections on Lacan: His origins in Descertes and Freud", Psychoanalytis quarterly 57; 1867 - 207. P. 199.
5. Gyatso Tenzin (1984); Kindness, clearity and Insight, Ithaca; Snow Lion. P. 40.
6. Buddhaghosa Bhadantacharya (1976). The path of purification, 2 vols. Tr. B. Nyanamoli Boulder. Colo.: Shambhala, P. 763.

# నరసింహ క్షేత్రాలైన బౌద్ధ క్షేత్రాలు

- డా॥ ఈమని శివనాగిరెడ్డి

బౌద్ధ పతనానికి కారణాలుగా మహమ్మదీయుల దాడి, బౌద్ధ సంఘాలు ప్రజలతో కలవక దూరంగా ఉండడం, వజ్రయానం ప్రబలడం దానితో నైతిక పతనం జరగడం మొదలైనవాటిని చెబుతున్నారు. నిజంగా వాటిని బౌద్ధ పతనానికి ఈనాడు కారణాలుగా ఎవరూ అంగీకరించడం లేదు. మహమ్మదీయుల దాడి కారణమైతే, అది హిందూ మతానికీ వర్తిస్తుంది. వజ్రయానం మూలంగా లైంగిక స్వైరత ఎక్కువైందంటే హిందూ మతంలో వామాచారం, పౌండరీకాలు ఉవ్వెత్తున లేచాయి. అయినా హిందూమతం పతనం కాలేదు.

అసలు కారణం, పురాణ యుగారంభంతో (6వ శతాబ్ది) బుద్ధుడు దశావతారాలలో ఒక అవతారం కావడం. బౌద్ధుల అహింసాది నీతి ధర్మాలను హైందవం గ్రహించడం ఆ విధంగా బౌద్ధాన్ని హిందూ మతం కబళించి వేసింది. ఈ ప్రక్రియలో భాగంగా బౌద్ధ క్షేత్రాలమీద అనేక చోట్ల హిందూ దేవాలయాలు వెలిశాయి. పంచారామాలే ఇందుకు మంచి ఉదాహరణ. బౌద్ధ స్థావరాల వద్ద శైవులు శివాలయాలు నిర్మించగా, వైష్ణవులు నరసింహ క్షేత్రాలను ప్రచారంలోకి తెచ్చారు.

మతాంతరీకరణకు ఉత్సవాలను, వేడుకలను, జాతరలను తెలివిగా వాడుకొన్న వైనాన్ని ఈ వ్యాసంలో చూడవచ్చు.

ఇదే పంథాలో అనేక బౌద్ధ క్షేత్రాలను నరసింహ క్షేత్రాలు ఆక్రమించుకొని, బౌద్ధానికి భరతం పాడాయి.

- సంపాదకుడు

150 పైగా బౌద్ధస్థలాలున్న ఆంధ్రప్రదేశ్‌లో క్రీ. పూ. 3 నుంచి క్రీ. శ. 6వ శతాబ్ది వరకూ దాదాపు వెయ్యేళ్లపాటు బౌద్ధమతం విశేష ప్రజాదరణ పొందింది. తోటి మానవుని పట్ల దయ, ఇతర జీవరాసుల పట్ల కారుణ్యం కలిగి ఉండాలని నొక్కి చెప్పిన బౌద్ధ ధమ్మాన్ని వర్ణ, వర్గ భేదం లేకుండా ప్రజలందరూ ఆచరించి అనుసరించారు.

బుద్ధుడు ప్రవచించిన పంచశీల, అష్టాంగ మార్గాల నాచరించి శాశ్వత సుఖాన్ని పొందవచ్చని అనుభవ పూర్వకంగా తెలుసుకొన్న ప్రజలు, బౌద్ధ మతం పట్ల ఆకర్షితులయ్యారు. త్యాగం, దానం,

---

డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి, ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ పురావస్తు పరిశోధకశాఖ, హైదరాబాదులో పనిచేస్తున్నారు. తమ పరిశోధనలో అనేక ప్రాచీన సాంస్కృతిక, చారిత్రక విశేషాలను ఆవిష్కరించారు.

అనుకంపలతో ప్రజ్ఞను సాధించి నిబ్బాణ పథాన్ని చేరుకోవచ్చని స్వయంగా తెలుసుకొని బుద్ధుని బోధనలు నిజమైనవని గుర్తెరిగారు. సమాజంలో పుట్టుక పరంగా గుర్తింపు నిచ్చే హెచ్చు తగ్గులు, కుల గోత్రాలకు తావివ్వని బౌద్ధం మానవత్వ, సమానత్వాలకు పెద్దపీట వేసింది. అందువల్లనే రాజులు, రాణుల నుంచి సాధారణ కుటుంబీకు (గహపతులు) ల వరకూ బౌద్ధం పట్ల విశ్వాసాన్నుంచారు. ఫలితంగా కోస్తా ప్రాంతంలోనూ, ఉత్తర తెలంగాణాలోనూ అది వేళ్లూనుకొని; కొండల మీద, మైదానాల్లోనూ స్థూప, చైత్య, శిలామండపాలతో, విహార, ఆరామాలు రూపు దిద్దుకొన్నాయి.

త్రిరత్న పఠనంతో పులకించిన ఈ నేల ఆచార్య నాగార్జుని లాంటి గొప్ప బౌద్ధ దార్శనికులకు జన్మనిచ్చి, వెలలేని బౌద్ధ సాహిత్యాన్ని అందించింది. మమత, సమతలను వెదజల్లిన బౌద్ధం పట్ల ప్రజల్లో పెరుగుతున్న సాటిలేని ఆదరణ, ఇతర మతాల్లో గుబులు పుట్టించిన మాట నిజం.

రాజీ పడని ధోరణితో ముందుకు సాగుతున్న జైన మతంతో బౌద్ధానికి ముప్పు రాలేదు. యుద్ధాలు, రాజ్యాధికారాలను ప్రోత్సహించి పబ్బం గడుపుకోవటానికి అలవాటు పడ్డ బ్రాహ్మణీయ మతాలతోనే పోటీ వచ్చింది. హింసకు తావులేని సమసమాజాన్ని బౌద్ధం ప్రోత్సహిస్తే, అందుకు భిన్నంగా బ్రాహ్మణీయ మతాలు పర్యవసానంగా జాతి పౌరుషం లేక, చైతన్య రహితంగా కునారిల్లుతుందని నమ్మిన ఆ మతాలన్నీ ఒక్కటై యజ్ఞయాగాదులను, పదవీ వ్యామోహాన్ని పురికొల్పి పరోక్షంగా బౌద్ధం పట్ల ప్రభువుల్లో వ్యతిరేకతను పెంచి, దానికి చేయూత లేకుండా చేయటంలో సఫలమయ్యాయి.

లేని దేవుణ్ణి గూర్చి ఉన్న సమయాన్ని వృథా చేసే బదులు బహుజన హితం కోసం పాటు పడమని బోధించిన బౌద్ధాన్ని నాస్తిక మతంగా ప్రచారం చేసి దాన్ని శాశ్వతంగా తరిమికొట్టడానికి బ్రాహ్మణీయ మతాలు ఎన్నో ప్రయత్నాలు చేశాయి. ఎవరూ ఎప్పుడూ చూడని లెక్కలేనంత దేవుళ్లనూ, దేవతలనూ సృష్టించి, వారికి లేనిపోని మహత్తుల నాపాదించి అమాయక ప్రభువులను, ప్రజలను ఆకట్టుకొని; బౌద్ధ క్షేత్రాలను ఉన్నఫళంగా తమ స్థావరాలుగా మార్చుకోవటానికి ఏ మాత్రం వెనుకాడని వ్యూహం హేతువాదులకు జుగుప్స కలిగించటం నిజం.

బౌద్ధ స్థావరాలుండటానికి అనువైన ప్రదేశాల్లో, ప్రశాంత వాతావరణానికి నిలయాలైన కొండలు, కోనలు, గుహలు, గుహాంతరాలు ముఖ్యమైనవని బౌద్ధ సాహిత్యం పేర్కొంది. ఆంధ్రదేశంలో విశేష ఆదరణ పొందిన 'శేలియ' బౌద్ధశాఖ, తమ స్థావరాలన్నీ కొండలమీద, గుహల్లోనూ ఏర్పరచుకొన్న విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకోవాలి.

శాలి హోండం, శంకారం, తొట్లకొండ, బావికొండ, పావురాళ్లకొండ, ఫణిగిరి, గాజులబండ, నందలూరు, పాండవులమెట్ట, గోపాలపట్నం, అమలాపురం, పెల్లికొండ, పెనుమాక లాంటి చోట్ల

గల బౌద్ధ స్థావరాలు కొండల మీద ఉండగా, గుంటుపల్లి, గోపాలపట్నం, ఎర్రవరం, పాండవుల మెట్ట, మాలకొండ, పెనుమాక, శంకారాల వద్ద రాతిని తొలచి మలచుకొన్న గుహల్లో బౌద్ధులు తమ స్థావరాలను ఏర్పాటు చేసుకొన్నారు. వీటిలో కొన్ని కేవలం థేరవాద కేంద్రాలుగానూ, మరికొన్ని మహాయాన, వజ్రయాన కేంద్రాలుగానూ కొనసాగిన ఆధారాలు దొరికాయి.

శాతవాహన, ఇక్ష్వాకుల కాలంలోనే వేళ్లూనుకొన్న బ్రాహ్మణీయ మతాలు క్రీ.శ. 4-5 శతాబ్దాల్లో పుట్టుకొచ్చిన పౌరాణిక సాహిత్య ప్రభావం వల్ల మరింత పుంజుకొన్నాయి. బౌద్ధ కట్టడాల ప్రాధాన్యాన్ని తగ్గించటానికి వేసిన పథకంలో భాగంగా, ఆలయ నిర్మాణానికి కొండలు, కొండ గుహలు అనువైనవనే ప్రచారాన్ని ముమ్మరం చేయటంతో ఆలయ నిర్మాణం ఊపందుకోవటమే కాక, ఉత్సవాలు కూడా రెట్టింపయ్యాయి. అట్టహాసంగా సాగే ఊరేగింపులు, ఉత్సవాల్లో పాల్గొనటానికి అలవాటు పడ్డ జనం, బౌద్ధ స్థావరాలవైపు వెళ్లడం మానేశారు.

ఒకవైపు ఆదరణ కూడగట్టుకొంటూనే, అడవుల్లో ఉండే తెగలు, జాతులను తమవైపు తిప్పుకొనే ప్రయత్నాలు మరోవైపు చేసిన బ్రాహ్మణీయ మతం, ఆటవికులకు పరిచయమైన జంతువులను, విష్ణుమూర్తి అవతారాలుగా కథలల్లి తేలిగ్గా నమ్మబలికింది.

ఏ విషయంలోనూ పోటీ లేని చారిత్రక వ్యక్తిగా గుర్తింపు తెచ్చుకొన్న బుద్ధుని ప్రభావాన్ని తగ్గించటానికి, కాల్పనిక పురుషునిగా రాముణ్ణి నెత్తికెత్తుకొని, పనిగట్టుక ప్రచారం చేయటంలో కూడా బ్రాహ్మణీయ మతం విజయం సాధించిందనే చెప్పాలి. అంతేకాదు సమాజ రుగ్మతల్ని తొలగించే కేంద్రాలుగా వెలుగొందిన బౌద్ధ స్థూపాలను లంజ దిబ్బలుగా పేరుపెట్టి చారిత్రక విషయాలపట్ల అవగాహన లేని ప్రజలను మభ్యపెట్టి కనీసం ఒక్కసారైనా బౌద్ధ క్షేత్రాలను సందర్శించకుండా చేయటంలో కూడా పై మతం కృత కృత్యమైంది.

అడవి జనం ఉల్లాసంగా జరుపుకొనే ఆటపాటలను సైతం విష్ణుమూర్తి జీవిత ఘట్టాలతో ముడి పెట్టి వారిని తమ వైపు తిప్పుకోవటానికి నరసింహావతారాన్ని ఒక సాపుగా వాడుకొంది. అంతే కాకుండా పండితుల్ని కూడా తమవైపు తిప్పుకోవటానికి దశావతారాల్లో చారిత్రక బుద్ధునికి స్థానం కల్పించటానికి కూడా వెనకాడని వైనం చిత్రమనిపిస్తుంది.

ఆకులతో అలంకరించుకొని, సింహం ముఖాన్ని ముసుగేసుకొని, వింతగొలిపే నరసింహావ తారంగా నాటకీయంగా అడవుల్లో తిరుగాడే విద్యతో, తెగలను, జాతులను పూర్తిగా వశపరచుకొన్నారు. ఒక బ్రాహ్మణీయ మత వాదులు మంది బలాన్ని కూడగట్టుకొన్న ఈ మతస్తులు, వ్యూహాత్మకంగా కొండలపైన బౌద్ధ స్థావరాల సమీపంలోకి జొరబడి తమ ఉనికిని చాటుకొన్నారు.

మానవీయ విలువలను నిలపటానికి పూనుకొని ప్రజల అభిమతమైన బౌద్ధం క్రమక్రమంగా కనుమరుగైంది.

స్థావరాల మార్పిడికి, మతాంతరీకరణకు ఉత్సవాలను వాడుకొన్న ఒక బ్రాహ్మణీయ మతం బౌద్ధ స్థావరాలను నరసింహ క్షేత్రాలుగా మార్చటానికి ఆడిన తెరవెనుక భాగోతం చారిత్రక పరిశోధకులను ఇబ్బంది పెట్టిన మాట వాస్తవం. ఈ ప్రయత్నంలో భాగంగా బుద్ధ జయంతి ఉత్సవాలను సమయ స్ఫూర్తితో వాడుకొన్నారు. ఎందుకంటే బుద్ధ జయంతి నాడు స్థూప చైత్యాలను వందల వేల దీపాలతో అలంకరించటం బౌద్ధుల ఆనవాయితీ. అలా అలంకరించినందువల్లే ధాన్యకటకం స్థూపానికి దీపాలదిన్నె అని పేరు కలిగింది.

బాగా ప్రచారంలో ఉన్న కొండల మీదున్న బౌద్ధ స్థలాల దగ్గర అమితోత్సాహంతో జరుపుకొనే (వైశాఖపున్నమి) బుద్ధజయంతి నాడే వైష్ణవులు నృసింహజయంతిని జరుపుకొనే ఆచారాన్ని ప్రారంభించారు. తేడా అంతా, బౌద్ధ భిక్షువుల స్థానంలో వైష్ణవ పూజారులు, ఉపాసకుల స్థానంలో గుడ్డిగా నమ్మిన పూనక జనం.

ఇప్పుడు నరసింహ క్షేత్రాలుగా వెలుగొందుతున్న విశాఖ జిల్లాలోని పావురాళ్ళ కొండ, సింహాచలం, గుంటూరు జిల్లాలోని మంగళగిరి - పెనుమాక, ఎర్రుబాలెం కొండలు, హైదరాబాదులోని చైతన్యపురి, ప్రకాశం జిల్లాలోని మాలెకొండ, వరంగల్ జిల్లా గీసుకొండల వద్ద బయల్పడిన బౌద్ధ అవశేషాలు, మధ్య యుగాల్లో బౌద్ధ స్థావరాలు నరసింహ స్థావరాలుగా మారిన నిజాన్ని రుజువు చేస్తున్నాయి.

విశాఖ పట్నానికి 30 కి. మీ. ల దూరంలో సముద్ర తీరానగల భీమునిపట్నం (పావురాళ్ళ) కొండ ఇందుకు ఒక చక్కని ఉదాహరణ. ఏకచక్రపురమనే పేరుగల ఈ పట్నం వద్ద భీముడు బకాసురుని చంపటం వల్ల దానికి భీమునిపట్నం అనే పేరు కలిగిందనీ, తన పాప పరిహారం కోసం భీముడే స్వయంగా ఇక్కడి కొండపై నరసింహ స్వామికి ఆలయాన్ని కట్టించాడనీ, అప్పటి నుండి ఆ కొండకు నరసింహ స్వామి కొండ అని పేరు కలిగిందని స్థానిక స్థల పురాణం చెబుతుంది. వాస్తవానికి ఈ ఆలయం 16వ శతాబ్దంలో నిర్మించబడింది. చారిత్రక ఆధారాలు లభించని మహా భారత కథనంలోని భీముడే ఈ గుడిని కట్టించాడనటం హేతుబద్ధం కాదనేది నిర్వివాదాంశం. కొండకింది నుంచి మీద దాకా ఉన్నమెట్ల వరుసలపై దీపాల నెలిగించుకోవటానికి, నూనె పోసుకోవటానికి వీలుగా చెక్కిన గుంటలున్నాయి. ఈ మెట్లు కొండమీదున్న రామ, లక్ష్మణ, సీత, హనుమద్గుండాలను చేరుకోవటానికి అని కూడా స్థలపురాణం చెబుతుంది.

1990లో పావురాళ్ల కొండమీద రాష్ట్ర పురావస్తు శాఖ జరిపిన తవ్వకాల్లో క్రీ.పూ. 2- క్రీ. శ. 1 శతాబ్దాలకు చెందిన బౌద్ధస్థావరం, శాతవాహన, రోమను నాణేలు, అప్పటిపాత్ర సామగ్రి బయల్పడ్డాయి. వాసయోగ్యమైన ఈ స్థలంలో ఆరామాన్ని నిర్మించుకొన్న బౌద్ధులు స్థల ఎంపికలో చూపిన శ్రద్ధ అంతా ఇంతా కాదు. పాండురంగ మహాత్మ్యంలోని మరో కథ ప్రకారం, గోస్తనీ సాగర సంగమ స్థానంలో గల నరసింహ క్షేత్రంలో నిగమశర్మ చనిపోయాడని పేర్కొన్న స్థలాన్ని భీమునిపట్నంగా గుర్తించారు. ఇలా ఒక ప్రదేశాన్ని పురాణ పురుషులు తిరుగాడినస్థలంగా ప్రచారం చేయటం మనకు కొత్తేమీ గాదు. పావురాళ్ల కొండమీద బౌద్ధులు మంచినీటి కోసం తవ్వించుకొన్న రాతి తొట్లను రామ, లక్ష్మణ, సీత గుండాలుగా పేర్లు మార్చటం గూడా మతాంతరీకరణలో భాగమే.

విశాఖ సమీపంలోని సింహాచలం కొండ అంచుల్లోను, మీదా బౌద్ధ ఆనవాళ్ళు బయల్పడ్డాయి. 1990లో గోపాలపట్నం - సింహాచలం కొండల మధ్య మాధవధార దగ్గర జరిపిన పరిశోధనల్లో క్రీ.శ. 1వ శతాబ్ది నాటి బౌద్ధ స్థూప పునాదులు వెలుగుచూశాయి. నరసింహక్షేత్రమైన సింహాచలం కొండమీద కూడ వైశాఖ పున్నమి రోజునే ఉత్సవాలను ఘనంగా జరుపుకోవటం గమనించాల్సిన విషయం.

ప్రకాశం జిల్లా కందుకూరు దగ్గరున్న మాలెకొండ (మాల్యాద్రి) వద్ద క్రీ. పూ. 3వ శతాబ్దానికి చెందిన బౌద్ధగుహలున్నాయి. వాటిలో పార్వతీ గుహపై నున్న బ్రాహ్మీశాసనంలో ఈ గుహలను సిరి గిరి శెట్టి తొలిపించాడని ఉంది. బౌద్ధ బిక్షువులు పడుకోవటానికి రాతి శయ్యలు గూడా ఉన్న గుహలు వస్సవాసంగడపాటికి చెక్కినవై ఉంటాయి. బౌద్ధ స్థావరాలైన ఈ గుహలు మధ్య యుగాల్లో నరసింహ క్షేత్రంగా మారిపోయాయి. ఆంధ్రదేశంలోని 32 నరసింహ క్షేత్రాల్లో ఇదొకటి.

ఇక హైదరాబాదు నగరంలో మూసీనదికి ఒడ్డునే ఉన్న చైతన్యపురి కాలనీలో గల కొసగుండ్ల నరసింహస్వామి ఆలయానికి ఒక ప్రత్యేకత ఉంది. అదేమిటంటే 1984లో అదేగుట్టలమీద కనుగొన్న ఏడులైన్ల బ్రహ్మ శాసనంలో ఇక్కడ గోవింద రాజ విహారమనే బౌద్ధ స్థావరం, భదంత సంఘదేవ, పిండ పాతిక ధమ్మధర అనే బౌద్ధ ఆచార్యుల ప్రస్తావన కూడా ఉంది. క్రీ.శ. 4వ శతాబ్దికి చెందిన ఈ స్థావరానికి విష్ణుకుండిన రాజు గోవింద వర్మ చేయూత నిచ్చిన ఆధాలు కూడా లభించాయి. అయితే దాదాపు 50 ఏళ్ల కింద నుంచే చైతన్యపురి గుట్టల అడుగు భాగంలో గల గుహలో నరసింహస్వామి వెలిచాడనే ప్రచారం కలిగింది. నిజానికి అక్కడ విగ్రహం చెక్కిన ఆధారాలు లేకపోగా, పసుపు రుద్దీ రుద్దీ నరసింహ రూపం కన్పించేట్లు చేసిన ప్రయత్నమేనని వేరే చెప్పాల్సిన అవసరం లేదు. కొండ, గుహ, మెట్లున్న ఇలాంటి అనేక బౌద్ధ స్థావరాలు ఇలా నరసింహ క్షేత్రాలుగా మారిపోయి, బౌద్ధాన్ని సమూలంగా పక్కకు తప్పించిన విషయం బాధాకరమే.

# బౌద్ధం నుండి భారతం దాకా

- వావిలాల సుబ్బారావు

యజ్ఞయాగాది క్రతు కలాపాన్ని, వేదపరమ ప్రామాణ్యాన్ని వర్ణక్రమ వ్యవస్థాధికారాన్ని, ఎదిరించి హేతుబద్ధమయిన ప్రత్యామ్నాయాలను, స్వీయ బాధ్యతతో చేసే ప్రయాణమే దుఃఖ రహితస్థితికి, నిర్యాణానికి దారి తీస్తుందని, ప్రతిపాదించి, ఘంటాపథం చేసిన బౌద్ధం, క్రమ క్రమంగా దారులు మారి ఈ దేశం నుండి ఎందుకు కనుమరుగయింది? - ఇది సమగ్రమయిన సమాధానం దొరకని ప్రశ్న. ఏ సమాధానాన్ని పరిశీలించినా మిగిలిపోయే అంశాలు ఇంకా చాలా ఉంటాయి. బహుశ అన్ని సమాధానాలు కలిసి ఏక సమాధానంగా రూపొందవలసి ఉంటుంది.

ఏ కొత్త ధార్మిక చింతన వచ్చినా, గతంలోని లోపాలను సరిదిద్దటం - ప్రత్యామ్నాయాలను సూచించటం అన్న రెండు ముఖాలు అందులో ఉంటాయి. ఏ నవ్యధర్మమయినా సర్వ స్వయం భవం కాదు. పూర్వచింతనా నిరపేక్షం కాదు. అట్లాగే ప్రజా ప్రయోజనాల, ధార్మిక అవసరాల, అంతరంగ ప్రవృత్తుల బలహీనతల సమాధానం కోసమే తప్ప అనవసరంగా ప్రవక్తాల సరదాకోసం మతాలు పుట్టవు. కనుక మతమన్నా, ధర్మమన్నా అనవసర కల్పనలు కావు. స్వార్థ పూరిత వ్యూహ రచనలు కావు. ఆచరించే వర్గాల ప్రాబల్యం వల్ల స్వార్థ లక్షణాలు తర్వాత ప్రవేశించటం పరిణామంలో భాగవేగాని ప్రాదుర్భావంలో భాగం కాదు. పుట్టుక - వికాసం - నిష్క్రమణ అన్నింటిని పరిణామానుకూలంగా పరిశీలించటమే సమంజసం.

బుద్ధుని బోధలు చాలా సరళంగాను సులభ సుందరంగాను కనిపించవచ్చు. సమ్యగ్జీవనంతో దుఃఖ నివారణ అవుతుందని జీవితాన్ని క్రమ శిక్షణా యుతంగాను ఆత్మ సంయమనంతోను ఉండమనటం - ఎంత సరళమో అంతకష్టతరం. లోకాన్ని జయించటం కన్నా తనను జయించుకొనటమే కష్టం కనుక బుద్ధుని మార్గం కొద్దిమంది పరమ సాధకులకు సాధ్యమయిన 'యానం'

మిగిలి పోయిన అనేక మంది కొక యానం ( మహా యానం) కావాలి. వారి బలహీన మనస్సులకు గూడ సాధనోపాయం చెప్పగలగటం బౌద్ధ ధర్మ వికాసంలో ఒక అనివార్యమయిన అవసరం. అంతరంగ సాధనలోని కష్టాలను అధిగమించటానికి ఒక తెప్పకొయ్య కావాలి. హేతుబద్ధ సిద్ధాంతాలతో మాత్రమే చర్చించేవారికి సాధన శ్రమ తెలియక పోవచ్చును.

ఈశ్వరుణ్ణి ఆత్మను మన ఆలోచనా పరిధిలో నుండి తొలగిస్తే చాలా స్వేచ్ఛా లభించినట్లే ఉంటుంది. ఆత్మ విశ్వాస బలం ఉన్నవారి ప్రయత్న విస్తృతికి ఈ భావాలు అవరోధంగానే ఉండవచ్చు. కాని ప్రజా సమూహంలో బలహీనులదే సంఖ్యాబలం. వారి ప్రయాణానికి ఈశ్వర భావం, ఆత్మ శాశ్వతత్వభావం - ఊతకర్రలుగా ఉపకరిస్తాయి. స్వావలంబన శక్తి లేనివారికి ఆధారభూమి కరిగి పోయినట్లు కనిపిస్తుంది. అర్థ సత్యమో - సాధనోపాయమో ఏదో ఒకటి - ఆత్మా విశ్వాసానికి ప్రత్యామ్నాయ విశ్వాసం కలిగించాలి. ఇదిగూడ ఒక సామాజిక అవసరమే. ఈ అవసరాన్ని గుర్తించిన తర్వాత మతచట్రంగూడ ఒక అనివార్యంగానే మారుతుంది. ధర్మం మతంగా వేషం వేసుకుంటుంది. మహాయానం తీర్చిన అవసరాలలో ఇదొకటి. నాగార్జునుడు బౌద్ధానికి బ్రాహ్మణ రంగు పూశాడని

---

డాక్టర్ వావిలాల సుబ్బారావు ధరణికోట కళాశాల ప్రిన్స్‌పాల్‌గా రిటైరై
ప్రస్తుతం అమరావతిలో ఉంటున్నారు.

వ్యాఖ్యానించిన వారికి తత్వశాస్త్రం లోతులు తెలిసినంతగా సాధకుని కష్టాలు తెలిసి ఉండక పోవచ్చు. సామాజిక బలహీనులున్నట్లే సాధన శక్తి హీనులు గూడ ఉంటారు. వారిని బోధకులు ఆచార్యులు ఒక కంట కనిపెట్టి ఉంటారు.

ధేరవాద బౌద్ధం జీవితం దుఃఖానికి నివారణ చెప్పగలిగిందోగాని, సహజమయినా, జీవితవైవిధ్యాన్ని సహజ ఉద్వేగాలకు తగురీతి మార్గ దర్శకత్వం చేయక అన్నింటిని వైరాగ్యంలోకి సంయమనాలలోకి పర్యవశింప జేసింది. మహా యానం సృజనాత్మక వైవిధ్యానికి అవకాశం కల్పించిందనిపిస్తుంది.

గౌతముని బోధలు దేశమంతటా వ్యాపించినపుడు అవి స్థానిక విశ్వాసాలతో సమ్మిళతమయి భిన్న రూపాలను పొందాయి - మహాత్ముల ప్రవచనాలు - ఎక్కడో ప్రారంభమైనా మహానదులవలె స్థానిక సాంప్రదాయాలతోను విశ్వాసాలతోను మిళితమై ప్రజలకు సన్నిహితమవుతాయి.

మహా సాంఘికుల ప్రధాన భూమి ధాన్యకటకం (నేటి అమరావతి - ధరణికోట) ఈ వాదం నుండే మహాయానం వికాసం పొందింది. ఇందులో బహుశా ఆరాధన ప్రధాన స్థానమాక్రమించింది. ఆరాధన భక్తి మార్గానికి దారి తీస్తుంది. జ్ఞానం, ఆచరణలకన్న - ఆరాధన భక్తి పద్ధతులు సామాన్యులను త్వరగా ఆకర్షిస్తాయి. ఆ తర్వాత, కథా కల్పనలో మూర్తి పూజలు అవతార కల్పనలు విస్తరించటం అలవోకగా జరిగి పోతాయి. ఇవన్నీ సాధకులకు అభి లాషలకు కొంత సృజనా శీలతతోపాటు భావ తృప్తి నిస్తాయి. ఇదంతా సత్యానికి దూరంగా జరగటంలా కనిపించవచ్చు. కాని ప్రజలలో బౌద్ధానికి నూతన ఉత్తేజంకలగటం వాస్తవం.

ఈనూతన ఆచరణ రూపాలు హిందూమతానికి బౌద్ధానికి దూరం తగ్గించి ఉంటాయి. వర్ణభేదంగల హిందూ సమాజంలో పౌరోహిత్యావసరంలేని భక్తి ఆరాధనలు, ఆధ్యాత్మకాన్ని అందరికి ఉపాదేయం చేసింది. ఈరకంగా హిందూ సమాజానికిగూడ కొన్ని పరిష్కారాలు చేరువ అయినాయి.

ఈ రకమయిన పరిణామం పేరు చెప్పని పునర్విచారణ భారతేతిహాసంలోను భగవద్గీతా శాస్త్రంలోను ఎక్కువగా జరిగి ఉంటుంది. భగవద్గీత, భారత రచన (కథ ఎప్పుడు జరిగినా) బుద్ధుని తర్వాత కాలం నుండి ఇటీవల కాలం వరకు (క్రీ.శ. 4వ శతాబ్ది) జరుగుతూనే ఉంది. భగవద్గీత గురించి మొదటి చారిత్రక ప్రస్తావన హ్యూయాన్‌సాంగ్ (7వ శతాబ్ది) లో కనిపించిందన్నారు. భారతం క్రీ.పూ. 400 నుండి క్రీ.శ. 400 వరకు విస్తరిస్తూనే ఉందిట - భగవద్గీత రచన క్రీ.శ. 200ల వరకు అన్నారు. ఆచార్య నాగార్జునుడు గూడా ఇదేకాలం వాడు.

భగవద్గీతలో ప్రధానాంశాలు రెండు. 1. నిష్కామ యోగం అనబడే కర్మాచరణకు సంబంధించిన తాత్విక దృక్పథం. 2. వాసుదేవభక్తి.

కర్మ ఉన్నంతవరకు ఫలితం ఉంటుంది. కోర్కెల నుండి కర్మలు - వాటినుండి దుఃఖం కలుగుతుంటాయి. ఈ గొలుసు నుండి బయట పడటానికి నిష్కామ కర్మను గీత ప్రతిపాదిస్తుంది. కాని ఏ కోర్కెలు లేకుండా కర్మ నాచరించటమా! యంత్రాలకు మాత్రమే ఫలితం మీద కోర్కె ఉండదు. మనిషి వేరుగదా - అందుకని భక్తి అనే ఆలంబనతో ఫలితభారమంతా భగవంతునికి అర్పణ చేయమన్నాడు. 'నేనున్నాను నీకేం పర్వాలేదు నీవు నడువు ముందుకు'' - అన్న హామీలో నిజమెంతోగాని - బలహీనుడికి అది ఇచ్చే అండ కొండంత. నిష్కామ కర్మ ధేరవాద లక్షణమయితే, భక్తితో ఆలంబన పొందటం మహాయాన గుణం. ఈ రెండు గీతలో సంగమించాయి.

గీతోపదేశం కార్యశీలికి కలిగే సందేహసమయంలోనే జరిగింది. నిష్కామాన్ని బోధిస్తూనే అంతర్వాహినిగా, భక్తిని ప్రవేశపెట్టారు.

జన్మ పరంపర నుండి విముక్తిని పొందటం ఉపనిషత్తులు చెప్పక పోయినా గీత చెప్పింది. గీతకు బహుశ సమకాలీనుడయిన ఆచార్య నాగార్జునుడుగూడ - జన్మలను - వాటి కార్య కారణ పరంపరను సుష్టూల్లేఖలో చెపుతాడు. కర్మ సిద్ధాంతం ప్రధానంగా బౌద్ధానిది. నిర్వాణ భావం గూడ వారిదే. నిర్వాణం అనే భావం బౌద్ధానికి ముందు వేదవాఙ్మయంలో చేరటం అష్టాధ్యాయిలో 'నిర్వాణ' శబ్దం నిష్పన్నం చెందు, నశించుట అనే అర్థంలోనే వాడారుగాని మోక్షం అనే అర్థంలో వాడలేదని పండితాభిప్రాయం.

బౌద్ధంగూడ రాగరాగ ప్రజల భాషను వదలి, పండితమన్నన కోసం కాబోలు, సంస్కృతాన్ని ఎక్కువగా వినియోగించటం ప్రారంభించింది - భావాలలోను భాషలోను బౌద్ధం - వైదిక - పురాణ మతాలు సమీపం అవుతున్నాయి. కొన్ని తాత్త్విక భావనలను బౌద్ధంనుండి స్వీకరించి మార్పును పొందుతున్న క్రమంలోనే 24వేల శ్లోకాల భారతం లక్ష శ్లోకాలకు విస్తరించింది. అసలు 'జయ' మన్ భారతం నాల్గవ వంతు అయింది.

సాధారణ ప్రజలు వినటానికి బాగా ఇష్టపడే వీరగాథలతో తాత్త్విక విషయాలను రంగరించి కథారూపం ఇస్తే ప్రజలలోకి సులువుగా వ్యాపిస్తాయి. అనేక జానపదగాథలు కౌరవ, పాండవ కథా సూత్రంతో మెలిపడిపోయి ఉంటాయి. వ్యక్తివి, సమాజానివి అనేక ధర్మాలు భారతకథతో సమ్మేళనం పొందాయి. అందువల్ల మహాభారతంతో ఆర్షమతానికి ఒక మంచి ప్రచారసాధనం ఏర్పడింది. ఆగ్నేయ ఆసియా దేశాలలో ఎంతగా బౌద్ధం వ్యాపించినా రామాయణ భారతగాథలుగూడ ఆదరించబడటం గమనిస్తాం.

బౌద్ధం యజ్ఞ యాగాదులను నిరసించటం వల్లనే కాబోలు ఇంద్రుడు మొదలయినవైదిక దేవతలు అనంతర కాలంలో తెరవెనక్కు వెళ్లారు. భారతం మళ్లీ అతణ్ణినెత్తికి ఎత్తుకోలేదు. ఇంద్రునికి తర్వాతి స్థానీయుడయిన విష్ణువు ( ఉపేంద్ర- ఇంద్రావరజ) పురాణ కాలానికి - ఇంద్రుని కన్న అధికుడయినాడు (గోవర్ధనపర్వతగాథ) విష్ణువే అయినాడు. అతడే రక్షకుడై భక్తికి కేంద్రమయినాడు.

కృష్ణపాత్రలో - తాత్త్వికుడు, బాలుడు, శృంగారి, సారధి - అన్నీ కలబోసి ''ఆల్ఇన్వన్'' పాత్ర అయినాడు. భక్తుల సృజనాత్మక భావనకు వ్యాప్తిని కలిగించాడు. అన్నింటి మించి నన్ను శరణు వేడితే చాలునన్న 'హామీ' ఇచ్చాడు.

బౌద్ధం వ్యతిరేకించిన యజ్ఞయాగాది క్రతువులకు వేరే నిర్వచనం చెప్పి త్యాగాన్ని వైరాగ్యాన్ని సన్యాసాన్ని జోడించి గీత రాజీ చేసింది. బౌద్ధ పరివ్రాజక సంప్రదాయ ప్రభావంతో, వేదాలలో కనిపించని వానప్రస్థ, సన్యాసాశ్రమాలు ఉపనిషత్కాలం నుండి క్రమంగా ప్రవేశించాయి.

అనిర్వచనీయాన్ని, నిర్గుణ చైతన్యాన్ని ప్రతిపాదిస్తూ బౌద్ధానికి - ప్రపత్తిని ప్రతిపాదిస్తూ భక్తికి - ప్రకృతిలోని శ్రేష్ఠ వస్తువులన్నింటా తానేనంటూ ప్రకృతి ఆరాధనను ఒకే విశ్వాస భూమిలో ఇమడ్చటానికి కృష్ణపాత్ర ద్వారా గీత, భారతం ప్రయత్నం చేసాయి.

భారతంలోని ధర్మ ప్రవచనాలు ధర్మరాజు, అర్జునుడు కారణంగా జరిగాయి, శాంతిత్రయం - అరణ్యపర్వం. గీత భారతానికి పంచమ వేదగౌరవం కలిగించాయి.

ధర్మరాజు యుద్ధం రాకముందే దాని అవాంఛనీయతను గుర్తించి, అయినా తప్పని బాధ్యతగురించి వాపోతాడు ''క్షాత్ర ధర్మమింత కష్టమగునే'' - అంటూనే ''శస్త్రజీవికియిలాగెయున్నది'' - ఐన వంశనాశన మనభి మతంబు'' అని ధర్మ సంకటాన్ని బిగ్గరగానే విచారిస్తాడు. అహింసకు - పాలక ధర్మానికి మధ్య నలుగుతాడు. అశోకునికి యుద్ధానంతరం కలిగిన విచికిత్స ధర్మరాజుకు ముందుగానే కలుగుతుంది. అయినా బాధ్యతగా యుద్ధాన్ని స్వీకరిస్తాడు. ధర్మజుని పాత్ర విస్తరణలో అశోకుడు రచయితల మనస్సులో మెదలకపోడు.

అనేక ఉపాఖ్యానాలు అహింసా ధర్మాన్ని - త్యాగ ఉత్కృష్టతను తెలుపుతాయి. శిబి, కపోత, ధర్మవ్యాధ ఉపాఖ్యానాలు వంటివాటిని పరిశీలిస్తే, - వీటిని వ్రాయటానికి బౌద్ధం ఎంత కారణమయి ఉంటుందో ఊహించవచ్చు.

గీతోపదేశం పొందిన అర్జునుని లక్షణం వేరు. ఇతను అన్నగారి వంటి ధర్మకృషికాడు. అతని తాత్కాలిక యుద్ధ విముఖత - బోధతోను - విశ్వరూపంవంటి హామిలతోను చెదరి పోయింది. విశ్వాసం అనే ఊతకర్ర అవసరమయిన కార్యశీల వ్యక్తిత్వం అర్జునుడిది. విశ్వాసం కోసం ఎదురు చూచే అర్జునుని వంటివారే ఎక్కువమంది ఉంటారు. వీరికి భక్తికుదరక పోతే నిస్పృహతోడి మెట్టవేదాంతమో - భోగపరాయణతో ఆవరిస్తాయి. ధర్మరాజు లాగ నైతిక చైతన్యంగల నిగ్రహ సంపన్నులు - బౌద్ధంలో థేరవాదులవంటివారు. వెలుపలనుండి అభయం కోసం ఎదురు చూచే అర్జునుని వంటివారు బహుశ మహాయాని.

సనాతన ధర్మాన్ని ఎదిరించి 500 సంవత్సరాలు దృఢంగా నిలిచిన నవ్య ధర్మాలకు ( బౌద్ధజైన) సమాధానమో సమన్వయమో చెయ్యకుండా వైదిక పునరుద్ధరణ సాధ్యం కాదు. సనాతన వ్యవస్థలో నిరాదరణ పొందిన వాటిని కొన్నింటిని వొదులుకొని - నవ్య ధర్మంలో ప్రజామోదాన్ని పొందినవాటిని స్వీకరించి కొత్త రసాయనాన్ని తయారు చెయ్యటమే మహాభారత ప్రయత్నంలా తోస్తుంది. బౌద్ధం ప్రవచించిన అహింసను; అందరూ మోక్షానికి అర్హులేనన్న ప్రతిపాదనను, భారతం ఆమోదించింది. బౌద్ధం నిరాకరించిన వేద ప్రమాణ్యాన్ని - వర్ణ ధర్మాన్ని భారతం వొదలుకోలేక పోయింది. ఇంకా సూక్ష్మ సూక్ష్మేతర అంశాలను పెద్దలు పండితులు మాత్రమే వివరించగలరు.

*సంప్రదించిన గ్రంథాలు :*

భగవద్గీత చారిత్రక పరిణామం - D.D. కోశాంబి
బౌద్ధమతము - ఆంధ్ర దేశము - బి. యస్. యల్. హనుమంతరావు
The age of Satavahanas - బి. యస్. యల్. హనుమంతరావు
ఆంధ్రుల చరిత్ర - బి. యస్. యల్. హనుమంతరావు
భారతీయ తత్వ శాస్త్రము - సర్వేపల్లి
II, III సంపుటలు
2500 Years of Buddhism - Govt. of India
సుహృల్లేఖ
బౌద్ధ దర్శనము - N. రామ్‌శాక
Cultural Heritage of India - R.K. Mission

# మాధ్యమిక శూన్యత

- ఎమ్. రాజగోపాలరావు

ఆచార్య నాగార్జునుని మాధ్యమిక వాదం ఈ నాటికీ దర్శన సామ్రాజ్యాన్ని ఏలుతున్నది. ఏనాటి నుంచో ఆదరణమందిన ఆచార్యుని చింతనా గాంభీర్యం, వైవిధ్యం ఈనాటి వారిని ఆకట్టుకొంటున్నది, అధ్యయనాలకు పూనుకో జేస్తున్నది. ఆర్యదేవ, బుద్ధపాలిత, భావవివేక, చంద్రకీర్తి, శాంతిదేవ, వసుబంధువంటి ఉద్దండుల చేతులలో పరవళ్లు తొక్కిన మాధ్యమిక వాదం మధ్యలో ప్రాసంగిక, స్వాతంత్రిక శాఖలుగా చీలిపోయినా మళ్లీ ప్రాసంగికతా ప్రాధాన్యం గుర్తింపు పొంది సమైక్యవ్యవస్థగానే కొనసాగుతున్నది.

ఆచార్యుని మాధ్యమిక వాదానికి శూన్యత కేంద్రబిందువు. మాధ్యమిక వాదమే శూన్య వాదంగా ప్రసిద్ధి చెందింది. శూన్యతా ప్రాధాన్యంతోనే చైనాలో 4వ శతాబ్దంలో మాధ్యమిక గ్రంథాల ఆధారంగా 'త్రిశాస్త్రశాఖ'[1] ఏర్పాటయింది. అదే కొరియాద్వారా జపాన్ జేరి ఆరో శతాబ్దానికి 'సకరన్' శాఖగా ప్రసిద్ధి చెందింది. ఎనిమిదో శతాబ్దానికే టిబెట్ చేరిన శూన్యవాదం మహాశూన్యవాదంగా తంత్రయానానికి మూల సూత్రమయి పోయింది. టిబెట్ దేశస్థులు ఆచార్యుని రెండో బుద్ధునిగా ఈనాటికీ ఆరాధిస్తూనే ఉన్నారు.

ఆచార్యుని సొంతగడ్డ, భారతదేశంలో బౌద్ధాన్ని కారుమేఘాలు అవరించిన కాలంలో గూడా ఆచార్యుని చింతనా ప్రభావం కొనసాగింది. ఆచార్యుని శూన్యవాదాన్ని విమర్శిస్తూనో పరామర్శిస్తూనో అటు తరవాత అభివృద్ధిచెందిన ఆస్తికదర్శనాలు తమనుతాము తీర్చి దిద్దు కొన్నాయి. ఆ ప్రతిమ అప్రతిహతంగా కొనసాగిందని మాధవాచార్య సర్వదర్శన సంగ్రహం, హరి భద్రసూరి షడ్దర్శనసముచ్చయాల ద్వారా అర్థమవుతుంది. సర్వదర్శన సంగ్రహం[2] బౌద్ధంలో ప్రసిద్ధ శాఖలుగా మాధ్యమిక యోగాచార సౌత్రాంతిక వైభాషికలను పేర్కొంటుంది. బౌద్ధ ధర్మాన్ని సంక్షిప్తంగా అందించిన 'షడ్దర్శన సముచ్చయం'[3] క్షణికతను, కల్పనా పోఢను ప్రస్తావించటం ద్వారా తరవాత అభివృద్ధి చెందిన దృక్పథాలను అభివ్యక్తం జేస్తుంది. ఆస్తిక దర్శనాలకు అంకితమయిన ఆచార్యులు బౌద్ధంవంటి ప్రసిద్ధ నాస్తిక దర్శనాన్ని పరిగణించటమే దాని విశిష్టతను వ్యక్తం జేస్తుంది.

నాగార్జునుని మాధ్యమిక వాదానికి బుద్ధుని మధ్యమ ప్రతిపత్తే ప్రేరకం. ఆనాటి అసంపూర్ణ మిథ్యావాదాలతో వాద వివాదాలతో తల మునకలయిపోయి కామసుఖల్లికానుయోగం ఆత్మఖిల మథానుయోగం వంటి తీవ్రధోరణులను అనుసరిస్తూ వారివాదమే మోక్షదాయకమని సామాన్యులను నమ్మించచూస్తూ రేకెత్తించిన గందరగోళంనుంచి రక్షించటానికి స్వయం కృషితో మధ్యేమార్గాన్ని ఆవిష్కరించుకొని దానిని అందరికీ అందించి ఎవరిముక్తికివారు కృషి చేసుకోవటానికి ప్రేరేపించాడు, బుద్ధుడు. ప్రతీత్య సముత్పాదం ద్వారా అష్టాంగ మార్గం ద్వారా ఆ తీర్థంకరుల ప్రయత్నాలకు అడ్డుకట్ట వేశాడు.

అటువంటి పరిస్థితే మళ్లీ ఆచార్య నాగార్జునునికి ఎదురయింది. నైయాయిక్, వైశేషికులవంటి ఆస్తిక వర్గాలొకవైపు, సౌత్రాంతిక వైభాషిక వంటి ఆభిధార్మిక వర్గమొక వైపు రకరకాల వాదాలలో మునిగి తేలుతుండేవారు. అందరూ యథార్థాన్ని తార్కికంగా నిరూపించటానికి ప్రయత్నించేవారే. ఆత్మ, కర్మ, కాలం, గతి, స్వభావం, సంసారం, బంధం, మోక్షం వంటివాటి శాశ్వతత్వాన్ని ఆస్తికులు తార్కికంగా నిరూపించజూస్తుంటే, ఆర్యసత్యాలు, ప్రతీత్యాసముత్పాదం, నిర్వాణం వంటివాటిని

డాక్టరు యమ్. రాజగోపాలరావు ప్రస్తుతం నాగార్జున విశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ బుద్ధిస్టు స్టడీస్‌లో ఆచార్యులు. గుంటూరులో ఉంటున్నారు. బౌద్ధ సాహితి చిరునామా.

తార్కికంగా విశ్లేషించి, ధర్మాలుగా విభజించి వాటికి శాశ్వతత్వమాపాదించి బుద్ధుని ధర్మ మౌలిక స్వభావాన్నే మార్చివేశారు ఆభిధార్మికులు. ఈ శాఖలకూ, సిద్ధాంతాలకూ, వాదాలకూ అతీతంగా బుద్ధుని ధర్మాన్ని బుద్ధ వచనానుసారంగా పునరుద్ధరించే ప్రయత్నంలో సాగిన ఆచార్యుడు వారి తార్కిక నిరూపణలన్నిటినీ తార్కికంగానే ఎదుర్కొంటూ వాటిలోని అంతర్గత అతార్కికతను, వైరుధ్యాలను ప్రదర్శిస్తూ వారెవరూ యథార్థాన్ని యథాతథంగా అందుకోలేరని నిరూపిస్తూ వారి తార్కిక నిరూపణలన్నీ పరస్పరం ఆధారపడుతూ ఉత్పత్తి అయేవే కనక - ఏవీ స్వతంత్రంగా సంభవించవు కనక - స్వభావశూన్యాలని వివరిస్తూ బుద్ధుని మధ్యమ ప్రతిపత్తికి ప్రతీక అయిన ప్రతీత్య సముత్పాదం మౌలికంగా శూన్యతా ప్రతిపాదకమేనంటూ బుద్ధుని అనిత్యాన్ని శూన్యతగా తీర్చి దిద్దాడు. ఆచార్యుని ''మాధ్యమక కారిక'' ఆ కృషికి అద్దం బడుతుంది. అదే ఆచార్యుని మాధ్యమిక ప్రవక్తను గావించింది. మాధ్యమికమే శూన్యతగా ప్రసిద్ధమయి పోయింది.

ఆధునిక అధ్యయనాలకు మాధ్యమిక - శూన్యత అన్వేషణా మంత్రమయి పోయింది. ఆచార్యుని గ్రంథాలను అధ్యయనం చేస్తూ ఆచార్యుని గంభీర చింతనను అర్థం జేసుకోవటానికి ప్రయత్నిస్తూ ఎవరికి అనువయిన విధంగా వారు ముందుకు సాగుతున్నారు. ఆపదాల వ్యుత్పత్తి అర్థాలను పరిశీలిస్తున్నారు. నిర్వచనాలను సమకూరుస్తున్నారు. మాధ్యమికాన్ని - శూన్యతను వాదాలుగా పరిగణిస్తూ ఆధునిక ప్రపంచంలో ప్రసిద్ధంగా ఉన్న వాదాలతో సరి పోలుస్తూ తులతూస్తూ వాటి ఔన్నత్యాన్ని అంచనా వేయటానికి ప్రయత్నిస్తున్నారు. శూన్యత పద అనువాద సరళిలోనే ఆధునిక అధ్యయనాలలో ఆ పదమందుకొన్న ప్రాధాన్యం అభివ్యక్త మవుతుంది.

ఎక్కువమంది శూన్యతను నిఘంటు అర్థంలో అనువదించుకొని అర్థం జేసుకోజూచారు. "Nothingness", "emptiness", "extinction", "voidness", "vacuum" - వాటిలో ప్రధానాలు. కొందరు ఆపదాన్ని సందర్భ సహితంగా గ్రహించుకొని "relativity",(4) "devoid",(5) "equality"(6) గా అనువదించారు. శూన్యతకు 'శ్వి' అను ధాతువును మూలంగా గ్రహించి 'శ్వి' అంటే 'ఉబ్బు' కనక, పైకి ఉబ్బుగా ఉండి లోపల ఖాళీగా ఉండటాన్ని శూన్యత సూచిస్తుందనీ పంచస్కంధాలతో నిర్మితమయే పదార్థాలన్నీ అటువంటివే కనక శూన్యతవాటి అన్నిటికీ వర్తిస్తుందనీ ఆ భావమందించటానికే చైనా కళలో శూన్యతను ఖాళీ సున్నగా 'O' చిత్రిస్తారనీ కోంజె వివరించాడు.(7) ఇందరు ఇంత శ్రమ చేసి ఈ పదాన్ని అర్థం జేసుకో జూస్తుంటే, మన అమరకోశం ''శునేహితం శూన్యం '-( కుక్కలకు హితమయేది') అని వివరించి ఆపద సంస్కృతమూలాన్నే శంకింపజేస్తుంది.

బౌద్ధసాహిత్యంతో సాన్నిహిత్యమున్న వారిని ఈపదం ఆశ్చర్యపరచదు. శూన్యతా పదం ఆచార్యుని సృష్టికాదు. ఆచార్యుడు దానిని వివరించిన తీరులోనేనూతనత్వంగోచరిస్తుంది. ఆచార్యునికి పూర్వమే మహాయాన సూత్రాలున్నాయి. ప్రజ్ఞాపారమిత సాహిత్యముంది. వాటిలో ఆచార్యుడు శూన్యత పదం ద్వారా సాధించిన అవగాహనా వైవిధ్యమంతా గోచరిస్తుంది. అందువల్లనే ఆచార్యుని ప్రజ్ఞా పారమితా సాహిత్య కర్తగా గూడా కొందరు భావించారు. ఆ సాహిత్యంలో తొలి స్థానం పొందే ''అష్టసాహస్రిక ప్రజ్ఞా పారమిత''(6) అటువంటి భావాల కాణాచి. దాని తొలి రూపం ప్రాకృత మనటాన్ని అంగీకరిస్తే, ప్రాకృతానికీ పాళీకి ఉన్న సాన్నిహిత్యాన్ని గమనిస్తే, 'శూన్యత' పదం తొలిరూపం పాళీ 'సుఞ్ఞతా'గా గ్రహించుకోవచ్చు. ప్రజ్ఞా పారమిత శూన్యతలాగానే పాళీ సుఞ్ఞతో ఆచార్యుని భావ విస్తృతినందిస్తుంది. పాళీ సాహిత్యంలోనే పురాతనమయిన ''సుత్తనిపాత'' పారాయణ వగ్గలో మోఘరాజు ప్రశ్నకు సమాధానంగా బుద్ధుడు ''మృత్యురాజుకు అంతుబట్టని విధంగా ఆత్మభావం విసర్జించి, లోకం శూన్యమని గ్రహించి మృత్యువును జయించమని' ఉపదేశిస్తాడు. ''మజ్ఝిమనికాయం''లో సుఞ్ఞతా

వగ్గమే ఉంది. దానిలో 'చూళసుఞ్ఞతసుత్త', 'మహాసుఞ్ఞతసుత్త'' అని రెండు సుత్తాలున్నాయి. కళ్లముందు కనిపించే మనుషులు, జంతువులు, సంపదలు, శబ్దాలువగయిరాలను ధరిజేరనీయకుండా అరణ్యంలో ఏకాంతంగా ఉన్న భావనతో చిత్తాన్ని ఏకాగ్రంగావించి 'సుఞ్ఞత సమాధి' నందుకొని అనిమిత్త, అప్రహిహిత సమాధులకు పురోగమించమంటుంది 'చూళసుఞ్ఞతసుత్త'. మనిషిలో (మనసులో) అంతర్గతంగా ఉండే అడ్డంకులు - క్లేశాలు, తృష్ణ, ఉపాదానం వగయిరా- అంటని ఏకాగ్ర చిత్తతనందుకొని సుఞ్ఞతా సమాధిని సాధించుకొని ముందుకు సాగమంటుంది 'మహాసుఞ్ఞతసుత్త' - బాహ్యాంతర ప్రపంచాల శూన్యతా భావనే, శూన్యతా సమాధికి సాధనమని ఇవి స్పష్టం జేస్తున్నాయి. ఈ పాళీ సుఞ్ఞతే మహాయాన 'శూన్యత'కు మూలంగావచ్చు. పాళీ పదాలెన్నో, పదబంధాలెన్నో యధాతధాంగాను, సంస్కృతీకరణాలుగాను మహాయాన సాహిత్యంలో స్థానం పొందిన విషయాన్ని పండితులు సోదాహరణంగా చూపిస్తున్నారు. దీనిని బట్టి శూన్యతా భావం బౌద్ధ ధర్మంలోని ప్రధాన పదాలలో ఒకటని అర్థమవుతుంది. ఆర్యసత్త్యాలు, ప్రతీత్యసముత్పాదం, అష్టాంగమార్గం, అనిత్యం, తృష్ణ, అవిద్య, అనాత్మ, నిర్వణంవంటి పదాలు గూడా అన్ని శాఖలూ స్వీకరిస్తాయి.(10) మహాయాన శూన్యతను మహాయాన సంప్రదాయం ప్రకారం అర్థం జేసుకోవటం సమంజసమనిపిస్తుంది.

మహాయాన సాహిత్యం శూన్యతను అర్థం జేసుకోవటానికి అర్హత పొందాలంటుంది. శూన్యత అందరికీ అర్థమయే అంశంగాదని దానిద్వారా స్పష్టమే. తత్త్వ విదులకు మాత్రమే అది అర్థమవుతుంది. ఇతరుల కందించలేనిది, గందరగోళం చేయని భాషలో వివరించ లేనిది, ఆలోచనల కందనిది, ఏ కార్థకమయిన ఆ తత్త్వాన్ని అందుకోవటానికి అవసరమయిన కృషిచేయటం అనివార్యం. అటువంటి కృషిని చంద్రకీర్తి 'మధ్యమకావతార'(11)లో వివరిస్తారు. మహాయాన మందరినీ బోధి సత్త్వలేనంటుంది. అందరూ దశభూములలో పురోగమించి నిర్వాణ మందుకోవచ్చు నంటుంది. ఆ భూములలో పురోగమించే బోధిసత్త్వలు ఆరో భూమిని - అభిముఖిని - చేరుకొన్నప్పుడు ప్రపంచ పదార్థ స్వరూప స్వభావాలను యథాతథంగా దర్శించి, అవి అన్నీ స్వ-పరద్వయ పరిధిలోనో; ద్రష్ట - ద్రష్టవ్యం - దర్శనం - వంటిత్రయ పరిధిలోనో సంభవించేవే కనక అవి అన్నీ, స్వభావ శూన్యాలని గ్రహించు కోగలుగుతారు. 16 రకాల శూన్యతలను విశ్లేషించిన 'మధ్యమకావతార' వాటిలో శూన్యతా శూన్యతను గ్రహించటం విశేషం. అంటే అవసరమయిన కృషిచేయకుండా సామాన్యంగా అర్థంగాని శూన్యతను పదార్థపరంగా అర్థం జేసుకోవటాన్ని 'శూన్యతా శూన్యత'గా గ్రహించుకోవచ్చు. మహాయాన సంప్రదాయానికే చెందిన ''ధర్మ సంగ్రహః''(12) ఇరవై రకాల శూన్యతలు విశ్లేషిస్తుంది. వాటిలో గూడ 'శూన్యతా శూన్యత'ను ఒకటిగా పేర్కొంటుంది. దీని ద్వారా ఎవరెన్ని విధాలుగా ప్రయత్నించినా, వివరించినా, అవసరమయిన కృషిచేయకుండా సాగే ప్రయత్నాలన్నీ శూన్యతాశూన్యత కోవలోకే వస్తాయని అర్థ మవుతుంది.

అంత నిశితంగా బౌద్ధ ధర్మాన్ని అనుసరించే బౌద్ధులు - హీనయానులయినా మహాయానులయినా చాలా అరుదుగా ఉండవచ్చు. అటువంటి తీవ్ర కృషిని ఆసక్తి పరులందరినుంచీ ఆశించటం అత్యాశే అవుతుంది. ఆధునిక రీతులలో సాగే అధ్యయనాలను నిరోధించటమూ అసాధ్యమేకాదు, అవాంఛితం గూడా, అందువల్ల ఎవరికి వారు వారి అధ్యయనాల నేపథ్యం నుంచి, అనుభవాల నేపథ్యం నుంచి అలవాటు పడిన ఆలోచనా నేపథ్యం నుంచి, పరిభాషా నేపథ్యం నుంచి శూన్యతను అర్థం జేసుకొని అందించటాన్ని అంగీకరించటం, పరిశీలించటం అనివార్యమవుతుంది.

ఆధునికులు శూన్యతను శూన్యవాదంగా రూపొందించుకొని దానిలో కేవలవాదమో,

అనుభవవాదమో, హేతువాదమో, ఆధ్యాత్మికవాదమో, మార్మిక వాదమో, వ్యావహారిక సత్తా వాదమో (pragmatism), తార్కిక ప్రత్యక్ష జ్ఞానవాదమో (logical positivism) మత దృక్పథమో లేక అన్నినో ఎవరి సామర్థ్యం మేరకు వారు దర్శించుకొని వివరిస్తున్నారు. వారికి అవసరమయిన ఆధారాలను ఆచార్యుని గ్రంథాల నుంచి ఉట్టంకిస్తున్నారు. ఆ విధంగా ఆవిష్కృతమయే ఆచార్యుని దర్శన వైవిధ్యానికి, గంభీరతకు అబ్బురపడుతున్నారు. మనసందరినీ ఆనంద భరితులను గావిస్తున్నారు.

అయితే ఇటువంటి సిద్ధాంతాలను, వాదాలను - అవి ఎటువంటివైనా, ఎంతటివైనా మాధ్యమికులు ''దృష్టులు''గానే పరిగణిస్తారు. అవి అన్నీ వారి వారి అవగాహనను, దృక్పథాలను అందిస్తాయేగాని యథార్థాన్ని అందించవు. వారు యథార్థాన్ని యథాతథంగా దర్శించ లేరు. అందించ లేరు. యథార్థాన్ని యథాతథంగా దర్శించిన తత్త్వ విదులు అది అవాచ్యమని, అనభిలాప్యమని అర్థం జేసుకొంటారు.(13) మౌనంవహిస్తారు. అందుకే బుద్ధుడు ఎక్కడా ఎప్పుడూ ఎవరికీ ఏమీ బోధించ లేదంటారు మహాయానులు. ఆధోరణిని అనుసరిస్తే ఈ వాదాలన్నీ, వివరణలన్నీ తోసి పుచ్చవలసిందే (ప్రహాణ). మాధ్యమికవాదం దర్శనాలకే దర్శనం అని ప్రశంసించినా,(14) శూన్యతను ఒక భాషా సంకేతంగానే గ్రహించు కోవాలిగాని దానిని ఒక యథార్థ పదార్థంగా భావించుకోవటం గందరగోళ పడటమేనని హెచ్చరించినా,(15) శూన్యతే విధానంగా శూన్యతా సత్యతను సాధించటం మాధ్యమిక లక్ష్యమని(16) వివరించినా, శూన్యతను సంపూర్ణ మనోవైజ్ఞానికాంశమన్నా,(17) ఆతీతక ప్రయోగమన్నా,(18) ఒక విధమయిన భ్రాంతి(19) అన్నా, ఒక ఉపాయ కౌశల్య(20)మన్నా - వారి అవగాహనా సామర్థ్యాన్ని, మేధా సంపత్తినీ అభినందించాలే తప్ప అసమగ్ర దృష్టులుగానే పరిగణించవలసివస్తుంది. అంతా శూన్యమే అనవలసివస్తుంది.

ఒక బోధిసత్త్వుడుగా కాక రెండో బుద్ధుడుగా ఆరాధనలందుకొంటున్న ఆచార్య నాగార్జునుని శూన్యతా వివరణను అనుసరించటంవినా గత్యంతరం కనిపించదు. శూన్యతను శూన్యతా వాదంగా పరిగణించటాన్నే ఆచార్యుడంగీకరించడు. వాదాలన్నీ (దృష్టులన్నీ) శూన్యమేనని భగవానుడు బోధిస్తుంటే శూన్యతావాదాన్ని పట్టుకొని వేళ్లాడే వారిని ఎవరూ బాగు జేయలేరంటాడు ఆచార్యుడు.(21) దేనినయినా శూన్యమనో, అశూన్యమనో, రెండూ అనో, రెండూ కాదనో అనటానికి వీలులేదు. ఈ పదాలన్నీ ఇతరుల అవగాహన కోసం మాత్రమే వినియోగించేవే.(22) శూన్యమంటేనే అనుత్పన్నం అనిరోధంగదా! దానికి ఉత్పత్తి నిరోధాలెట్లా ఉంటాయి.(23) శూన్యతను తప్పుగా అర్థం జేసుకొనే మంద బుద్ధులు సర్పాన్ని సవ్యంగా పట్టుకోనివారిలాగా, విద్యవల్ల (మంత్రం) దుష్ప్రభావాలు పొందినవారిలాగా నశించిపోతారు.(24) శూన్యతను ఒకవాదంగానో యథార్థంగానో భావించుకొని దానిని నిరూపించుకోవటానికో తిరస్కరించుకోవటానికో తిప్పులు పడేవారితో మాకెటువంటి సంబంధమూ ఉండదు(25) - అంటూ శూన్యతావగాహనా క్లిష్టతను స్పష్టం జేసిన ఆచార్యుడు శూన్యతను స్పష్టంగా గ్రహించుకో గలిగిన వారికి అన్నీ స్పష్టమవుతాయి, లేని వారికి ఏవీ స్పష్టం గావు (25) - అని విశదం జేస్తాడు.

శూన్యత బుద్ధుని ధర్మ సూక్ష్మం. బుద్ధుని ధర్మం లోకోత్తరం. అది అందరికీ అర్థంగాదనే సందేహంతో ధర్మ దేశనకు వెనకాడిన బుద్ధుడు సర్వజన హితం కోసం, సుఖం కోసం లోకకళ్యాణార్థం కరుణా భావంతో ఉపదేశించాడు. అది సామాన్యులకూ ఉపదేశించాడు పరమార్థగాములకూ ఉపదేశించాడు. సామాన్యుల ఉపదేశం వ్యావహారికం - వారికి అర్థమయేటట్లు వారి వారి భాషలలో (సకాయ నిరుత్తియా) సాగుతుంది. పరమార్థం లోకోత్తరం. అందుకే బుద్ధుడు రెండు సత్యాల

ఆధారంగా ధర్మముపదేశించాడంటాడు ఆచార్యుడు - లోక సంవృతి సత్యమొకటి, పరమార్థ సత్యమొకటి. ఆ సత్యాద్వయాలను సక్రమంగా అర్థం జేసుకోనివారికి - వాటి సంబంధాన్ని గ్రహించుకోని వారికి గంభీరమయిన బుద్ధుని ఉపదేశం అర్థంగాదు.(27) పరమార్థం గూడా సంవృతి సత్యంతో ముడిబడి ఉంటుంది. అందువల్లనే బుద్ధుడు వ్యావహారిక సత్యం ద్వారానే పరమార్థం ఉపదేశించాడంటాడు ఆచార్యుడు. ఆ విధంగా వ్యావహారిక సత్యం నిరర్థకం కాదని తేలుతుంది.

సంవృతి సత్యం - మన ఆలోచనలు, అవగాహనలు, అనుభవాలు, మనం అలవాటుపడ్డ పరిభాష - అన్నీ పరివేష్టించిన వ్యావహారిక సత్యం. మన వ్యవహారంలో గోచరించే యథార్థాలన్నీ దాని పరిధి లోవే. ఆవిధంగా వ్యావహారికి ప్రపంచ యథార్థాలన్నీ లోక వ్యవహారానికి సంబంధించినంత వరకు యథార్థాలే. వాటిని శూన్యంగా భావించే సమస్యే తలెత్తదు. ప్రపంచ పదార్థాలన్నీ శూన్యాలనుకొంటే వ్యవహార జీవనమే సాగదు. లోకంలో ఉండేవారికి పదార్థాలు యథార్థాలే. వాటి ఉత్పత్తి, స్థితి, భంగాలు యథార్థాలే. పరమార్థాన్ని అందుకొన్న లోకోత్తరులే వాటిని యథాతథంగా దర్శించ గలుగుతారు. అవి పరస్పర ఆధారాలుగా ఉత్పన్నమవుతాయనీ అవేవీ స్వతంత్రంగా సంభవించవనీ అర్థం జేసుకొంటారు. అన్నీ పరతంత్రాలే కనక అవి స్వభావ (స్వయమస్తిత్వ) శూన్యాలని వారికి అర్థమవుతుంది. అది గూడా వ్యావహారిక యథార్థాల పరిశీలన వల్లనే సాధ్యమవుతుంది. అటువంటి వారికే సంవృతి సత్యాల- అంటే వ్యావహారిక యథార్థాలు - శూన్యమని అర్థమవుతాయి. సామాన్యులకు లోకమే యథార్థం. లౌకిక పదార్థలే యథార్థం. అవి శూన్యాలయే ప్రసక్తేరాదు. ఎవరయినా సామాన్యులు - పరమార్థ సత్యం గ్రహించుకోకుండానే - లోకమంతా, లోకంలోని పదార్థాలన్నీ శూన్యమన్నారంటే - పరమార్థమందిన వారి వివరణను అనుసరిస్తూ అనుకరించటమే అవుతుంది. పులిని జూచి నక్కవాతలు బెట్టుకొన్నట్లవుతుంది. స్వభావ శూన్యతను సాధారణ శూన్యంగా గ్రహించుకొని శూన్యం అంటే ఏమీ ఉండకపోవటమేనని అర్థం జెప్పుకొని మాధ్యమికుల అవగాహన ప్రకారం ప్రపంచమంతా శూన్యం - ప్రపంచ పదార్థాలన్నీ శూన్యాలని వ్యాఖ్యానించటం ఆచార్యుని వివరణను సక్రమంగా అర్థం జేసుకోక పోవటమే అవుతుంది.

బుద్ధుడయినా, ఆచార్యుడయినా శూన్యతను ప్రవచించింది లోకం మీద కరుణతోనే. ప్రపంచంలోని పదార్థాలు యథార్థాలను కొని, వాటి మీద అనుబంధాలను పెంచుకొని, వాటికి బందీలయి పోయి ఇష్టమయినవి లభించక, ఇష్టంగానివి సంప్రాప్తించి రాగ ద్వేష మోహాలకు లోనయి పోతూ ఎంతగా ధర్మవంతంగా జీవించినా - మంచి పనులు చేస్తూ చెడుపనులు చేయకుండా సాగినా - ఉత్తమ గతులు పొందగలరే కాని నిర్వాణమందుకోలేరు, దుఃఖ విముక్తులు కాలేరు. ఈ పదార్థాల బంధాలు తొలగి పోవాలంటే వాటి మీద వ్యామోహం తగ్గి పోయి విరక్తి భావం యేర్పడి విముక్తి పథంలో సాగాలంటే ఈ పదార్థాలు శాశ్వతంగాదు, తామూ శాశ్వతంగాదు - అంతా స్వభావ శూన్యమేనని అర్థం జేసుకోవటమే మార్గం ఆవిధంగా బుద్ధుని ధర్మంలో- దానిని చిత్తశుద్ధితో అనుసరించిన నాగార్జునుని ధర్మ వివరణలో శూన్యతను విమోక్ష సాధనంగా స్వీకరించటం సముచిత మవుతుంది. అదే మహాయాన లక్ష్య పరిపూరక మార్గంలో నడిపిస్తుంది.

**అధస్సూచికలు :**

1. నాగార్జున మధ్యమక శాస్త్రం, ద్వాదశ నికాయాశాస్త్రం, ఆర్యదేవ శత శాస్త్రం - కుమార జీవ్ చైనీ అనువాదాల ఆధారంగా ఈ శాఖ ఏర్పడింది.
2. సర్వదర్శన సంగ్రహం చార్వాకతో ప్రారంభమవుతుంది. బౌద్ధ దర్శనం రెండోది.

3. షడ్దర్శన సముచ్చయం 'బౌద్ధమతం' తోనే ప్రారంభమవుతుంది. అయితే మరీ సంక్షిప్తంగా 12 శ్లోకాలకే పరిమితమయి పోయి స్పష్టతలోపిస్తుంది.
4. షెర్‌బాస్కీ - The carception of Buddhist Nirvana. పరమార్థ - సంవృతి సత్యాలను పరామర్శించి పరమార్థ అవగాహనకే సంవృతి స్వభావ శూన్యత అర్థమవుతుంది కనక సాపేక్షమన్నాడు.
5. K.V. Ramanan, Nagarjuna's Philosophy, Chapter VII, P. 178. స్వభావరహితమనే అర్థంలో
6. Nikkyo Niwano, Buddhism for Today, Chapter XVI, P. 207 శూన్యతావగాహనలో సంసారం- నిర్వాణం సమానమేనని.
7. E. Conze, Buddhism - Its Essence and Development, Chapter V, P. 130 & F. N. P. 131.
8. E. Conze, Tr & Ed. Astasahasrika Prajnaparamita, శ్రావకులయినా (హీనయాన) ప్రత్యేక బుద్ధులయినా, బోధిసత్త్వులయినా ప్రజ్ఞాపారమితా సూత్రాలు వినాలంటుంది. బోధిసత్త్వులు, ప్రజ్ఞా పారమిత, సర్వజ్ఞత్వం గూడా శూన్యాలేనంటుంది.
9. మజ్ఝిమనికాయ, ఉపరిపణ్ణాస (చివరి యాభయి సుత్తాలు) - 121 నుంచి 130 సుత్తాల వరకు సుఞ్ఞతావగ్గ. 121. చూళసుఞ్ఞతసుత్తా, 122. మహాసుఞ్ఞతసుత్త.
10. K.V. Ramanan, Opcit, Chapter I, P. 54.
11. C.W. Huntingten & G.N. Wangehen, The Emptiness of Emptiness లో రెండో భాగం The entry into the Middle way, P. 157 ft.
12. ధర్మ సంగ్రహః గూడా ఆచార్య నాగార్జున కృతమంటుంది టిబెట్ సంప్రదాయం.
13. నాగార్జున 'మధ్యమకకారిక' అష్టనిషేధాత్మకమయిన ప్రతీత్య సముత్పాదాన్ని ఉపదేశించిన బుద్ధుని వందనంతో ప్రారంభ మవుతుందని సంప్రదాయం.
14. T.R.V. Murti, Introduction, P. IX. Madhyamika Dialectic and the Philosophy of Nagarjuna.
15. R.H. Robinson, Early Madhyamika in India and China, P. 49.
16. K.V. Ramanan, Opeit, Chapter VII, P. 173.
17. Madhyamika Dialectie and Philosophy of Nagarjuna, P. 231.
18. Ibid, P. 174.
19. Ibid. P. 23.
20. Hsueh - li - Cheng. Empty dogic, Ch 2, P. 53.
21. మ.కా. 13:8. 22. మ.కా. 22: 11. 23. మ.కా. 20:18
24. మ.కా. 24:11 25. మ.కా. 24:13. 26. మ.కా.24:14.
27. మ.కా. 24:9.

# బౌద్ధ శిథిలాలు 'లంజదిబ్బ' లెట్లైనవి?

– జి. ఆర్. వర్మ

కాలగర్భాన కలిసిపోయి దిబ్బ (బోడు, హుండా)లై పోయిన బౌద్ధ క్షేత్రాలను సన్యాసి దిబ్బలు, బోగముదాని (సాని, లంజ) దిబ్బలంటున్నారు. ఉత్తర సర్కారు జిల్లాల్లో హిందూకులము లన్నిటా సన్యాసి పేరిటి వ్యక్తులున్నారు. శ్రీకాకుళం జిల్లాలో గుంప (గుహాలయ - బౌద్ధం) స్వామి పేరిటి వ్యక్తులున్నారు. గుప్త యుగంనాటికే కొన్యోధ, కొంగోడు (గంజాం, ఒరిస్సా) రాజుపేరు గుహదేవ, పిమ్మట కొన్ని శతాబ్దములవరకు రాజధాని గుహదేవ పాటకము.

హిందువుల్లో ఆధ్యాత్మిక చింతనాపరులైన వారి తావులను విరాగులైన వారి తావులను సన్యాసి దిబ్బలనుట లేదు. మన పురాణ గాథల్లో ఋషులు సన్యాసులు గారు. కొన్ని శతాబ్దాల పిమ్మట బౌద్ధుల జూచి సన్యసించ నారంభించారేమో! సన్యాసి పేరు ఈ లెక్కను బౌద్ధుల సంబంధం అనవచ్చును. ఒకనాడు బౌద్ధం సర్వజనాదరణీయం, బౌద్ధ సన్యాసుల 'పాపులారిటీ' ని సన్యాసి వ్యక్తి నామాలు సూచిస్తున్నాయి. సన్యాసి దిబ్బలంటే బౌద్ధ శిథిలాలు, బుద్ధుని తర్వాతి కాలంనుండి బౌద్ధక్షేత్రాల్లో ఉన్నది బౌద్ధ సన్యాసినిలు, సన్యాసులు. బౌద్ధ శిథిలాల (చైత్య, విహార)ను సన్యాసి దిబ్బలనుట సహజము, ఏమాత్రమూ ఏహ్య భావమూ, న్యూనతా లేని పేరు.

రెండవ పేరు స్త్రీ సంబంధం, న్యూనత నాపాదించేదిగా ఉంది. బౌద్ధాన్నపహాస్యం చేయడానికే ప్రబుద్ధుడైన పనిగట్టుకు ప్రచారం చేసాడా? బ్రాహ్మణ్యం దేవభాషజేసిన సంస్కృత శబ్దార్థం తెలియక ఆ పేరు పెట్టాడా? కారణం తెలియక తికమకపడేవారికి, కాబోలు ననుకొనేవారికీ మరింత 'నమ్మబుల్'గా మన పండిత పరిశోధకులు ప్రచారం చేసారా? మూడోవారి ప్రమేయం గలదనిపించేట్లున్న వ్యాసం ఒకటి చూచాను - ఆ భాగం -

'శాలిహుండాము ... ఆరుగొల్లు ... ఇత్యాదిగా ప్రతి స్థలమందు పురాతనమైన కోటలు శిథిలములై నిలిచియే యున్నవి. అవి లేని చోట చైత్య, విహారములు లేనేలేవు. దీనినిబట్టి ఆయా దుర్గములం దుండి పాలించు ప్రభువుల భోగినులకై యితర ప్రదేశముల నుండి వచ్చిన బౌద్ధ భిక్షువుల బౌద్ధసిద్ధి సాధనకై ఈ మేడూకములు- విహారములు నిర్మితమైనవనుట నిశ్చయము. ఈ నిర్మాణములు లంజదిబ్బలు, బోగము దాని దిబ్బలు అను పేరులు నిలిచియుండుటయే దీనికి ప్రబల నిదర్శనము. భోగినీ నిర్మాపితములు గనుక వీనికీ పేరు వచ్చినదన్న విషయము చిరకాలము నుండి వచ్చుచున్న జనశ్రుతిలో నిలచియే యున్నది...'

వ్రాసినవారు పరిశోధకులో కాదో సూచింపకున్నా పై వాక్యాలుబట్టి రచయిత పండితుడన వచ్చును. మేధావులు, పరిశోధకులు సత్యాన్వేషణ జేసి జనసామాన్యంలోగూడ పాతుకుపోయిన మూఢభావాలు తొలగించాలేగాని వక్ర భాష్యాలుతో తప్పుడు నమ్మకాల బలపర్చుట మంచిదికాదు. తెలంగాణాలో

రెండు దశాబ్దాలనాటి దృశ్యం - హిందూ శిథిల ప్రతిమలపై మహ్మదీయ బాలబాలికలు ఉమ్మివేసి, తన్ని, రాళ్ళు వేయడం - ఎందుకా పనిచేస్తున్నదీ వారికి తెలియదు. పూర్వం తంతు తథాంగాల గుంటబెట్టి, బ్రాహ్మణ్యాన్నొక ఊపు ఊపింది బౌద్ధము. రెండు మతాల మధ్య విద్వేషం శతాబ్దాలు సాగింది. బౌద్ధాన్నంతగా ద్వేషించినా బ్రాహ్మణ్యం బౌద్ధుల ఆచారాదులనేకం కొన్ని మార్పులతో అనుకరించిన చరిత్ర ఉంది. నాటి బౌద్ధ ద్వేషశేషం ఇంకా బ్రాహ్మణుల్లో ఉందా ?

సాలిహుండాను జనసామాన్యం గూడా సాని ఇత్యాది దిబ్బలనరు. న్యూనతాభావం లేని సాలిదిబ్బ, సాతవాహనుల సంబంధం అనుకొంటున్నారు. సాలి హుండా పూర్వ నామం ఆద్యక్షరాలు రెండూ సాలి. ఈ క్షేత్రం గూర్చి లోగడ 'Journal of Andhra Historical Research Society, Andhra Pradesh, Sunday Standard, ఆంధ్రప్రదేశ్, ఆంధ్రప్రభ, ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక' ల్లో వ్యాసాలు ప్రకటించాను.

సాలిహుండాలో గారవద్దనున్న చిన్న కొండపై త్రవ్విన పురాతత్వశాఖవారు కనుగొన్నది కోటగాదు, స్తూప విహారాలు, పిమ్మటి కాలపు బౌద్ధ ప్రతిమలను సాలిహుండా ఊర్లో కనుగొన్నారు.

ఆరుగొలను గూర్చి 30 ఏళ్ల పూర్వం 'ఆంధ్రపత్రిక సచిత్ర వార పత్రిక' లోనూ ఆ మధ్య 'ఆంధ్రపత్రిక' సారస్వతానుబంధమున వ్యాసాలు ప్రకటించాను. మరికొన్ని విషయాలిపుడు వ్రాస్తున్నాను. ఆరుగొలను గ్రామ జనాభాలో గొల్లవారు, కాపువారున్నారు. అక్కడ కాపురమున్నవారు బాగుపడలేదు, స్థిరాస్థు లక్కడే ఉన్నా కాపురాలు వేరొక గ్రామానికి మార్చాక బాగు పడినారంటారు. గ్రామస్తుల కథనం - అక్కడ ఉన్నవి కోటదిబ్బలు, రాక్షసులు కట్టిన కోట, నిధులున్నవి, నిధులకు కాపలా నాగుపాములు, దుర్గ రక్షకి 'కోటమ్మ'. ముప్పయ్యేళ్ల పూర్వం జిల్లా ఆరోగ్యశాఖాధికారి డ్యాక్టర్ సాంబమూర్తిగారు ప్రత్తిపాడు బస్‌స్టాప్‌వద్ద కారాపి దూరదృశ్యాన్ని చూపి అవి బౌద్ధ శిథిలాలు మీరు చూచి, ఆలోచించి వ్రాయమన్నారు. బౌద్ధశిథిలాలంటే గ్రామస్తులు నమ్మటలేదు.

ఆరుగొలను చేరువనున్న దిబ్బలు వగైరా మొత్తం సుమారు 600 ఎకరాల విస్తీర్ణం గలది. దక్షిణభాగం సుమారు 160 ఎకరాల భూమి చుట్టూ కోటప్రహరీవలె నలువైపుల దార్లున్నట్లు ప్రాకారంవలె దిబ్బలున్నాయి. ఇదే గ్రామస్థులనుకునే కోట. ఈ దిబ్బలచుట్టూ ఒకప్పుడు అగడ్తవంటి దుండే దనిపించే పల్లపుభూమి ఉన్నది. మొత్తం భూమి ( కోట వగైరా కలుపుకొని) చుట్టూ ఒకప్పుడుండే దేమో తెలియదు. అటు దక్షిణం ఆరుగొలను నుండి ఇటు పడమర కుంచనపల్లి వరకూ పెద్ద చెరువున్నది. ఈ 'కోట' లోపల 7 - 8 నిలువులవరకు పాటిమట్టి తవ్వి అమ్మి లాభం జేసుకున్నారు రైతులు. ఈ త్రవ్వకాల్లో వారికి దేనికి చెందినవో తెలియని శిథిలములు, ఎర్రకుండ పెంకులు, పెద్ద పూసలు, పెద్ద పెద్ద ఇటికలూ, ముక్కలు లభించాయి. ఈ పోలిన పెద్ద సైజు ఇటికలు 'కోట' ఆవల ఉత్తర భాగానగూడా ఉన్నాయి. ఒక చోట ఇటికగోడ చిన్న శిథిలమున్నది. ఈ ఉత్తర భాగాన విడిగా రెండు దిబ్బలున్నవి. ఒకదాన్ని 'పెద్దలంజ దిబ్బ' మరో దాన్ని 'చిన్నలంజ దిబ్బ' అంటున్నారు. వీటిలో గూడ పెద్ద సైజు ఇటికలున్నాయి. ఇవన్నీ పురాతత్వశాఖ వారి 'రక్షితప్రదేశం' అనే బోర్డులున్నా

'అరక్షితం'గానే ఉన్నాయి. ఈ దక్షిణ భాగపు 'కోట' నుండి పాలించిన రాజు(?)కు ఇద్దరు ఉంపుడుగత్తెలట. వారి నివాసాలట పెద్ద, చిన్నలంజ దిబ్బలు. ఇందొకామె కడియం అమ్మి త్రవ్వించినందున (పెద్ద చెర్వు) కడియాల చెరువని పేరట. 'కోట' ప్రహరీ దిబ్బల మీద అపుడప్పుడు ఆయుధాల ముక్కలు కనిపిస్తుంటాయట. ఆ 600ల ఎకరాల భూమిలో అపుడప్పుడు నంది చిహ్నమున్న స్వర్ణ రజత నాణెములు దొరకెనట. ఒకరికి కల్వంపోలిన నూరుడురాయి దొరకెనట. త్రవ్వకాల్లో లభించిన విగ్రహాల్లో పాదములవద్ద నక్క ఉన్న దేవీ ప్రతిమనే 'కోటమ్మ' అంటున్నారు. పెద్ద సైజు ఇటికలబట్టి రాక్షసులు కట్టిన కోటగా భావించారు.

బౌద్ధ క్షేత్రాలకు మార్పులు, చేర్పులు ఇక్ష్వాకులతో అంతరించి సాలంకాయనులనాడు సన్యాస జన సమ్మర్దంగా ఉండి, ఒకరిద్దరు విష్ణుకుండినులు నిరాదరణ పాల్జేయకుండిన పిమ్మట వేంగీచాళుక్యుల నాటినుండి శిథిలంకా నారంభించాయి. బౌద్ధ నిర్మాణాలు 14 శతాబ్దాలనాడే ఆగిపోయినా, దుర్గ నిర్మాణాలు 3 శతాబ్దాల పూర్వం వరకూ జరిగాయి. బౌద్ధ క్షేత్రాల్లో ఇటికరాయి ఉపయోగం అశోకచక్రవర్తికి పూర్వమే ఉంది. ఆంధ్ర, సాతవాహనుల కాలాన బౌద్ధ క్షేత్ర నిర్మాణాదుల స్వర్ణయుగము, చరిత్ర హిందూ మతముతో పోల్చిన బౌద్ధం రాజుల ఆదరణతో 'బ్రదికిన' దనిపించదు.

జనుల ధనసహాయంతో క్షేత్రాలు బౌద్ధులే నిర్మించుకున్నారు. సహజంగా దాపుల్లో పర్వతాలు, రాళ్లు లభించనిచోట, కాస్త ఎత్తుగా, సమతలంగా ఉన్నచోట్ల కట్టుబడి కుపయోగించినది పెద్ద సైజు ఇటికలు - సాతవాహనులనాడు ఇటిక లెక్కువగా వాడారు. ఆరుగొలనువంటి సమతల భూముల్లో స్తూపాలు, సంఘారామాలచుట్టూ రాళ్లు, రప్పలు, ఇటికలు, అడుసుమట్టితో ప్రాకారం కట్టేవారు. దీని చుట్టూ వెదురు, కంపకంచె కట్టేవారు. దీనిచుట్టూ దార్లు వదలి కందకంవంటిగోతులు త్రవ్వేవారు. ఈ నిర్మాణ శిథిలాలు చూడ్డానికి కోట అనే భ్రాంతి కల్గించేవి. బౌద్ధ నిర్మాణాలు సాధారణంగా భిక్ష సుభిక్షంగా దొరికేతావులు, రాజధానులు, వర్తక కేంద్రములకు అతి చేరువగాక, దూరమునగాక అందుబాటులో జనసమ్మర్దం లేకుండా, ధ్యానభంగంగాని తావుల చేసారు. ఆదిలో స్తూపాలు (ఏడూకములు) మట్టివే. ఆ క్రీ.పూ. కాలమున దుర్గాధిపతుల భోగినీ స్త్రీలు బౌద్ధులనే ఆధారం ఉందా?

ఆరుగొలను దగ్గరి దిబ్బలభూమి పురాతనమైన బౌద్ధ మహానగరమని పరిశోధకాభిప్రాయము. పదమూడు శతాబ్దములనాడే శిథిలమైనది. ఆరుగొలనులో కోట ఉండుట నిజమే - సహజరక్షణా సౌకర్యాలున్న తావు, బౌద్ధ శిథిలాలపై కొన్ని శతాబ్దముల తర్వాతి రాజులు కొన్ని చోట్ల దుర్గ నిర్మాణాలు చేసారు. వేంగీ మహాదేవరాజు కాలాన ఆరుగొలనులో కోట ఉండేది. అంటే శిథిలమైన బౌద్ధ క్షేత్రంపై సుమారు ఏడుశతాబ్దాల పూర్వం దుర్గ నిర్మాణం - కాగా అంతకుముందే ఆరుగొలను పరిసరాలు రణరంగమై యుండెననిపించును. ఆరుగొలను తాడేపల్లిగూడెం - నిడదవోలుకు మధ్యనున్నది. వేంగీశ్వరుడైన భీమపలుక్కి కొడుకు నిడదవోలు, పడమరగా పెరువంగూరు యుద్ధాల్లో రాష్ట్రకూటుల నోడించి రాష్ట్రకూట గుండయ దండనాథుని వధించి వీరస్వర్గ మొందినట్లు చరిత్ర ఉంది.

అప్పుడప్పుడు ఎముక ముక్కలు కనిపించుచున్నను, గ్రామస్తుల కదోరణ రంగమనీ, శతాబ్దాలపూర్వం బౌద్ధ కేంద్రమని తెలియదు.

బౌద్ధ క్షేత్రములందంతటా కోటలు లేవు. కోటల నుండి పాలించిన రాజుల ఉంపుడు కత్తెలు బౌద్ధులనే విషయం నా దృష్టికి రాలేదు. బౌద్ధ మత పతనానికి కారణాలు అనేకము. చివరిదశలో వారు బ్రాహ్మణ్యపు తంతు తథాంగాల కలవడి, విజ్ఞాన సముపార్జన వదలి 'పాపులారిటీ' జనసామాన్యా భిరుచుల కనువర్తనగా - తాంత్రికంగా - నైతికపతనము చెందారు. ఈ లైంగిక నైతిక పతనం అనేక మతాల సన్యాస జీవిత చరిత్రలో ఉంది.

గత కాలపు చరిత్రలో, కౌటిల్యుని 'అర్థ శాస్త్రము' నాటినుండి ఆఖరి చాళుక్యులవరకూ వేశ్యలు సప్తసంతానాల నిర్మిన్నవైనం, సానులు హిందూ దేవాలయాలకు చేసిన దానాలకి ఆధారం ఉంది. ఈ వేంగీ చాళుక్యులలో కొందరు రాజులు జైన కళాకారిణులను పోషించారు - ఈ జైన భోగినీ స్త్రీల గూర్చిన శాసనాలున్నాయి. వీరి సందర్భంలో సాని వగైరా దిబ్బల్లేవు. ఒక్క బౌద్ధ శిథిలాలకే ఈ పేరు వచ్చింది. భోగినీజనం నిర్మించారు. కాబట్టి, తమ భోగినీ జనానికీ, బౌద్ధభిక్షువుల్కై దుర్గాధి పతులు కట్టించారు కాబట్టి ఆ పేరు వచ్చిందనే పండిత పరిశోధ కాభిప్రాయంలో నిజం ఉందా ? భ్రమాజనితమా? తెలియనితనమా? పనిగట్టుకు చేసిన దుష్ప్రచారమా? సరిగా అర్థమయ్యేట్లు వ్రాయగలంత భాషా జ్ఞానం నాకు లేదు. కాని నా ఆలోచనలను పండిత, పరిశోధకుల ముందుంచి తమ అభిప్రాయాలు దురభిప్రాయాలేమో పునర్విమర్శ చేసుకో గోరుచున్నాను.

పలు అంత్యాక్షర నామగ్రామలు బ్రాహ్మణ్యాన అగ్రహారం; ఆధ్మాత్మిక, వేద, తదితర విద్వజ్జనా వాసములు, త్రికళింగాధీశుడైన అనంతవర్మ చోడగంగ దేవరాజు క్రీ.శ. 12వ శతాబ్దపు కొర్ని శాసనంలో గార (గ్రామం) వద్దనున్న తావునే 'మణ్డపలు' అనెను. ఈ 'మణ్డపట్టు' సాలిహుండా (శ్రీకాకుళం) ఈ 'మణ్డపట్టు'లో భోగినీజనం వగైరా సూచన లేదు. ప్రసిద్ధ బౌద్ధక్షేత్రం - స్థూప , విహారాదులు దిబ్బలైయ్యున్నతావు, బౌద్ధ సన్నాసుల తావు, గీర్వాణ మెరిగిన పండితులు ఈ 'ముణ్డ' అర్థం తెలుసుకోడం అనవసరమనిపించో, మరే కారణాన్నో జనసామాన్యం అనుకునే మాటలు బలపర్చేట్లుగా ముణ్డను సాని, లంజ, భోగముది, ఉంపుడు కత్తె వగైరా ప్రచారము. మన ఋషులు సర్వసంగ పరిత్యాగులుగా కాన్పించరు. బహుపురాతన కాలమునుండీ సన్యసించిన వారిలో బౌద్ధుల జనాభా ఎక్కువ. మన ఋషులకు గడ్డం, మీసాలు, సంసారం ఉన్నాయి. జైన, బౌద్ధ సన్యాసీ, సన్యాసినులకే తలగుండు చేయించే ఆచారము. బుద్ధుని తర్వాతి కాలపు బౌద్ధ సన్యాసులందరూ బోడిగుండువారే - దేవునికి తలనీలా లీయడంలో కొందరు 'సెక్స్' సంబంధం జూచారు. నేనట్లనుకోను. మనిషికి నిండుతనం, ఆకర్షణ శిరోజాలు. తలగుండు చేయించడంలో ఆకర్షణ, అహం భావం 'తిరుక్షౌరం' - దాసోహం అనే భావము. శత్రుపుల్నీ, దుశ్శీలలైన వివాహిత స్త్రీలను పరాభించడానికి తల గుండు చేసిన వైనం ఉంది.

పున్నామ నరకం, పాపకూపం నుండి పైకి లాగించుకోడానికి పెట్టుకున్నారు పిలకలనుకోన

వసరంలేదు. బౌద్ధుల ఆచారాలు ఆదరించుటలో బ్రాహ్మణులు గుండు చేయించడంలో జైన, బౌద్ధులకు విభిన్నులమనే సూచనగా పిలక ఉంచేవారనుకుంటాను. హిందూత్వానికి చిహ్నంగా క్రాపుతోపాటు చిన్న పిలక నేడూ ఉంది.

బోడిగుండువారినీ, గుండు చేయడం సందర్భంగా సంస్కృత శబ్దాలు 'ముణ్డ, ముణ్డీ, ముణ్డిత, ముణ్డీయ' వగైరా - తలగుండు చేసుకున్న (సన్యాసుల) వారినే 'ముణ్డీ' అన్నారు. సామాన్య వ్యవహారంలో 'ముణ్డీ' అంటే బౌద్ధసన్యాసి. రానురాను, బౌద్ధసన్యాసులు జనుల దృష్టిలో హీనులయ్యారు, ముఖ్యంగా బ్రాహ్మణ్యాన 'ముద్రారాక్షసము' నాటికి బోడిగుండువా రెదురైన అశుభం అనే మూఢనమ్మకం ప్రబలింది.

వైదికం, ఆదిబ్రాహ్మణ్యం స్త్రీ కిచ్చిన విలువ పిమ్మటికాలపు బ్రాహ్మణ్యం బాగా 'డీ వాల్యూ' చేసింది. బ్రాహ్మణ 'మగ మహారాజె'వరో 'ఇంకో ఆకు ఎక్కువ చదివాడు'. స్త్రీ జన సహజాలంకార వాంఛ, ఆకర్షణ, ఆహార విహారాల్లో కట్టుబాట్లు, ధర్మసూత్రాలు నిర్దేశించని ఆచారం విగత భర్తృకకు అన్నిటితోటు 'క్షవరం' జేసినవి శిరోజాలు. ఈ ముండన అయిన (ముణ్డిత) స్త్రీ ముండ, బాగా అర్థమయ్యేట్లు, వెధవముండను జేసారు. సాంఘికంగా బ్రాహ్మణులతో సమానమై పోతామనే భ్రాంతిలో ఇతర కులాలవారు గూడా కొందరు విగత భర్తృలకు తల గొరిగించ నారంభించారు. పూర్వ సువాసిని బాహ్య లక్షణం బోడిగుండు అయింది. పూర్వం జైన, బౌద్ధ సన్యాసుల శకునం అశుభం - ఆ గుండుతనం ఈ విగత భర్తృకగుండు కాపాదించుటలో వితంతువు శకునం అశుభము. సకేశినీ పూర్వ సువాసిని గూర్చి ఇదే నమ్మకం బలసింది. బట్టతలవారియందూ అదే భావం ప్రదర్శించారు.

పూర్వం స్త్రీ ఎప్పుడూ సుమంగళియేనట. విగత భర్తృక అయితే బావకో, మరదికో భార్య అయ్యేది - నేటికీ ఆదిమ జనాంగం అనబడే వారిలో ఈ ఆచారం ఉంది. మధ్యకాలపు మనువారెందుకో, నాటి వారి సాంఘికాధిక్యతకోసమే - కుటుంబ నియంత్రణకు మాత్రం కాదు. స్త్రీకి పునర్వివాహోర్హత 'క్షవరం' జేసారు. సాంఘికంగా గొప్ప అనుకుంటూ బ్రాహ్మణులజూచి ఇతర కులాలవారు కొందరు వారి ననుకరించారు. ఈ సాంఘికశృంఖలాల్లో చీకటి తప్పులు ఎక్కువవడం సహజము. అందుకే కాబోలు వేమన పేరిటి పద్యాల్లో 'తలలు బోడియైన తలపులు....' ద్వందార్థ హాస్యం. విపరీతంగా ఆదరింపబడిన గ్రామఫోన్ రికార్డ్ పాటల్లో డాక్టర్ వెంకటచలం ఒక విసురు విసిరాడు 'ముండలైన రండలైన మా జాతిలో ఉండరు...'

సాహిత్యపరంగా మరో సందర్భం చెప్తాను. మన ప్రాంతాలకు క్రీ.పూ. 4-5 శతాబ్దాల్లో వచ్చిన ఇక్ష్వాకులు జైనులట. యశోధరుడు వేంగిని జయించి ప్రతీపాలపురం (భట్టిప్రోలు) రాజధానిగా పాలించెనట, అతని కొడుకుల్లో పెద్ద వారిద్దరూ సన్యసించారట. కనిష్టుడు రాజుగానుండి సర్పదష్టుడై మరణించెనట, నిస్సంతు. మంత్రులు తదితరులు సన్యసించిన వానిని కపటోపాయమున రాజధానికి తీసుకువచ్చి కృతకృత్యులైరి. నియోగము అనేక జాతుల్లో దేశాల్లో పురాతనాచారం - తమ్ముని భార్యకు

పుత్రభిక్షపెట్టాడు. ఆ పుట్టిన ద్వితీయ యశోధరుడు బోడిగుండు వానికి పుట్టినందున 'ముణ్డీయ సుతు'డై - ఆ కుటుంబం 'ముణ్డీయ వంశ' మనబడెనట. ఇక్ష్వాకుల ఈ 'ముణ్డీ' శబ్దాన్ని పరిశోధకులు కొందరు ఆదిమజనాంగమైన 'ముణ్డా' జాతికి ముడి పెట్టారు. రాజకీయంగా సాతవాహనుల తర్వాతి వారైనా వారికంటె పురాతన జనాంగం ఇక్ష్వాకులు. ఈ పోలిక పేరిటి జనులు బహుపురాతన కాలమున ఇతర దేశాల్లో గూడా ఉన్నారు.

ఈ 'ముణ్డ' కర్థం వెదకడం మాని, లేక తెలియక బౌద్ధానికి భోగిని స్త్రీలకు ముడి పెట్టారీ పండితవర్యులు. జనసామాన్యంతోపాటు పండితులు గూడా ముండన సంబంధం ముండ - భోగిని - సాని, లంజ వగైరాగా భావించారనిపిస్తుంది.

రెండు - సానిశబ్దం శాసనాల్లో విభిన్నార్థకంగా ప్రయోగించినట్లు కనిపిస్తుంది కాని అగౌరవ వాచకం గాదు. శాసనాల్లో రాజాంతఃపుర స్త్రీలు, గౌరవ కుటుంబాల స్త్రీలు, యజమానురాలు సానివాచ్యులుగా ఉన్నారు. ఇటీవలనే ప్రచురించిన 'మైలారదేవ' రివైజ్‌డ్ ఎడిషన్ నిమిత్తం తురగా కృష్ణమూర్తి గారు కొన్ని శాసనపాఠా లంపారు. సుప్రసిద్ధ వేంగీ వర్తక సంఘీయులైన పెనుగొండ కోమటివారి స్త్రీల పేర్లతోగూడ (క్రీ.శ. 14-15 శతాబ్దాలు) సానిశబ్ద మున్నది. సానిశబ్ద మున్నదని నేటి భావంతో జారిణీ, భోగిని వగైరా అంటే దేహశుద్ధి చేస్తారు. కొన్ని శాసనాల్లో దేవదాసీలు - దేవుని నృత్యగానాల అర్థించేవారు సానులని పేర్కొనబడినారు. శ్రీ కూర్మంలో 'సానివీధి' బౌద్ధ సంబంధ మేమో తెలుసుకోబోయాను. అది గతకాలపు దేవదాసీల వీధి, ఆ స్త్రీలు యావజ్జీవం ఎవరో ఒకర్ని నమ్ముకొన్న వారేగాని పణ్యాంగనలు కారని ఎస్. టి. పి. వి. కూర్మాచార్యులుగారు జవాబు వ్రాసారు.

గతంలో చారిత్రకంగా చిరకాలం సాని న్యూనతా భావం గాదు. మనం మహారాజు అనే సాధారణార్థం ఆదిలో ప్రభుపరం గాదు, మత పరం. నేటికీ మతాధిపతులను, యజమానులను 'మహరాజ్' అనే ఆచారం ఉంది. చక్రవర్తి శబ్దం ఆదిలో బుద్ధ భగవానుని పరంగా ఉంది. స్వామి అనగా దేవుడు. భర్తనూ (పతి దేవుడు) స్వామి అన్నారు. భూపతులూ స్వాములు (మాఢరీపుత్ర స్వామి వీరపురుషదత్త) క్రైస్తవుల 'లార్డ్' గూడా ఆదిలో ఆధ్యాత్మిక పరము. ఆధ్యాత్మిక పరమైన స్వామి నేటికీ పీఠాధిపతులు, సన్యాసుల పరంగా స్వాములవారు - దేవుడు అనే వ్యవహారార్థం స్వామి - ఈ శబ్దాన్ని దేవుని ప్రతినిధులైన మతాధికారులు, దేవాంశసంభూతులనబడిన రాజులు వాడుకున్నారు. అది గౌరవ వాచకము. స్వామి శబ్దానికి స్త్రీ లింగం స్వామిని - స్వామిని భ్రష్ట శబ్దం సాని. దేవాలయ శాసనాల దేవదాసీ (సాను) ల కంత గౌరముండి యుండును. బౌద్ధం సర్వజనాదరణా కాలాన భక్తి గౌరవాదరణల్లో సంబోధన బౌద్ధ సన్యాసిని స్వామిని.

లైంగిక నైతిక పతనం ఒక మతం, వృత్తి జీవనానికే ప్రత్యేకం గాదు. ప్రకృతి సహజం. అన్ని మతాలు, జాతులు, దేశాలు, సన్యాస జీవితాలకుంది. ఐతే ఈ దుష్ప్రచారం మన ప్రాంతాల ఒక్క బౌద్ధానికే వర్తింప చేయడంలో బ్రాహ్మణ్యం బాధ్యత హెచ్చనిపిస్తుంది. నాటి బ్రాహ్మణాన్ని గూర్చి ఇలా వ్రాసినందుకు నేటి బ్రాహ్మణులు, మిత్రులు అన్యథా భావించకుందురుగాక.

*(భారతి 1974 మే సంచిక సౌజన్యంతో)*

# యశోధర

**- డా॥ యు. ఏ. నరసింహమూర్తి**

యశోధర పేరు ప్రపంచ మంతటికీ తెలుసు. మేధావులకే కాదు, సామాన్యులకు కూడా తెలుసు. ప్రాక్పశ్చిమ పురాణేతిహాసాలలో ప్రసిద్ధులైన స్త్రీలకెంత వ్యాప్తి ఉందో యశోధరకు కూడా అంత వ్యాప్తి ఉంది. యశోధర చరిత్రలో నిలిచినస్త్రీ. చరిత్ర ప్రసిద్ధిగల స్త్రీలలో ఆమె స్థానం గణనీయమైనది. కాని ఆమె చరిత్రకు సంబంధించిన నిర్దిష్టమైన, విస్పష్టమైన చారిత్రికాధారాలు లభించడం లేదని చరిత్రకారులు అభిప్రాయపడుతున్నారు.[1] యశోధర కున్న ప్రసిద్ధి అంతా ఒకటే. ఆమె బుద్ధుని భార్య. బుద్ధునిలా కాని, బుద్ధుని అనుయాయులైన కొందరు ఇతరులలా కాని ఆమె చేసిన ఘనకార్యాలేమీ లేనట్లుగా తెలుస్తోంది. బౌద్ధ సంఘం మీద ఆమె ప్రభావం ఏమిటి? అన్న విషయాన్ని నిష్కర్షగా ఎవరకూ తేల్చి చెప్పలేదు. ప్రపంచానికి ఆమె మీద సానుభూతి ఏర్పడింది. అది నూత్న ప్రసవయైన ఆమెను గౌతముడు అర్ధరాత్రి నిష్కారణంగా విడచిపెట్టివెళ్లిపోయాడనే సంఘటన కారణంగా ఏర్పడిన సానుభూతి. బౌద్ధానికి సంబంధించిన ప్రాథమిక గ్రంథాలలో ఎక్కడా యశోధర ప్రస్తావన కనబడదు. మహాప్రజాపతి గౌతమి, ఉప్పలవన్న, భద్దకచ్చాన, బింబి, ఖేమ వంటి స్త్రీల ప్రస్తావన కనిపిస్తుంది.

అశ్వఘోషుని బుద్ధ చరిత్రలో యశోధర ప్రస్తావన ఉంది. స్థిర శీల సంయుతమైన కులానికి చెందిన, సౌందర్యం అభిజాత్యం వినయంతో కూడిన, సార్థకనామధేయురాలైన యశోధరను గౌతమున కిచ్చి వివాహం చేసేరని, ఆమెకు రాహులుడనే కుమారుడు జన్మించాడని. తనను - తన కుమారుణ్ణి గౌతముడు విడచివెళ్ళినప్పుడు యశోధర దుఃఖించిందని బుద్ధచరిత్ర చెప్తోంది.[2]

అశ్వఘోషుడు క్రీ.శ. 1 లేదా 2వ శతాబ్దం నాటి వాడని తెలుస్తోంది. అప్పటికి బుద్ధుడు మరణించి శతాబ్దాలు గడచాయి. బుద్ధుడు మరణించిన 250 సంవత్సరాల నాటికిగాని లేఖన విధానం ప్రచురవ్యాప్తిని పొందలేదు. అందువలన బుద్ధుని కాలంనాటి చరిత్ర - చారిత్రికస్ఫూర్తితో శతశతాంశ సత్యంగా తరువాత కాలం వారికి అందేవిధంగా నిబంధింపబడ లేదని చరిత్రకారులు భావిస్తున్నారు. ఆ కారణంగా ప్రాచీన బౌద్ధం నాటి చరిత్రలో చరిత్రకు బదులుగా కాకమ్మకథలు కూడా చోటు చేసుకున్నాయని విమర్శకులు భావిస్తున్నారు. "The Buddha - Karita will tell us little new about Buddhism and its history, it is full of information for those who are interested in the history of Sanskrit Literature", వంటి విమర్శలీ సందర్భంలో పరిగణింప దగినవి.[3]

యశోధర శాక్యవంశానికి చెందిన కన్య అని అనేకులు చెప్తున్నారు. ఇందుకు భిన్నంగా 'పద్యచూడామణి' వంటి గ్రంథాలు యశోధర కొలియ వంశానికి చెందిన కన్య అని చెప్తున్నాయి.[4] శాక్యులు- కొలియులు రోహిణీనది కిరువైపులా నివసించే రెండు జాతుల వారు. కొలియ- రాజైన సుప్రబుద్ధ - ప్రమితల కుమార్తె యశోధర. కొన్ని కథల ననుసరించి గౌతముడు, వివాహ కాంక్షతో తనకు కానుకల నర్పించడానికి వచ్చిన అనేకమంది కన్యలలో యశోధరను మెచ్చి, ఆమె తండ్రి కోరిక

---

డా॥ యు. ఏ. నరసింహమూర్తి, విజయనగరం, మహారాజా కళాశాలలో తెలుగు శాఖాధ్యక్షునిగా పదవీ విరమణ చేసి, అక్కడే యు. జి. సి. ఎమిరిటస్ రీసెర్చి ఫెలోగా ఉంటున్నారు.

ననుసరించి క్షత్రియోచితమైన యుద్ధవిద్యలలో తన ప్రత్యర్థుల నోడించి, పరాక్రమ విజితమైన యశోధరను చేపట్టినట్లు తెలుస్తూంది.[5] యశోధర తల్లి ప్రమిత శుద్ధోదనుని సోదరి అని ఆ బాంధవ్యమే యశోధరా గౌతముల వివాహానికి దారి తీసిందని ఇతరమైన కథనం వినిపిస్తూంది.[6] 'ఈమె వయసు బుద్ధుని వయసు ఒకటే పదహారవ యేట అతనిని పెళ్లి చేసుకుంది' అని కూడా 'బుద్ధదర్శనం' అనే గ్రంథంలో పేర్కొన్నారు.[7] ఈవివాహం క్రీ.పూ. 438 లో జరిగి ఉంటుందని ఒక అంచనా. కాని బుద్ధుడు యశోధర కంటె పెద్దవాడని కొన్ని రాతలు తెలియ జేస్తున్నాయి.[8] యశోధర గర్భవతిగా ఉండగానే గౌతముడు ఇల్లు వదలి వెళ్లాడని, ప్రాసాద బహిర్భాగంలో పురోపవనంలో ఉండగా రాహులుని జన్మవార్తవిని ఆ బిడ్డను చూడకుండా అక్కడనుండి అలాగే అన్నీ వదులుకుని వెళ్లిపోయాడని, రాహులుని జన్మానంతరం ఒకానొక అర్ధరాత్రి భార్యకు చెప్పకుండా చీకట్లో వెళ్లిపోయాడని గౌతముని సన్న్యసన సందర్భాన్ని గూర్చి కూడా భిన్న కథనాలున్నాయి. గౌతముడే కాదు - బోధి సత్త్వులందరూ ఈవిధంగానే పుత్ర జననపర్యంతం సంసార సుఖాలనుభవించి, ఆ తర్వాత సన్న్యసించడం సంప్రదాయంగా అనుసరించినట్లు బుద్ధ చరిత్రం వలన తెలుస్తూంది.[9] ఈ సందర్భంలో అశ్వఘోషుడు వాస్తవానికి, విశ్వాసానికి మధ్య ఒక ముడి వేసినట్లు కనిపిస్తుంది.

బుద్ధుని మహాభి నిష్క్రమణ సందర్భాన్ని పురస్కరించుకుని యశోధర ప్రతిస్పందనను గూర్చి కూడా విభిన్న వ్యాఖ్యానాలు కనిపిస్తున్నాయి. ఒకటి - ఆమె సాధారణ గృహిణిలా గౌతముడు తనను, తన పసిబిడ్డను నిర్దయగా అర్ధరాత్రి చెప్పకుండా వదలిపెట్టి వెళ్లినందుకు కోపంతో వణకిపోయి, దుఃఖంతో పొగిలి పోయింది. ఆయన లేని లోకం ఆమెకు శూన్య బిలంగా కనిపించింది. ఆమె అత్తమామల సేవచేస్తూ, పునర్వివాహప్రలోభాల నన్నింటినీ అధిగమించి, గౌతముని ప్రత్యాగమనం కోసం, సమస్త సుఖాలను పరిత్యజించి, ఎదురు చూసింది. శుద్ధోదనుని మరణానంతరం మహాప్రజాపతి గౌతమి నాయకత్వంలో భిక్షు సంఘంలో చేరింది.[10] రెండు - బుద్ధుని మహాభినిష్క్రమణాన్ని యశోధర ఆటంక పరచినట్లు గాని అందుకు విచారించినట్లుగాని ప్రాచీన బౌద్ధగ్రంథాలలో ఎక్కడా, ఎవరూ చెప్పలేదు. భారతీయ సతీ ధర్మాన్ని గుర్తెరిగిన, సాంప్రదాయక కుటుంబంలో జన్మించిన గృహిణిగా గౌతముని ఆదర్శాలను పరిపూర్ణంగా తాను సమర్థించవలసిన అవసరాన్ని ఆమె గుర్తించింది. అందుకే గౌతముని అన్వేషణను అనుమతిస్తూ, మౌనంగా నిలిచి పోయింది. సింహాసనం, భోగజీవితం, అర్ధరాత్రి, పసిబిడ్డ, యౌవనంలో ఉన్న అందాలరాశియైన భార్య - ఇటువంటి వస్తుసామగ్రితో గౌతముని మహాభినిష్క్రమణం చుట్టూ ఒక ఉద్వేగ భరితమైన సన్నివేశకల్పన చేయదలచుకున్న కావ్యాలు, పురాణాలు చెప్పినట్లుగా ఆమె దుఃఖవివశ, క్రోధ ఘూర్ణిత కాలేదు. ఈ సందర్భం కూడా మార్గాంతరంలో యశోధర అనుమతినే సూచిస్తూంది.[11] మూడవది - యశోధర గౌతముని మహాభి నిష్క్రమణాన్ని మనఃపూర్వకంగా అనుమతించలేదు. బ్రాహ్మణ సంప్రదాయాన్ననుసరించి ఆమె గౌతముని సన్న్యాస జీవనాన్ని కేవలం అనుకరించింది. రాహులుడు బౌద్ధ భిక్షువుగా మారడం ఆమెకు సమ్మతం కాదు. ఈకారణంగానే, రాహులుని సన్న్యాస దీక్ష నిచ్చిన అనంతరం ఏర్పడిన సంక్షోభం కారణంగా, ఒక బాలునికి సన్యాస దీక్ష నివ్వడానికి తల్లిదండ్రులిద్దరి అనుమతీ కావాలని బుద్ధుడు ఒక నియమం చేయక తప్పలేదు. గౌతముడు త్యజించిన సింహాసనం తన కుమారుడికి

దక్కాలని ఆమె కోరింది. ఆ కోరికతోనే రాహులునితో ''వెళ్లు! నీ తండ్రిని నీ వారసత్వాన్ని నీకిమ్మని అడుగు' అని పంపించింది. గౌతముడు రాజ్యాన్నిస్తాడని అనుకున్నదేకాని, తన కొడుకు చేతిలో భిక్షాపాత్రను పెట్టి భిక్షువుగా మారుస్తాడని ఆమె ఊహించలేదు. తనకు భర్తతో పాటు, కుమారుడు కూడా దూరమైన ఆశాభంగాన్ని యశోధర అంత వేగంగా జీర్ణించుకోలేదు. ఈ సందర్భంలో చరిత్ర కందని సత్యాలేవో దాగి ఉన్నాయి.[12] ఇంతేకాదు వినయపిటకం మహాప్రజాపతి గౌతమిని బౌద్ధ సన్యాసినుల నాయకురాలిగా పేర్కొన్నా అంతకుముందే యశోధర పద్దెనిమిది వేలమంది స్త్రీలతో కలిసి గౌతముని వద్దకు పోయి బౌద్ధ సంఘంలో చేరిందని, సిద్ధార్థుని భార్యగా తన ఆధిపత్యాన్ని స్థాపించుకుని, స్త్రీలకు నాయకత్వం వహించిందని ఊహించడానికి చాలా అవకాశాలు కనిపిస్తున్నాయి.[13] యశోధర ప్రాధాన్యాన్ని తగ్గించి మహాప్రజాపతి గౌతమి ప్రాధాన్యాన్ని పెంచడంలో అగోచరమైన రహస్యమేదో ఉన్నట్లుగా Horner వ్యాఖ్య చెప్తోంది. ఈ ఊహ ప్రకారం శుద్ధోదనుని మరణానికి పూర్వమే యశోధర బౌద్ధసంఘంలో చేరి స్త్రీలకు నాయకత్వం వహించడం కొన్ని ఇతరమైన ఊహలకు అవకాశమిస్తుంది. భారతదేశంలో స్త్రీలకు మొదట గౌరవస్థానం కల్పించినవాడు బుద్ధుడని అంటారు. కాని బౌద్ధం కంటె ముందుగా జైనమతం స్త్రీలకు మత జీవితంలోను, సాంఘిక జీవితంలోను గౌరవస్థానాన్ని కల్పించింది. బుద్ధుడు స్త్రీలను సంఘంలో చేరడానికి అనుమతించడానికి అది ఒక ప్రబల కారణం. మహా ప్రజాపతి గౌతమి మూడు సార్లు ప్రయత్నించిన తరువాత, ఆనందుని జోక్యం వలన ఆమెకు, ఆమె అనుచరులకు బౌద్ధసంఘంలో ప్రవేశం లభించింది. పై ఊహ ప్రకారం యశోధర అంతకుముందే బౌద్ధ సంఘంలో ప్రవేశించడం నిజమైతే, ఈ సంఘటనల వెనుక ఏదో కుటుంబరాజకీయం బలంగా పని చేసిందని ఊహించవచ్చును. ఇందుకు ఒకటి రెండు ఆధారాలున్నాయి. రోహిణీ నదీ జలాలను పంట పొలాలకు పంచుకునే విషయంలో శాక్యజాతికి, కొలియజాతికి మధ్య ఏర్పడిన వివాదాన్ని పరిష్కరించడానికి బుద్ధుడు న్యగ్రోధవనంలో విడిదిచేసినప్పుడు మహాప్రజాపతి గౌతమి, అంతకు ముందు రెండు సార్లు చేసిన విఫలప్రయత్నాన్ని అధిగమించి, మూడవ ప్రయత్నంలో బౌద్ధ సంఘంలో ప్రవేశాన్ని పొందింది.[14] మహా ప్రజాపతి గౌతమి శాక్య జాతి స్త్రీ, యశోధర కొలియ జాతి స్త్రీ, ఈ రెండు వంశాలు వియ్యమందేయి, వీరి మధ్య వివాదానికి గౌతముని మహాభినిష్క్రమణం, రాహులుని సన్న్యాసం, తద్వారా యశోధరకు సంక్రమించిన తీవ్రసంతాపం కారణాలని ఊహించవచ్చును. ఈ రెండు జాతుల కలహం చాలా కాలం కొనసాగింది. ఆనందుని మరణ సందర్భంలో ఆతని శరీరావశేషాల కోసం ఈ రెండు తీవ్ర వివాదానికి పాల్పడితే, ఆనందుడు తన అద్భుతశక్తితో తన శరీరాన్ని రెండు భాగాలుగా చీల్చి రోహిణీ నదికి రెండు పక్కలా చెరొక భాగం పడేలా చేసేడు.[15] సంబంధుల మధ్య ఇంత గాఢమైన వైరానికి ఆడపిల్ల కష్టాలే ప్రబల కారణాలు కాగలవు. ఈ విరోధమే యశోధర, మహా ప్రజాపతి గౌతమిల మధ్య కూడా నడచి బౌద్ధసంఘాన్ని కొంతవరకు ప్రభావితం చేసి ఉంటాయని ఊహించవచ్చును. ప్రాచీన బౌద్ధ సాహిత్యంలో యశోధర వివరాలు కనిపించకుండా పోవడం కూడా ఇందులో భాగమే కావచ్చును.

రాజవంశీకులైన స్త్రీలు ఇరవై ఇద్దరు భిక్షుణులుగా మారినట్లు థేరీగాథల వలన తెలుస్తోంది.

థేరిగాథలంటే బౌద్ధ సన్యాసినుల గీతాలు. అందులో యశోధర పేరు లేదు. కాని 'అవదాన' అనే పేరుతో ప్రసిద్ధమైన రచనలు యశోధరవిగా భావిస్తున్నారు. అంగుత్తర నికాయంలో బుద్ధుడు క్షేమ, ఉత్పలవర్ణలను ఎక్కువగా ప్రశంసించేడు. బౌద్ధ భిక్షుణు లెలా ఉండాలనే దానికి బుద్ధుడు వీరిద్దరినీ ప్రమాణంగా నిర్ణయించేడు. ఇక్కడ కూడా యశోధర పేరు వినబడదు. కాని నారద మహాథేర ''స్త్రీ శిష్యులలో అసాధారణ శక్తులను పొందిన వారిలో ఈమె ముఖ్యమైనది'' అని పేర్కొన్నారు. ఇందుకు నిదర్శనంగా అంగుత్తర నికాయ వ్యాఖ్యలో భద్దకచ్చానను గూర్చిన ప్రశంసను ఉట్టంకించేరు. యశోధరకు రాహులమాతా, బింబా, భద్దకచ్చానా అనే పేర్లుకూడా ఉన్నట్లు నారద మహాథేర తెలియజేసారు.[16] భద్దకచ్చాన, భద్దకంచన అని బుద్ధుని భార్యకు పేర్లున్నట్లు బుద్ధవంశంలో (XXVI15) లో తెలుస్తోంది. మహావంశ జాతక వ్యాఖ్యానం ఆమెను రాహులమాత, బింబ, బింబ సుందరి అనే పేర్లతో పేర్కొంది. మహా వంశ, బుద్ధచరిత్రలో ఆమె యశోధర పేరుతో ప్రసిద్ధురాలయింది. లలితవిస్తర పద్య కావ్యంలో యశోవతి అని, వచనంలో గోప అని పేర్కొనబడింది. చైనా భాషలోని జీవిత చరిత్రలో మంథర, మనోహర, గోతమి, రాహులమాత అనే పేర్లతో కనిపిస్తోంది. టిబెట్ దేశపు బౌద్ధ పండితుడు అల్జొండరు సోమా ఆమెకు ఉత్పలవర్ణ, మృగజ అనే పేర్లున్నట్లు పేర్కొన్నాడు.

థేరిగాథలలో భద్దకచ్చన పేరుతో ఒక గాథ కూడా లేదు. బౌద్ధ భిక్షుణుల పేర్లలో ఈ పేరు కనిపిస్తుంది. కాని కులం పేర్కొన బడలేదు. I.B. Horner, E.J. Thomas బహుశా ఈమె బుద్ధుని భార్య కావచ్చునని పేర్కొన్నారు.[17]

ఒకానొక జాతకకథా వ్యాఖ్యానంలో బుద్ధుని ప్రధాన భార్య అయిన సోదరి బింబాదేవిని గూర్చిన వివరం ఉంది. బుద్ధుడు వైశాలిలో ఉండగా ఆమె ఐదువందలమంది శాక్య స్త్రీలతో కలిసి ధర్మ బోధను విని బౌద్ధ సంఘంలో చేరింది. ఆ తర్వాత ఆమె కుమారుడు కూడా బౌద్ధ సంఘంలో చేరేడు. ఆమె తనంతతానుగా బౌద్ధ భిక్షుణిగా మారింది. శ్రావస్తిలోని ఒక కుటిలో స్థిరనివాసం ఏర్పరుచుకుంది. బుద్ధుణ్ణి-రాహులుణ్ణి అనుసరిస్తూ తన గురువులతోను - తోటి భిక్షులతోను సహజీవనం కొనసాగించింది- అని ఆ వ్యాఖ్య చెప్తుంది. 'This son, Rahula is spoken of as a novice at the time when she joined the order"[18] అనే రాతవలన బింబాదేవి మహాప్రజాపతిగౌతమి కంటే ముందే సన్యాసినిగా మారి బౌద్ధ సంఘంలో చేరినట్లు తెలుస్తుంది.

థేరిగాథలలో ఉత్పలవర్ణ పేరు కనిపిస్తుంది. ఆమె రచన అందులో ఉన్నాయి. కొన్ని వివరాలను పరిశీలిస్తే ఉత్పలవర్ణ పేరుతో ఇద్దరు, ముగ్గురు స్త్రీలున్నట్లు కనిపిస్తుంది. స్త్రీలను సన్యాసినులుగా అంగీకరించడానికి బుద్ధుడు ఎనిమిది నియమాలు విధించేడు. భిక్షుణులు ఒంటరిగా అడవిలో నివసించరాదనేది అందులో రెండవ నియమం. ఆ నియమం ఏర్పడక ముందే సన్యాస దీక్షను స్వీకరించిన ఉత్పలవర్ణ, ఒక కీకారణ్యంలో కుటీరం నిర్మించుకుని నివాసమేర్పరచుకుంది. అందులో సుఖ శయ్య, చుట్టూ తెరలు కూడా ఉన్నాయి. ఆమె దీక్షను స్వీకరించక ముందు ఒక యువకుడు ఆమెను గాఢంగా ప్రేమించేడు. ఆమె అతనిని నంగీకరించలేదు. ఆయువకునికి ఉత్పలవర్ణ శ్రావస్తి సమీపంలోని అడవిలో కుటీరంలో ఒంటరిగా నివసిస్తోందని తెలిసింది. ఒక రోజు ఆమె శ్రావస్తికి భిక్షకు పోయిన

సమయంలో అతడు కుటీరంలో ప్రవేశించి ఆమె శయనం కింద దాగి ఉన్నాడు. ఆమె భిక్షానంతరం కుటీరంలో ప్రవేశించిన తరువాత నిస్సహాయురాలైన ఆమెను బలవంతంగా అనుభవించేడు. ఆ విషయం ఉత్పలవర్ణ మిగిలిన సన్యాసినులకు తెలియజేసింది. వారు భిక్షువులకు తెలియజేశారు. దాని మీద సంఘంలో ఎన్నో తర్జన భర్జనలు జరిగేయి. వారంతా ఉత్పలవర్ణ శారీరక సుఖాల పట్ల నిశ్చితమైన విముఖత ప్రదర్శించినందుకు ఆమెను గీతాలలో ప్రస్తుతించేరు. రాజు ప్రసేనజిత్తు ఆ సంఘటన తరువాత శ్రావస్తీ నగరంలోనే భిక్షుణులకు సురక్షితమైన ఆవాసాన్ని నిర్మించి ఇచ్చేడు.[19]

ఈ కథ వలన కూడా మహాప్రజాపతి గౌతమి కంటే ముందుగానే స్త్రీలు బౌద్ధ సంఘంలో చేరేరని తెలుస్తుంది. ఇక్కడ పేర్కొనబడిన, ఉత్పలవర్ణ బోధకురాలిగా ఉన్నట్లు కూడా తెలుస్తుంది. ఒక బౌద్ధ భిక్షుణికి ఉత్పలవర్ణ ఏడుసంవత్సరాలు వినయపిటకాన్ని బోధించినా ఆమెకేమీ బోధపడలేదని, అప్పుడు బుద్ధుడు ధర్మబోధలో భిక్షువులు, భిక్షుణులకు సహాయకారులుగా ఉండవచ్చునని తెలుస్తూంది.[20] ఈ ఉత్పలవర్ణనే బుద్ధుడు భిక్షుణులకు ప్రమాణంగా పేర్కొని, స్త్రీలకు బౌద్ధ ధర్మబోధ చేయడానికి నియమించి ఉంటాడని ఊహించడానికి అవకాశం ఉంది. బుద్ధుని మహాభినిష్క్రమణం తరువాత కూడా కొంతమంది యశోధర ప్రేమను అర్థించినట్లుగా, ఆమె నిరాకరించినట్లుగా తెలుస్తూంది. యశోధరకు ఉత్పలవర్ణ అని పేరుంటే అది ఈమే కావాలి.

ఇంకొక ఉత్పలవర్ణ అవివాహిత. ఈమెకు ఎన్నో సంబంధాలు వచ్చాయి. దేశంలోని రాజులు, సామాన్యులు ఎందరో ఈమె చేయి అందుకోవాలని ప్రయత్నించేరు. ఎవరి కివ్వాలో తేల్చుకోలేక తండ్రి ఆమెను బౌద్ధ భిక్షుణిగా మారమని చెప్పేడు. తల్లి దండ్రులు తమ కుమార్తెల వివాహ విషయం పరిష్కారం చేయలేని సందర్భంలో వారిని సన్యాసినులుగా జీవించడానికి అనుమతిస్తూన్నట్లు అభిరూపనంద, ఉత్పలవర్ణల కథలు చెప్తున్నాయి. తండ్రి అనుమతిస్తే ఉత్పలవర్ణ తాను కోరిన వరుణ్ణి పొందగలిగి ఉండేదేమో! (Therigatha i x iv)[21] ఆ రోజుల్లో కూడా బహు భార్యాత్వం కారణంగా స్త్రీలు కష్టాలు పడినట్లుగా ఆధారాలు కనిపిస్తున్నాయి. "A sentiment full endorsed by Uppala Varna, who found herself living in enimity with her own mother, the two of them" bound to one man" (Therigatha ixii)[22] అన్నవాక్యం ఇంకొక ఉత్పలవర్ణ కూడా ఉన్నదా అనుకునే అవకాశాన్ని కల్పిస్తుంది.

యశోధర వర్తమాన జీవిత వివరాలు స్పష్టంగా తెలియక పోయినా బౌద్ధ సాహిత్యంలో ఆమె గత జన్మకు, భవిష్యజ్జన్మకు సంబంధించిన వివరాలు మాత్రం స్పష్టంగా లభిస్తున్నాయి. బుద్ధుడు కపిలవస్తులో ఉన్నప్పుడు శుద్ధోదనుని ఇంట్లో భోజనం చేసి, తన ప్రధాన శిష్యులిద్దరితో కలిసి యశోధర ఇంటికి వెళ్ళాడు. గౌతముడు ఇల్లు వదలిన నాటి నుండి యశోధర ఎటువంటి పవిత్ర జీవనం గడుపుతూ బుద్ధుని మార్గాన్ని అనుసరిస్తూందో శుద్ధోదనుడు వివరిస్తాడు. అది విని బుద్ధుడు ''ఈమె ఈ జన్మలోనే కాదు గత జన్మలలో కూడా నన్ను ప్రేమతో అనుసరించింది'' అని చెప్పి చందకిన్నర జాతకం చెప్తాడు.[23] ఆ జన్మలో కిన్నరి కడుపున జన్మించిన బోధిసత్త్వునికి చంద్ర అనే భార్య ఉండేది. ఆ భార్యభర్త లిద్దరూ అన్యోన్యంగా ఉండగా ఒక రాజు ఆమె అందాన్ని చూసి ప్రలోభించి బాణంవేసి

బోధిసత్త్వుని చంపి చంద్రుని గ్రహించాలని ప్రయత్నిస్తాడు. చంద్ర రాజును శపించి, దేవతలను మెప్పించి తన భర్తను జీవింపజేసుకుంది. ఇది కథ. ''ఆ కాలమున రాజు అనురుద్ధుడు; చంద్ర రాహుల మాత; కిన్నరుడు నేనే'' అని బుద్ధుడు వివరిస్తాడు.

మహాయాన బౌద్ధశాఖలో ''సద్ధర్మ పుండరీక సూత్రమే'' అనే ప్రసిద్ధ గ్రంథం ఉంది. అందులో యశోధర భవిష్యజ్జన్మకథ పేర్కొనబడింది. బుద్ధుడు ఒక సభలో ధర్మబోధ చేస్తూ ఉంటాడు. ఆ సభలో మహాప్రజాపతి గౌతమి, యశోధర కూడా ఉంటారు. గౌతమి బుద్ధుడు ధర్మ బోధసమయంలో తనవేపు కన్నెత్తి చూడనైనా లేదని చిన్న బుచ్చుకుంటుంది. అది తెలుసుకుని బుద్ధుడామెతో మాట్లాడి భవిష్యజ్జన్మలో ఆమె గొప్ప ధర్మ ప్రచారకురాలు కాగలదని చెప్తాడు. అది విని యశోధర బుద్ధుడు తనను గూర్చి ఒక్క మాటైనా చెప్పలేదని మనసులో అనుకుంటుంది. అది తెలుసుకుని బుద్ధుడు ఆమెతో ఇలా అంటాడు. ''భవిష్యత్తులో నీవు బోధిసత్త్వ ధర్మాన్ని నిర్వహిస్తావు. అసంఖ్యాక బుద్ధగణం కంటె మిన్నగా ప్రచారం చేస్తావు. బుద్ధ మార్గాన్ని పరిపూర్ణం చేస్తావు. అప్రమేయ కాంతి పరవేషంతో కూడిన బుద్ధుడిగా మారతావు. సత్యమైన విశ్వ చైతన్యమంతా నీలో నిండి వుంటుంది. విశ్వం నిన్ను ఆరాధిస్తుంది. దేవతలు - మానవులు - విశ్వమంతా నిన్ను గౌరవిస్తుంది. నీ జీవన ప్రమాణం అసంఖ్యేయ కల్పాలకు విస్తరిస్తుంది.'' బుద్ధుని మాటలు విని ఆ భిక్షుణులిద్దరూ, వారి అనుచరగణమూ పరమానంద భరితులయ్యారు. అంతకుముందులేని ఒక నూతన శక్తి వారిని ఆవరించింది.[24]

ఈ కథను బట్టి చూస్తే యశోధరా - గౌతమీ మహాప్రజాపతుల సంబంధం భవిష్య జన్మలకు కూడా విస్తరించినట్లు కనిపిస్తుంది. యశోధర జీవితంలోని వెల్లడి కాని విషయాలకు, ప్రాచీన బౌద్ధ గ్రంథాలలో ఆమె పేరు ప్రస్తావనకు రాకపోవడానికి కుటుంబ రాజకీయాలు కారణమా? అన్న అంశం పరిశోధించ దగినదిగా ఉన్నది. ఆ విషయాలు తెలిస్తే కొందరు పరిశోధకులు భావిస్తున్నట్లుగా యశోధర జీవితాన్ని కమ్ముకున్న మంచు తెర విడిపోవచ్చును. భద్దకచ్చానా, బింబాదేవి, ఉత్పలవర్ణ, రాహులమాత పేర్లతో ప్రసిద్ధురాలైన భిక్షుణి యశోధరే అయినట్లైతే నిశ్చితంగా ఆమె మహా ప్రజాపతి గౌతమి కంటె ముందుగా బౌద్ధ సంఘంలో ప్రవేశించి, బుద్ధుని శిష్యురాండ్రలో అగ్రస్థానాన్ని పొందినట్లు కనిపిస్తుంది.

**అధస్సూచికలు :**

1. Doubts have been raised about whether the Buddha was married and had a family because there are no specific references to these matters in the early discourses. Yet his own statements regarding the luxuries his father provided in order to keep him tied to a house hold life do not rule out the possibility of his having married (a woman named Yasodhara) and father a son (Rahula)

David. J. Kalupahana, "A History of Buddhist Philosophy : Continuities and Discontinuities", Motilal Banaridas Publishers Private Limited, Delhi - 1992, P. 23.

2. కులాత్తతోఽ_ స్మై స్థిరశీలసంయుతా త్స్వాధ్వీం వపుర్హ్రీవినయోపపన్నాం।
యశోధరాం నామ యశోవిశాలాం తుల్యాభిధానాం శ్రియ మాజుహావ॥ బు.చ.2.26.
కావే తతశ్చారు పయోధరాయాం యశోధరాయాం సుయశోధరాయాం।
శాద్ధోదనే రాహుసపత్న వక్త్రో జజ్ఞేసుతో రాహుల ఏవ నామ్నా॥ బు.చ. 2-46.
తతస్తు రోషప్రవిరక్తలోచనా విషాద సంబంధ కషాయ గద్గదం।
ఉవాచ నిశ్వాస చలత్పయోధరా విగాఢ శోకాశ్రుధారా యశోధరా॥ బు.చ. 8-31.

3. Edward B. Cowell, The Buddha - Karita or The Life of Buddha, Cambridge 1892, preface.

4. తమాగతం శాక్యకుల ప్రదీపం క్షోణీపతిః కోలియ చక్రవర్తీ
స్వయం పదాభ్యామ భిగమ్య దూరం వైవాహికం మణ్డప మానినాయ
దదర్శ ధీరః క్షితిపాలపుత్రీం తత్ర స్థితాం తారక రాజ వక్త్రామ్
లీలారవిందేన కరస్థితేన పాథోధి కన్యామివ భాస మానామ్
సోత్కణ్ఠ మాలోకయతః కుమారీం సుధాంశుశోభా పరిభావు కాంగీమ్
అతీత్యవేలా మధిరాజసూనో రానంద సింధుః ప్రససారదూరమ్
పద్యచూడామణి, IV 37, 38, 39.

5. బుద్ధ చరిత్రము, తిరుపతి వేంకటకవులు, ద్వితీయాశ్వాసము.

6&7. "The Buddha and His Teachings", Narada Mahathera, అను. ''బుద్ధ దర్శనం'' అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ఆనంద బుద్ధ విహార, సికింద్రాబాద్ - 1999, పు. 85.

8. "It is also" in Apadana that Yasodhara is described as going to Gotama when she was in her seventy eighth year. He is made to say that he is in the eighties, hence it is very likely their last meeting."
I.B. Horner, Women under Prinitive Buddhism', Oriental Publishers & Distributers, Delhi - Bombay, Madras - 1995, P. 310.

9. వన మనుపమ సత్త్వా బోధిసత్త్వాస్తు సర్వే - విషయ సుఖ రసజ్ఞా జగ్ముఋత్పన్న పుత్రాః। అత
ఉపచిత కర్మా రూఢమూలేఽపి హేతౌ - సరతి మపనిషేవే బోధిమాపన్న యావత్॥
బు.చ. 2-56.

10. నారద మహాథేర, The Buddha and His Teachings, అను 'బుద్ధదర్శనం' అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, పు 85.

11. "No mention of his wife's objections to his renunciation is made in the early sources. Being a faithful wife in a traditional family, Yasodhara no doubt realized the need to support her husbands ideology and thus

remained a docile partner in siddhartha's quest for answers to the riddle of existence. The legend about Siddhartha's leaving home while his wife and new born baby were asleep, while highlighting to emotional stress in his renuniciation, also symbolize Yashodharas acceptance of her husbands decision."

David J. Kalupahana, "A History of Buddhist philosophy" Continuities and Discontinuities" PP 23 - 24.

12. I.B. Horner, "Women under primitive Buddhism." P 99
13. I.B. Horner, "Women under primitive Buddhism." P 102, P 310.
14. నారద మహేథేర, "The Buddha and His Teachings", అను 'బుద్ధదర్శనం', అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, పు. 102.
15. నారద మహాథేర, "The Buddha and His Teachings", అను 'బుద్ధదర్శనం', అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, పు. 101.
16. నారద మహాథేర, "The Buddha and His Teachings", అను 'బుద్ధదర్శనం', అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి. P 86, P 94, P 85.
17. "Of the entrant's from families whose caste is not given, Sona was placed first for her capacity of effort. There were other women, each of whom were placed foremost in her class. To neither is a verse ascribed. They were Baddha Kaccana (possibly Gotama's wife. see. E.J. Thomas, The Life of Buddha as Legend and History, London 1927, 8) PP 49, 59, 60, 110.) First among those who have attained to great gifts. (m a h a b h i n n a p p a t t a) that is supernatural lore; and Sigalamata, chief of those who are emancipated through faith ( శ్రద్ధా విముక్త).

    I.B. Horner, Women under Primitive Buddhism, P 171
18. I.B. Horner, Women under Primitive Buddhism, P 311
19. I.B. Horner, Women under Primitive Buddhism, P 155
20. I.B. Horner, Women under Primitive Buddhism, P 144
21. I.B. Horner, Women under Primitive Buddhism, P 179
22. I.B. Horner, Women under Primitive Buddhism, P 37
23. జాతక కథలు, అయిదవ సంపుటి, స్వామి శివ శంకర శాస్త్రి, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, కళాభవన్, హైదరాబాద్ - 4, 1971. చందకిన్నర జాతకము PP 8 to 14.
24. 'స్వద్ధర్మపుణ్డరీక సూత్రమే', 'Scripture of the Lotus Blossom of the Fine Dharma' (The Lotus Sutra) Translated from the Chainese Kumarajiva by Leon Hurvitz, Columbia University - 1976, Chapter 13, Page 203.

# బౌద్ధమత - ప్రవచనాలు

- డా॥ యన్.సి. రామానుజాచార్యులు

బౌద్ధ మతాన్ని గురించి పుస్తకాలలో చూడడం, ఎప్పుడయినా ఎవరి నోటంట అయినా వినడం మటుకే కాక, మొదటి మారుగా ఈ బౌద్ధ మత స్వీకారం చేసిన అమెరికన్ పౌరుడు కల్నల్ హెచ్.ఎస్. ఆల్కాట్ (H.S. Olcott). ఈయన శ్రీమతి హెచ్.పి. బ్లావట్స్కీ (H.P. Blavatsky)తో కలసి 1880లో శ్రీలంక వెళ్లారు. ఇద్దరూ త్రిరత్నాలను, పంచశీలను స్వీకరించి తాము 'బౌద్ధ మత అనుయాయులం' అని ప్రకటించారు. ఈ ప్రకటన వల్ల అంత వరకు వారు కలిసి పనిచేస్తున్న ఆర్య సమాజం (వ్యవస్థాపకుడు శ్రీ దయానంద సరస్వతి) తో విరోధం యేర్పడింది. కల్నల్ ఆల్కాట్ థియోసాఫికల్ సొసయిటీ అంతటినీ బౌద్ధ మత కూటమిగా మార్చి వేస్తున్నాడు అనే అపవాదు చెలరేగింది. ఈ విషయం అలావుంచి, కల్నల్ ఆల్కాట్ బౌద్ధ మత ప్రచారానికి గాను శ్రీలంకలోను, యావత్ ప్రపంచంలోను చేసిన కృషి ప్రస్తుతం గమనించడం అవసరం.

25 మే 1880న దీక్ష తీసుకున్న అనంతరం కల్నల్ ఆల్కాట్ తమయిద్దరి తరపున మాట్లాడుతూ యిలా అన్నాడు :

సక్రమమయిన బౌద్ధ సంప్రదాయకులుగా రూపొందడం ఒక ఎత్తు. ఏదో లాంఛనంగా ఒక బుద్ధ మత గుంపుకు చెందడం మరొక ఎత్తు. బౌద్ధంలో యేదయినా 'తప్పనిసరిగా' అనుసరించవలసిన సిద్ధాంతం వున్నట్లయితే మేం యిందులో ప్రవేశించే వాళ్లమే కాదు. పరమ గురువు మహోన్నత మానవుడు అయిన గౌతమ బుద్ధుని ప్రవచనాలు యిందుకు మూలాధారం అవడమే మాకు శిరోధార్యం అయిన విషయం. ఆర్యుల ఉపనిషత్తులకు, జ్ఞానవీచికలయిన మత సంప్రదాయాలకు (Wisdom-Religion) అవి రూపాంతరాలు. సనాతన ధర్మానికి, విశ్వగుణాదర్శానికి అది 'ఆత్మ' వంటిది. మా బౌద్ధం - ఒక్కమాటలో చెప్పవలెనంటే - తత్త్వ దర్శనం; అది కొంత మంది తోనే ముడిపడి పోయే ఆచారం (creed) కాదు.

అప్పటికే చైనా, జపాన్, శ్రీలంక యితర ఆసియా దేశాలలో కరుడు గట్టుకు పోతున్న creedsగా తయారవుతున్న బౌద్ధ మత శాఖలను ఒక గొడుగు క్రిందకు తీసుకురావటానికి శ్రీ ఆల్కాట్ చేసిన ప్రయత్నం. బౌద్ధం మత తత్త్వ దర్శనానికి ములాధారం అయిన సూత్రాలను వర్గీకరించి, సమీకరించి అందరికీ అందు బాటుకు తీసుకు రావడం. ఆయన వర్గీకరించిన 14 సూత్రాలు యిలా వున్నాయి.

1. బౌద్ధ మతస్థులు అందరు వ్యక్తుల పట్ల సహనము, సౌశీల్యము, సోదర ప్రేమ చూపించాలి. భూత దయ (జంతువుల పట్ల ఆదరం) తప్పనిసరి.
2. ఈ సృష్టి క్రమంగా పరిణామం అయింది. (నిర్మాణం కాలేదు) దీని నడకకు వెనుక ఒక ధర్మం వుంది. అదియే భగవంతుని అను శాసనము అనుకోవటానికి వీలులేదు.
3. బౌద్ధం ప్రవర్తిల్లే సూత్రాలు సహజశీలమైనవి. అనేక కల్పాల నుంచి, యుగాలనుంచి యివి పరంపరాగతంగా బోధింపబడుతూ వస్తున్నాయి. బుద్ధులు (వివేకోదయం పొందిన వారు, అని అర్థం), అనేకులు వీటిని ప్రవచించారు.

---

డా॥ యన్.సి. రామానుజాచార్యులు, 'దివ్యజ్ఞాన తత్త్వ దర్శన' ఆచార్యులు, మదరాసు థియోసాఫికల్ ఫెడరేషన్‌కు అధ్యక్షులు. 'శ్రీవిరించి'గా ప్రసిద్ధులు.

4. ప్రస్తుత కల్పంలో అవతరించిన శాక్యముని గౌతమ బుద్ధులు యీ పరంపరలో నాలుగవ బోధకులు. 2500 సంవత్సరాల క్రితం భారతదేశంలో ఒక రాచ కుటుంబంలో జన్మించారు. చారిత్రక పురుషుడు అయిన యీయన పేరు సిద్ధార్థ గౌతముడు.

5. అజ్ఞానం వల్ల కోరికలు కలుగుతాయి, తీరని కోరికలు పునర్జన్మలు తీసుకు వస్తాయి, దుఃఖానికి యీ జన్మ పరంపరలే కారణం, దుఃఖ నివారణం అవ్వాలంటే యీ జన్మల వలయంనుంచి బయలుపడాలి. కోరికలకు అంతం చెప్పగలగాలి. అందువల్లనే అజ్ఞానమూ అంతరిస్తుంది.

6. అజ్ఞానం వల్లనే జన్మ పరంపరలు అత్యంత అవసరం అనే అభిప్రాయం యేర్పడుతోంది. అజ్ఞానం అంతరిస్తేనే యీ జన్మల నిరర్థకత్వం పూర్తిగా తెలిసి వస్తుంది. మనిషికి ఒక్కటే జన్మ అనీ, యీ జన్మ తరువాత అనంతమైన సుఖ సంపదలలో ఓలలాడడమే విధాయకమనీ అనుకోవడం భ్రమ. అలాగే దుఃఖాలు శర పరంపరగా వుంటాయనుకోవడమూ భ్రమే.

7. ప్రవర్తన రీతులలో పరోపకార పారీణత, వివేకాభివృద్ధి, జ్ఞాన అంకురం, నీచ సుఖాల పట్ల కోరికను నాశనం చేసుకోవడం ద్వారా క్రమంగా అజ్ఞానం వైదొలగి పోతుంది.

8. జీవితాన్ని కొనసాగించాలనే కాంక్షే జన్మ పరంపరలకు హేతువు. ఈ కాంక్ష కరిగి పోయినప్పుడు జన్మ పరంపరలు వుండవు సక్రమ ప్రవర్తకుడు 'ధ్యానం' ద్వారా ఉదాత్తమైన శాంతి సీమలను, నిర్వాణాన్ని పొందుతాడు.

9. నాలుగు పరమ సత్యాల ద్వారా శాంతిని సాధించవచ్చునీ దుఃఖాన్ని తొలగింప చేసుకోవచ్చుని శాక్యముని చెప్పారు.

   1. సృష్టిలో వున్న దుఃఖం
   2. ఈ దుఃఖానికి హేతువు తృష్ణ, కోరిక
   3. దుఃఖ నివారణం, దాని నుంచి విముక్తులు అవడం
   4. నివారణోపాయాలు ఎనిమిది :

      (i) సరయిన నమ్మకం
      (ii) సరయిన ఆలోచన
      (iii) సరయిన భాషణ
      (iv) సరయిన ఆదరణ
      (v) సరయిన జీవనవిధానం
      (vi) సరయిన పరిశ్రమ
      (vii) సరయిన స్మృతి
      (viii) సరయిన ధ్యానం.

(అష్టాంగ మార్గం. ''సమ్యగ్'' అనేది ''సరయిన'' కు మూల పదం. ఇంగ్లీషులో right అని అనువదించినా, holisticకు సమానార్థకంగా భావించాలి. అన్ని మాటలూ అందరికీ ఒకేరకంగా అర్థం కావనే విషయం యిక్కడ మనం ప్రస్తావించుకోవాలి. మాటలు ఒక భావానికి ప్రతీకలు).

10. సరయిన ధ్యానం ఆధ్యాత్మ వివేకానికి దారి తీస్తుంది. ప్రతి మనిషిలోను నిగూఢంగా వున్న 'బుద్ధ' తత్వాన్ని వెలికి తీసుకు వస్తుంది.

11. బౌద్ధ మత సారం - శాక్యమునులే క్రోడీకరించినట్లు :

చెడ్డ చేయటం చేతకాకుండా పోవడం
మంచి చేయడం నేర్చుకోవడం
హృదయాన్ని నిష్కల్మషం చేసుకోవడం.

12. విశ్వం ఒక సహజ కారణ కార్య కుటుంబంతో నడుస్తుంది. దీన్ని 'కర్మ' అనుకోవచ్చు. వెనకటి కర్మల ఫలాలు ప్రస్తుతంలో పల్లవించి ప్రదర్శితం అవుతాయి. ఇప్పుడు జరిగే అనుభవాలకు అనుభూతులకు గతంలోనే బీజాలు పడినాయి.

13. సత్కార్మ ఆదరణ ధ్యేయం అనుకున్నప్పుడు, యీ ఆదరణకు అయిదు సూత్రాలు మార్గ దర్శకాలు :

హింస చేయకుండా వుండడం
దొంగతనం చేయక పోవడం
ఇంద్రియ లోలత్వంలో కొట్టుకు పోకపోవడం
అబద్ధాలు చెప్పకుండా వుండడం
మత్తు పదార్థాలు సేవించకుండా వుండడం

ఈ అయిదూ కాక మరో అయిదు వున్నాయి. అవి బహు కొద్ది మందికి మటుకే ఆచరణీయం. ఇక్కడ అప్రస్తుతం.

14. మూఢ నమ్మకాలకు ఆస్కారం, అవకాశం యివ్వదు బౌద్ధం. విజ్ఞానం లోను, సాహిత్యంలోను తమ పిల్లలకు తగిన తరిఫీదు యిప్పించడం తల్లిదండ్రుల బాధ్యత. ఎవరో గురువులు, ఋషులు చెప్పారని మూఢంగా నమ్మడం - సహేతుకంగా కనిపించని విషయాలను ఆచరించడం తగని పనులు.

ఈ 14 సూత్రాలను అన్ని దేశాల, వర్గాల, బౌద్ధ మత అనుయాయులు Common minimum teaching గా అంగీకరించాలని థియోసాఫికల్ సొసయిటీ అధ్యక్షుడయిన H. S. Olcott ప్రతిపాదించగా 1891 ఫిబ్రవరి 3వ తేదీన బర్మా దేశ బౌద్ధ భిక్షువుల నాయకులు ఆమోదించారు; 25 ఫిబ్రవరి 1891న శ్రీలంక బౌద్ధ భిక్షువులు- వారి నాయకులు అంగీకరించారు. అలాగే దరిమిలా జపాన్, చిట్టగాంగ్ దేశాల బౌద్ధ నాయకులు కూడా యిందుకు తమ ఆమోద ప్రమోదాలు తెలిపారు.

19వ శతాబ్దంలో బౌద్ధ మత ప్రవచనాలను ఒక తాటిమీదికి తీసుకు వచ్చేందుకు ప్రయత్నం పై విధంగా వుండగా 20వ శాతాబ్దంలో Chritmas Humphreys మరింత వివరంగా 12 సూత్రాలు ప్రతిపాదించి, ఈ తత్త్వ దర్శనానికి మరింత ప్రచారం తీసుకు వచ్చాడు. దీనిని గురించి మరోమారు ప్రస్తావించుకుందాం.

# వేదాంతదృష్టిలో బౌద్ధం

- శివలింగం

## పూర్వరంగం

బుద్ధుని కాలానికివైదిక శ్రమణ సంప్రదాయాలు ముఖ్యంగా కనిపిస్తున్నాయి. వేదాలు ఉపనిషత్తులు వెలువడివున్నాయి. వేద, ఉపనిషత్తులు బ్రాహ్మణ సంప్రదాయంగా చలామణి అవుతున్నాయి. శ్రమణ సంప్రదాయం వేద, ఉపనిషత్తుల సంప్రదాయాన్ని అంగీకరించలేదు. ఆర్య, అనార్య సంప్రదాయాలుగా పేర్కోడం సమంజసం కాదు. అనార్యుడుగా బుద్ధుడు ఎక్కడా చెప్పలేదు. బ్రాహ్మణ, శ్రమణ సంప్రదాయాలను సమానంగానే చూచాడు. ఇరువురినీ సమానంగానే గౌరవించాడు. ఎవరి విశ్వాసాలు వారివి. బ్రాహ్మణ సంప్రదాయంలో నిరంకుశత్వం, వర్ణ వివక్షతలు వున్నాయి. శ్రమణ సంప్రదాయంలో సమానత్వం, కులవ్యతిరేకతలు వున్నాయి.

పుట్టిన కులం గొప్పదని ఆయన భావించలేదు. వైదిక అవైదిక భావాలు బలంగానే సమాజంలో పాదుకొన్నాయి. ఆధ్యాత్మిక జీవనం, మత విశ్వాసాలు, ఆచారాలు, తాత్విక సిద్ధాంతాల ఆలోచన. ఆనాటి సామాజిక నిర్మాణం గురించి పరిస్థితులు గురించి తెలుసుకోవాలి. భౌతిక సుఖానికి (ప్రేయం), ఆధ్యాత్మికానందానికి (శ్రేయం) వున్న భేదాన్ని గుర్తించారు. యజ్ఞ యాగాదుల పేరిట జరిగే హింసనూ. అనవసర వ్యయాన్ని వ్యతిరేకించడమేగాక వాటివల్ల మోక్షం రాదన్న నిర్ణయానికి బుద్ధుడు వచ్చాడు. ఆత్మ నిత్యత్వం, ఏకత్వం, అమరత్వాన్ని పొందడం, అతీతమైన ఆనందం, కర్మ సిద్ధాంతం ఆత్మ నిగ్రహం, పునర్జన్మ, సత్యం, అహింస, తపస్సు, బ్రహ్మచర్యం, అపరిగ్రహం, యోగం - యివి బాగా ప్రాచుర్యంలో వున్న భావాలు. కురు, పాంచాల, కోసల దేశాల్లోనే ఉపనిషత్తులు వ్రాసి వుండవచ్చు. సంభాషణలు, చర్చలు జనక లేదా విదేహ ఆస్థానాల్లో బీహార్‌లోని ఇతర చోట్ల జరుగుతూ వుండేవి. సంసారాన్ని వొదిలేసి సన్యాసం స్వీకరించిన శ్రమణులు ముక్తిని సాధించడానికి మార్గంగా ఎంచుకున్నారు. వైదిక మార్గానికి వ్యతిరేకంగా వారి ఆలోచన అభివృద్ధి పొందింది. వ్రత్యుల జీవన విధానమే శ్రమణ, సన్యాస, జైన, బౌద్ధ సంప్రదాయ మార్గాలకు బాటవేసింది. గృహస్థులకు అనాసక్తి ముఖ్యమైన విషయం. మహావీరుడు, బుద్ధునికి ముందు పార్శ్వుడు నిర్గ్రంధ మార్గ వ్యవస్థాపికుడు. శుద్ధత, సత్యం, ఆత్మనిగ్రహం, ఉదాత్తత, త్యాగం, సంపదలేకుండా వుండటం వంటిగుణాలను చెప్పాడు. నిర్గ్రంధులు నాలుగు సూత్రాలను పాటించాలి: 1 సత్యం, 2. అహింస, 3. దొంగతనం చేయకుండుట, 4. ఆస్తి లేకుండా వుండుట. మహావీరుడు తీర్థంకరులలో చివరివాడు. జైన ప్రవక్త అయిదవ సూత్రం బ్రహ్మచర్యాన్ని చేర్చాడు. ఆత్మ సాక్షాత్కారం పొందాలంటే అన్నిటినీ వొదులుకోవాలనేది వైదిక అవైదికుల్లోనూ వుంది. ప్రాపంచిక జీవితం దుఃఖ భాజనం, తృష్ణాపూరితం. మానవ జీవిత పరమార్థం వీటి నుండి విముక్తి పొందడం. పరమార్థాన్ని సాధించడానికి భౌతిక ఇంద్రియ సుఖజీవికి, పామర జీవికి, గృహస్థుకు కుదిరేపని కాదు. వీటన్నిటిని వొదిలేయడం వల్లనే సాధ్యమౌతుందనేది వారి

---

శివలింగం, చల్లపల్లి, వీవర్స్ సొసైటీలో పనిచేసి రిటైర్ అయ్యారు.

విశ్వాసం. శ్రమణుల్లో తెల్ల రంగు వస్త్రాలు ధరించేవారు, నగ్నంగా వుండేవారు, తలలు బోడులవారు, గడ్డాలవారు, జుట్టు తలపైన ముడి వేసేవారు ఇలా రకరకాలు.

జన సామాన్యంలో వున్న ఆచారాలు మూఢ నమ్మకాల్లో వృక్షారాధన బీహార్‌లో ప్రాచీనకాలం నుంచి వుంది. సనాతన హిందువుల్లో రావి చెట్టును పూజించటం ఈనాటికీ వుంది. చైత్యారాధన బుద్ధునికి ముందు నుంచి వున్న ఆచారం. చైత్యాన్ని వైదిక భాషలో స్తూపం అంటారు. 'విష్ణో స్తూపోసి' యజ్ఞ స్తంభం యూప. స్మృతి చిహ్నంగా ఇటుకలతో నిర్మించి స్తూపం అన్నారు. నలుగురు ప్రధాన వ్యక్తుల స్మృతి చిహ్నంగా స్తూప నిర్మాణం చేయాలని బుద్ధుడు పేర్కొన్నాడు. తథాగతుడు, ప్రత్యేక బుద్ధుడు. తథాగతుని శిష్యుడు. చక్రవర్తి. నందరాజులకు స్తూపాలు నిర్మించినట్టు చరిత్ర. అట్టకథను బట్టి బుద్ధుని కాలానికి చైత్య నిర్మాణం వుందని తెలుస్తున్నది. నగరాలకు గ్రామాలకు దూరంగా మరణించిన వారి అవశేషాలను పాతిపెట్టి చైత్యాన్ని నిర్మించేవారు. ప్రజలు తమ కోరికలు తీర్చమని చైత్యాన్ని ఆరాధించేవారు. చైత్య వందనం అని కూడా వున్నది.

స్వతంత్ర భావాలు గల ఆలోచనాపరులు ఆరుగురు. వారు మహావీరుడు, అజితకేశకంబళి, మఖ్ఖలిగోశాల, పూర్ణ కాశ్యపుడు, ప్రక్రుధ కాత్యాయనుడు, సంజయ వేలట్టిపుత్త. మహావీరుడు అనేకాంతవాదాన్ని, మఖ్ఖలిగోశాల సంసారవిశుద్ధిని, పురాణ కాశ్యపుడు అక్రియావాదాన్ని, అజిత కేశ కంబళి ఉచ్ఛేదవాదాన్ని ప్రబోధించారు. ప్రక్రుధకాత్యాయనుడు శాశ్వతవాదాన్ని, సంజయ వేలట్టిపుత్త విక్షేపవాదాన్ని ప్రచారం చేశారు. ఇటువంటి వాతావరణంలో సామాజిక పరిస్థితుల్లో, తాత్విక సిద్ధాంతాల కోలాహలంలో బుద్ధుడు మధ్యేమార్గాన్ని ప్రవేశపెట్టాడు. జీవిత సమస్యల పరిష్కారం కోసం ప్రయత్నించాడు. నలభై సంవత్సరాలు తన సిద్ధాంతాలను బోధించాడు. అతని మరణానంతరం వారి బోధల్ని అనుయాయులు గ్రంథస్థం చేశారు. సులభతరమైన ఆచరణ యోగ్యమైన సిద్ధాంతంగా విశ్వాసంగా వున్న బౌద్ధం తరవాత ఒక సంప్రదాయ మార్గంగా రూపొందింది. వైదిక అవైదిక ఆలోచనారీతులు, మత, తాత్విక, ఆధ్యాత్మిక పరిస్థితులు బుద్ధునికి ఒక శుభంకరమైన తాత్విక భావాన్ని కలిగింపచేశాయి. బుద్ధుడు నిర్వాణం పొందగానే బోధించిన ప్రబోధాలు ఎంతో పరిశీలన చేసి మానవ జీవితాన్ని అవగాహన చేసుకుని, ఆనాటి తాత్విక భావాల గుణ దోష విమర్శ చేసుకుని ఆచరణాత్మక భావాలుగా రూపొందినవి.

**బౌద్ధం - వేదాంతం:**

భారతదేశంలో ఉపనిషత్తుల అనంతరం వెలువడిన తాత్విక సిద్ధాంతాలకు మూలం ఉపనిషత్తులేనని రనడే పండితుడు ఉపనిషత్తుల తత్వ గ్రంథంలో వివరించాడు. బౌద్ధానికి మూలం ఉపనిషత్తులేన్నాడు. వేదాంతానికి బౌద్ధానికి సంబంధం లేదన్న వారూ వున్నారు. బుద్ధుడు నిర్వాణం కోసం చేసిన సాధనంతా వేదాంత ఋషుల మార్గమేనని నిస్సందేహంగా చెప్పవచ్చు. సత్యాన్వేషణ కోసం ఆనాడు ఋషులనే ఆశ్రయించేవారు. సత్యాన్ని దర్శించిన వారికి కుల, మత వివక్షత వుండదు. వృద్ధాప్యం, రోగం, మరణం

- వీటిని గురించిన ఆలోచన అతడిని అంతర్ముఖుణ్ణి చేసింది. భోగలాలస జీవితాన్ని త్యజించి ఆత్మన్వేషణకు అంకితం కావలసి వచ్చింది. ఎన్నో మార్గాలను అనుసరించి సాధన చేశాడు. అనేక శారీరక కష్టాలు అనుభవించాడు. సత్యాన్వేషణ కోసం తపించాడు. చివరకు జ్ఞానోదయం అయింది. ఇదంతా వేదాంతుల సాధనే. అవిద్యాంధకారంలో వున్న ప్రజకు ధర్మదీపంతో వెలుగు చూపిన ఋషి బుద్ధుడు.

ఉపనిషద్భావాలే కొత్త తొడుగులతో కనిపిస్తాయి. వైదిక కర్మకాండలు, జంతుహింస కఠిన వర్ణ వివక్షతలు, బ్రాహ్మణాధిపత్యాలను తీవ్రంగా వ్యతిరేకించాడు బుద్ధుడు. పాపాలను కడిగేసి, అవిద్యను తొలగించుకుని శుద్ధ జ్ఞానం జ్యోతితో ప్రకాశించే బ్రాహ్మణుని ఆదర్శ ఋషిగా గౌరవించాడు. బుద్ధుని అనంతరం హీనయానులు అపార్థం చేసుకున్నారు. అనాత్మవాదం, క్షణిక వాదాలను బౌద్ధానికి ముఖ్య భూమికలుగా పేర్కోవడం జరిగింది. మనస్సును క్షణిక భావాలుగాను, పదార్థాన్ని క్షణిక సంవేదనలుగాను దిగజార్చారు. అశ్వఘోషుడు. మహాయాన సూత్రాలు తీవ్రంగా నిరసించాయి. సర్వాస్తివాదులు హీనయానులుగా ప్రచారం చేసుకున్నారు. అశ్వఘోషుడు ఉపనిషత్తుల వెలుగులో బుద్ధుడిని వ్యాఖ్యానించాడు. సచ్చిదానంద రూపమే సత్యం అని ప్రకటించాడు. చెల్లాచెదురుగా పడివున్న వాటినన్నిటిని మహాయాన సూత్రాలుగా కూర్చినవాడు నాగార్జునుడు. అతని శిష్యుడు ఆర్యదేవుడు గురువు అడుగు జాడల్లో నడిచాడు. శూన్యవాదం బౌద్ధాన్ని వేదాంతానికి దగ్గరగా చేర్చింది. శ్రీహర్షుడు కూడా శూన్యవాదం వేదాంతం వంటిదే గనుక ఖండించలేమన్నాడు. సర్వం దుఃఖం దుఃఖం, సర్వం క్షణికం క్షణికం లాంటి మాటలు ప్రపంచమంతా దుఃఖమయమని నచికేతుడు చెప్పాడు. ఉపనిషత్తులకు భిన్నమైన భావాలను కూడా బౌద్ధం ఉపనిషత్తులనుండే స్వీకరించిందని రనడే అన్నాడు. అసంగుడు, వసుబంధు శూన్యవాదాన్ని అంగీకరించారు. తత్వాన్ని శుద్ధచైతన్య స్థాయికి తీసుకువచ్చారు. విజ్ఞాన వాదం వేదాంతానికి దగ్గరయింది. దిన్నాగుడు దూరం చేశాడు. ఆరవ శతాబ్దంలో గౌడపాదుడు అద్వైతి. నాగార్జునుడు, వసుబంధుల ప్రభావం స్పష్టంగా వుంది. బౌద్ధుడు కాదు కాని బౌద్ధ ప్రభావితుడు. బుద్ధుని మీద బౌద్ధులమీద ప్రేమ, అభిమానాలు గలవాడు, బౌద్ధులకు స్నేహ హస్తం చాపినా బౌద్ధులు అందుకోలేదు. భావవివేకుడు గౌడపాదుని నిష్పాక్షిక శక్తిని గుర్తించాడు. ఏడవ శతాబ్దంలో శూన్యవాదులైన చంద్రకీర్తి, శాంతిదేవుడు, స్వతంత్ర విజ్ఞాన వాది ధర్మ కీర్తి, మీమాంసకుడైన కుమారిలుడు వర్ధిల్లిన కాలం. బ్రాహ్మణమతం, సంస్కృతి, తత్వం పునరుజ్జీవనం పొంది బౌద్ధానికి వ్యతిరేకంగా నిలబడ గలిగింది. బౌద్ధాన్ని వామాచార తంత్రంలోకి దిగజార్చుతున్నారు, ధనికుల ఆదరణ తగ్గింది. బౌద్ధారామాలు అవినీతి నిలయాలుగా మారాయి. ఇటువంటి పరిస్థితుల్లో బౌద్ధానికి వేదాంతానికి పడినగండిని పూడ్చేందుకు బౌద్ధ పండితుడెవడూ పూనుకోలేదు. భావ వివేకుని స్వతంత్ర మాధ్యమిక వాదాన్ని, దిన్నాగుని స్వతంత్ర విజ్ఞానవాదాన్ని చంద్రకీర్తి ఘాటుగా విమర్శించాడు. నైయాయికులు, మీమాంసకులు బౌద్ధ వ్యతిరేకులు. ధర్మకీర్తి యిద్దరినీ విమర్శించాడు. శంకరుడు సురేశ్వరులు మీమాంసకుల్ని ఖండించారు. ఉపనిషత్తులే ఆధారమని చెప్పిన వసుబంధును సమర్థించలేదు ధర్మకీర్తి.

ధర్మకీర్తి మేధావి. తార్కిక పటిమ కలవాడు. సత్తా నుండి క్షణిక వాదాన్ని బయటకు తీసుకు వచ్చినట్లయితే దిన్నాగుని తప్పు సరిదిద్దినవాడయేవాడు. కాని ధర్మకీర్తి కూడా ఆపని చేయక పోవడం వలన బౌద్ధానికి వేదాంతానికి పడిన గండి మరింత విశాలమయిందే గాని తరగలేదు. ధర్మకీర్తి మీమాంసకుల మీద విరుచుకు పడటం వలన బౌద్ధానికి నష్టమే జరిగింది. కుమారిలుడు మీమాంసాదర్శనాన్ని సమర్థిస్తూ బౌద్ధాన్ని ఖండిస్తూ శ్లోకవార్తికం వంటి ఉద్గ్రంథం (వ్రాయాల్సి వచ్చింది. బౌద్ధానికి పెద్ద దెబ్బ).

నైయాయికులు, కుమారిలుడు బౌద్ధాన్ని ఎన్ని గుద్దులు గుద్దినా ఎనిమిదవ శతాబ్దంలో శాంత రక్షితుడు, కమలశీలుడు వచ్చి అందరినీ ఎదుర్కొని బౌద్ధాన్ని రక్షించారు. దిన్నాగుడు, ధర్మకీర్తిలు నడచిన బాటలోనే వీరూ నడిచారు. వసుబంధుకు వందిమాగధ స్తోత్రాలు పలికారే కాని తత్త్వాన్ని ముందుకు తీసుకుపోలేదు. బౌద్ధానికి వేదాంతానికి చాలా పోలికలున్నాయి. చైతన్యం శాశ్వతం అనడమే వేదాంతంలో వున్న తప్పు అన్నారు. వేదాంతం అన్ని విమర్శల్ని అంగీకరించినా వేదాంత దృక్పథాన్ని వీడలేదు. క్షణిక విజ్ఞానం సత్యంకాదన్నది వేదాంతం.

చైతన్యం వ్యావహారికంగా శాశ్వతం. క్షణికమైతే దుఃఖం, శాశ్వతమైతే ఆనందం. శాంతరక్షితుడు, కమలశీలుడు గణనీయమైన గతితార్కిక మేధావులు. ఆనాడు బౌద్ధాన్ని రక్షించటమే పరమ ధ్యేయంగా ఎంచుకున్నారు. బౌద్ధం మీద అసహిష్ణుత, ద్వేషం ఉచ్చస్థాయిలో వుండటం వల్ల శాంత రక్షితుడు, కమలశీలుడు బౌద్ధానికి వేదాంతానికి మధ్య గండిని పూడ్చలేకపోయారు. పండితులైన బ్రాహ్మణులకు బుద్ధుడంటే గౌరవం వుందన్నాడు శాంతరక్షితుడు. పాపాలన్నిటిని ప్రక్షాళన చేసుకున్నవాడే బ్రాహ్మణుడు అని చెప్పాడు. విమర్శల్లో పరుష పదాలనుపయోగించారు. పిడివాదనలు చేశారు బ్రాహ్మణులు. బుద్ధుడు మూర్ఖులకు, శూద్రులకు బోధించాడు. అందుకని అతనిబోధలు చెల్లని నాణెంలా తప్పుడు బోధలని మీమాంసకులన్నారు. పాము కాటుకు గురైన ముంగిస విషాన్ని విరిచే ఆకును పళ్ళతో తాకిన వెంటనే విషం విరిగిపోతుంది. అలాగే బౌద్ధ తత్వ విషపూరిత దుర్భావాలను వేదానుయాయుని నోటినుండి వెలువడే ఏ భావమైనా ఖండిస్తుంది. బౌద్ధులు కూడా తగినరీతిలో సమాధానాలిచ్చారు. 'చాలా కాలం అయింది. స్త్రీలు చపలచిత్తులు. అందుకని బ్రాహ్మణ జాతి పవిత్రతను గురించి చెప్పడం కష్టం. బౌద్ధ సర్పం విషపూరిత నయనాలముందు మూర్ఖుడైన బ్రాహ్మణుడు ఊపిరి కూడా పీల్చుకోలేడు. పాదాల వద్ద వున్న పూసలదండలా, హారంలా మాటాడలేనిదై అలా ఎంతటి వేద పండితుడైనా చూడాల్సిందే. ఈ విధంగా విమర్శించుకున్నారు, బ్రాహ్మణ మతాన్ని ఎదుర్కోలేకపోయింది బౌద్ధం, శాంతరక్షితుడు టిబెట్ వెళ్ళిపోయాడు, కమలశీలుడు కూడా గురువుగారి బాట నడిచాడు.

తరవాత శంకరుడు వచ్చాడు. బౌద్ధానికి శంకరుడు చాలా రుణ పడివున్నాడు. శూన్య విజ్ఞాన వాదాలను శంకరుడు ఖండించలేదు. కుమారిలుడు బౌద్ధ ఆరామాల్లో చదువుకున్నాడు. ముఖ్య విషయాలు తెలుసుకున్నాడు. ముందు బౌద్ధుడు కావచ్చు. శూన్య విజ్ఞానవాదాల గ్రంథాలు శంకరునికి

దొరికి వుండకపోవచ్చు. ఈ రెండూ వేదాంతానికి చాలా దగ్గర అనీ తెలుసు. శూన్య వాదాన్ని నిరాశావాదంగా కొట్టివేశాడు. శంకరుని తరవాత వచ్చిన అద్వైతవేదాంతులు బౌద్ధం క్షీణించాక నిదానంగా ఆలోచించడానికి అవకాశం చిక్కింది. శూన్యవాదం నిరాశావాదం కాదని దానితో పేచీ లేదని వేదాంతంలో కలిపేశారు. విజ్ఞాన వాదం సత్యం క్షణిక విజ్ఞానం కాదని అది పరిపూర్ణ భావవాదం అని దానితో పేచీలేదని దాన్నీ వేదాంతంలో కలుపుకున్నారు. శ్రీ హర్షుడు బౌద్ధ వేదాంతాల మధ్య వున్న పోలికలను ఎత్తి చూపాడు. మహాయాన బౌద్ధం వేదాంతం ఒకే చెట్టు కొమ్మలు. ఆయా కాలాల్లో ఉపనిషత్తుల వేదాంతాలోచనాభివృద్ధి క్రమం. నైరాత్మ వాదం క్షణిక వాదం రెండూ బౌద్ధానికి వేదాంతానికి మధ్య ప్రధాన భేదాలు. శుద్ధచైతన్యాన్ని ఆత్మను నిరాకరించింది బౌద్ధం. బౌద్ధంలో ఆత్మ, జీవాత్మ, అహం, అది అవిద్య, మాయ వాసన, అంతఃకరణ, బుద్ధి. ఆత్మకు బదులు కొన్ని పర్యాయపదాలు ఉపయోగించారు. బోధి, ప్రజ్ఞ, చిత్తం, బోధిచిత్త, తత్వం, విజ్ఞానం చిత్తమాత్ర, విజ్ఞాన మాత్ర, విజ్ఞాప్తి మాత్ర, తథతా, తథాగత గర్భ, ధర్మధాతు, ధర్మకాయ, బుద్ధకాయ. అశ్వఘోషుడు ఆత్మ అనేశాడు. అసంగుడు శుద్ధాత్మ, మహాత్మ, పరమాత్మ. శాంతరక్షితుడు విశుద్ధాత్మ అన్నాడు. బౌద్ధులూ వేదాంతులూ సరియైన అవగాహన లేక ఒకొరినొకరు తీవ్రంగా విమర్శించుకున్నారు. సత్తాకు పర్యాయపదంగా ఉపనిషత్తుల్లో ఆత్మ కనిపిస్తుంది.

ఒకటవ శతాబ్దంలోని అమరకోశం బుద్ధుణ్ణి అద్వయవాది అని పేర్కొన్నది. ఆకాలానికి కొందరు బుద్ధుడు అద్వైతాన్ని బోధించాడన్న భావం వున్నది. శంకరుడిని ప్రత్యర్థులు ప్రచ్ఛన్న బౌద్ధుడన్నారు. ఆత్మ చైతన్య ప్రకాశమే పారమార్థిక సత్తా, జీవాత్మ, బౌద్ధుల, విజ్ఞాన వాదుల అద్వైతుల భావం కూడా అదే. ఉపనిషత్తుల్లో అద్వైతం అంటే అద్వంద్వం, అద్వయం. బౌద్ధ సాహిత్యంలో అద్వయ పదం అద్వైతం అనే అర్థంలోనే ఉపయోగించారు, అందుకే అద్వయ వాది అని అమరకోశంలో బౌద్ధుడైన అమరసింహుడు చేర్చాడు. బౌద్ధవేదాంతాల సమన్వయం కోసం గౌడపాదుడు ప్రయత్నించాడు. తార్కిక కౌశలంతో కూడిన మేధాగత తాత్విక చర్చల్లోకి మాటలమయ సభలోకి వెళితే గుమ్మానికీ గోడకూ భేదం తెలియక తలకు బొప్పి కట్టక తప్పదు. దెబ్బతిన్న మనసు రెచ్చిపోక తప్పదు. అందుకే ఇంద్రియాలను అదుపులో వుంచుకోవడం కోసం ధ్యానాన్ని నొక్కి చెప్పారు. బుద్ధుడు నైతిక జీవనాన్ని ప్రబోధించాడు. అదొక చారిత్రక అవసరం. అలా జీవించాలంటే శిక్షణ చాలా అవసరం. ఉపనిషత్తులు మోక్షాన్ని, బుద్ధుడు నిర్వాణాన్ని బోధించారు. జీవాత్మ పరమాత్మలో పూర్తిగా కలిసిపోవడం మోక్షం, నిర్వాణంలో పరమాత్మలో లీనం కాకుండా దర్శించి లోక సేవ చేయటం. ఇది రెంటికీ వున్న భేదం.

భగవద్గీత ఉపనిషత్తుల బ్రహ్మన్ని. బౌద్ధుల నిర్వాణాన్ని కలిపి బ్రహ్మ నిర్వాణం అనిపిలిచింది. గీతలో చెప్పిన స్థిత ప్రజ్ఞత్వ లక్షణాలు. నిర్వాణం పొందిన వాడికీ వర్తిస్తాయి. నిర్వాణం మార్మిక ఆధ్యాత్మిక దర్శనం. ఇంద్రియాల నుండి, మనసు నుండి, ఆలోచనల నుండి, జన్మ పరంపర నుండి విముక్తి. మౌన ధ్యానం ద్వారా అంతర్ముఖుడవై సాధన చేసిన వాడికే విముక్తి లభిస్తుంది. బుద్ధుడు సాధనలో మరణించి జీవించాడు. ఇంద్రియాల్ని జయించాడు లోకం తలవంచింది. కొంతమంది బ్రహ్మ విద్యను భుక్తి కోసం అమ్ముకున్నట్లు ఉపనిషత్తుల గాథలవల్ల తెలుస్తుంది. అంతమాత్రాన బ్రహ్మవిద్య అంతా మోసం దగా అనడం సమంజసం కాదు. సత్య సాక్షాత్కారం పొందిన వాడెలా

వుంటాడో గీతలో స్పష్టంగా చెప్పబడింది. నిర్వాణం పొందినవాడూ అంతే. ఉపరితల జీవితం వల్ల సాధ్యమయ్యేది కాదు. బుద్ధుడు లోకధర్మాన్ని ప్రబోధించాడు. అందరినీ ఏ ఒక్కడూ మార్చలేడు. ఆ మార్పు తాత్కాలికమే. ఎందరో మహానుభావులు జన్మించి అంధకారంలో వున్న వారికి వెలుగు చూపించి వెళ్ళిపోయారు. వేమన మనకు మరింత తేట తెలుగులో ఎన్నో లోతు వెలుగులు చూపించాడు. బౌద్ధం పునరుజ్జీవనం పొంది నూతన కాంతులతో వెలుగొందడం ఆహ్వానించదగిన పరిణామం.

**ముగింపు :**

బౌద్ధం తత్వం నుంచి మతాన్ని వేరు చేసింది. శీల సమాధులకు ప్రాధాన్యత యిచ్చింది కాని సమ్యక్ జ్ఞానానికి కాదు. ఆచరణ అంటే శీలం సమాధి. దర్శనం ( ప్రజ్ఞ) ఈ రెంటిలో దర్శనానికి ప్రాముఖ్యం యిచ్చారు. బౌద్ధ మతం తత్వం అభివృద్ధి చెందడానికి మధ్యమ మార్గం కృషి చేసింది. బౌద్ధ జీవన తత్వం ఇతర సాంప్రదాయాలకన్నా భిన్నంగా వుండటం. సమాజానికవసరమయిన నూతన ప్రవర్తన నియమావళిని, నూతన భావాలను రేకెత్తించడానికి దోహద పడింది. మధ్యమ మార్గం హేతుబద్ధమైన ఆలోచనను పాదు కొల్పింది. శాశ్వత వాదాన్ని ( యధాస్థితివాదం) ఉచ్ఛేద వాదాన్ని ( భౌతికవాదం) తిరస్కరించింది. ఒక నూతన తాత్విక జీవన విధానాభివృద్ధికి అవకాశం కలిగించింది. ప్రాచీన కాలం నుంచి పాతుకుపోయిన సాంప్రదాయక మత విశ్వాసాలు, తత్వం, శ్రుతుల సంస్కృతి సమాజం నుండి ఒక్కసారిగా పరివర్తన తీసుకురావడం కష్టం. మౌలిక సంస్కృతి భావాలను మార్చాలి. మానవ జాతి చరిత్రలో బుద్ధుడు. అతని అనుయాయులు చేసిన ప్రయోగం నాన్యతో దర్శనీయం. మతలక్ష్యం బహుజన హితాయ, బహుజన సుఖాయ. అలక్ష్యం చేసిన కుల, మత, భాష, సామాజిక తెగల నన్నిటికి కొత్త జీవం నింపి తలెత్తుకునేలా చేశాడు. శక్తివంతమైన సంస్కృతిని ఢీకొన్నాడు. ప్రత్యక్షంగా ఎదుర్కొన్నాడు. చక్రవర్తులు బ్రాహ్మణ పురోహితులతో వారి ప్రయోజనాల కోసం చేసే యజ్ఞాలను వద్దని వేడుకున్నాడు.

బుద్ధుడు సామాన్య బలహీన వర్గాల కోసం, వారి సామాజిక న్యాయం కోసం చేసిన ప్రయోగాత్మకమైన కృషి ఈనాటికీ నిలిచే వుంది. సామాజికి, సాంస్కృతిక పరివర్తనకు అహింసా ప్రబోధం సత్ఫలితాన్నిచ్చింది. వ్యక్తిలోను సమాజంలోను మార్పు తీసుకురావడానికి బుద్ధుని పరివర్తన వాదాన్ని దృష్టిలో వుంచుకోవాలి. పరిగ్రహం - త్యాగం, అనురాగం - వైరాగ్యం, భోగం - మోక్షం - పరస్పర విరుద్ధ భావాల సంఘర్షణలో సమన్వయాన్ని సాధించలేక ఆందోళనకు గురి కావలసి వస్తూ వుంది. మత, తత్వాలు రెండూ అతివాదాల కొమ్ము కాస్తున్నాయి. మానవుని అస్తిత్వం నిత్యమా అనిత్యమా? విముక్తమా నిబద్ధమా? మానవుడు చిరంజీవి. వ్యక్తులు వస్తూ పోతూ వుంటారు. మానవుడు తన అస్తిత్వపు ఉనికిని తెలుసుకుని విశ్వాసాలను సంప్రదాయాలను అధిగమించి సత్యాన్ని దర్శించి సమకాలీన సమాజానికి సమస్యల పరిష్కారానికి సందేశం యివ్వగలగాలి. బుద్ధుడు మానవాళికి మహనీయమైన తేజోవంతమైన మార్గాన్ని చూపిన ధర్మజ్యోతి. బుద్ధుడు చూపిన దారిలో పయనిస్తే ఆధునిక సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది.

# ప్రపంచ సంస్కృతిలో బుద్ధ ధమ్మ విశిష్టత

- ఎమ్. వి. ఎస్. అప్పారావు

పురాణ మతము, పురోహిత మతము, శైవము, వైష్ణవము, ఇస్లాము, క్రిస్టియానిటీ, జూడాయిజయ్ - ఇవన్నీ మతములు. బుద్ధ ధమ్మ మతము కాదు, ఒక జీవిత విధానము, దృక్పథము. వే ఆఫ్ లైఫ్.

ప్రపంచ సంస్కృతిలో తొలిసారిగా కొన్ని విప్లవాత్మకమైన (రివల్యూషనరీ) సిద్ధాంతాలను బుద్ధుడు ప్రతిపాదించాడు.

1. అనిచ్చ - అనిత్య, నిత్యమైనది ఏదీ లేదు. ఇప్పటి సైన్సు ఇదే చెప్తూంది.
2. అనత్త - ఆత్మ అనే నిత్య పదార్థము ఈ జగత్తులో లేదు. ఆ ఆత్మ వాదము అనేక విపరీత పరిణామాలను సృష్టిస్తుంది.
3. దుఃఖ - తణ్హా (తృష్ణ) మయమైన జీవితము దుఃఖమయము, బాధాకరము.

**చత్తరియ సచ్చ**

చతురార్య సత్యములు. వీటి తొలి ప్రయోగకర్త తథాగతుడే.

1. దుఃఖ
2. దుఃఖ సముదయ - ఉత్పత్తి తణ్హ (తృష్ణయే) మూలము.
3. దుఃఖ వయ - ఈ బాధను నివృత్తి చేసుకోవచ్చు ఎలాగ?
4. దుఃఖ నిరోధ గామినీ దీని కొక మగ్గ (మార్గము) ఉంది. అదే అరియ అర్థంగిక మగ్గ. ఆర్య అష్టాంగ మార్గము ఈ మగ్గ మూడు భాగాలు.

1. శీల - 1. సమ్మా వచ : సరైన వాక్కు
2. సమ్మా కమ్మంత : సరైన కర్మ.
3. సమ్మా ఆజీవ: సరైన జీవన విధానము (వే ఆఫ్ లైఫ్)

2. సమాధి - 4 సమ్మా వాయామ : సరైన ప్రయత్నం.
5. సమ్మా సతి: సదా ఎరుక (అవేర్‌నెస్).
6. సమ్మా సమాధి : సరైన కాన్‌సెంట్రేషన్

ఎమ్. వి. ఎస్. అప్పారావు, ప్రముఖ న్యాయవాది, విశాఖపట్నం.

3.పఞ్ఞా - 7. సమ్మాదిట్ఠి : సరైన దృష్టి అంటే చత్తరియ సచ్చ ఞ్ఞాణ (జ్ఞానము)

(ప్రజ్ఞ) 8. సమ్మా సంకప్ప : సరైన సంకల్పము (రైట్ ఏటిట్యూడ్).

**పటిచ్చ సముప్పాద**

డిపెండెంటు ఆరిజినేషన్: ఒకదానిపై ఇంకోటి ఆధారపడి ఉంటుంది. ఈ సృష్టిలో ఫస్ట్ కాజ్ - తొలి కారణం అంటూ ఏదీ లేదు. ఇది ఉంటే - అది ఉంటుంది. దీని వలననే అది పుడుతుంది. ఇది లేకపోతే - అది రాదు. ఇది పోయినప్పుడు అదీ పోతుంది. ఈ కార్య కారణ సంబంధము నేటి సైన్సుకి మూలము. దీనిని తొలిసారిగా ప్రపంచ సంస్కృతికి ప్రసాదించింది తథాగతుడే. చెట్టు ముందా? విత్తు ముందా? గ్రుడ్డు ముందా? పిల్ల ముందా? ఈ పటిచ్చ సముప్పాద జ్ఞానము వలన యథాభూతఞ్ఞాణ దర్శన అవుతుంది. అంటే ఉన్నదానిని యథాతథంగా తెలుసుకొని, దర్శించటం. ఈ సూత్రాన్ని అర్థం చేసుకో లేక పోతే మిగిలింది శుష్క వేదాంతము మెటాఫిజిక్సు, స్పెక్యులేషన్ ఇది ఒద్దంటాడు బుద్ధుడు. ఎందుకనగా ఇది అనమతగ్గ- తెలియబడనిది.

**విపస్సనా భావనా - మెడిటేషన్**

మెడిటేషన్‌ని ఒక జీవిత విధానముగా ప్రతిపాదించినది తొలుత తథాగతుడే. అదే విపస్సనా భావనా. ఇన్‌సైట్ మెడిటేషన్. సమకాలీన ప్రపంచంలో దావానలంలా వ్యాపించి, ప్రపంచ మన్ననలందుకొని, చాలా సోఫిష్టికేటెడ్ ఎగ్జిక్యూటివ్‌లు కూడా ప్రాక్టీసు చేస్తున్న మెడిటేషన్ పద్ధతి ఇది. విపస్సనా మెడిటేషన్ (లేక) జెన్ మెడిటేషన్. శరీరాన్ని, శరీర భాగాన్ని, ఫీలింగ్సుని, చిత్తాన్ని, ఇంద్రియానుభవాన్ని నిరంతరం శోధించటమే ఈ మెడిటేషన్. మైండుఫుల్‌నెస్, నాన్ జడ్జిమెంటల్ అవేర్‌నెస్, అటెన్షన్, కాంప్రహెన్షన్, ఎరుక, ప్రాక్టికల్‌గా - ఆనాపాన సతి. ఊపిరి - రాక, పోకలను ప్రతినానో (Nano) సెకెండు వాచ్ చేస్తుండటమే. అప్పుడు మనం గతంలోనూ, భవిష్యత్తులోనూ కాకుండా, వర్తమానములోనే మన గలుగుతాము. ఉచ్ఛ్వాస, నిశ్వాసాలు ప్రతి క్షణములోను ఉంటాయి కదా? వాటి ఎరుక అంటే- ఇప్పుడే, ఇక్కడే జీవించగలగటము. అంటే మనము కాలానికి అతీతంగా వర్తమానములోనే మనగలుగుతాము. భూత, భవిష్యత్, వర్తమానముల కలయికే కాలచక్రము, భూత, భవిష్యత్తులు లేకపోతే కాలమేదీ? అంటే - విపస్సనా భావనవలన మనము - కాలాతీత వ్యక్తులము అవుతామన్నమాట! సదా వర్తమానంలోనే బ్రతుకు. కాల చక్రం క్రింద నలిగిపోము.

**ఈ ధమ్మ విశిష్టతం**

1. న్యాయ = ఒక దారిని చూపిస్తుంది. అదే అరియ అట్ఠంగిక మగ్గ, విపస్సనా భావనా.

2. ధమ్మ = కాలాతీతమైన జీవితము.

3. కుశల = అందువలన కళ్యాణాన్ని ప్రసాదిస్తుంది.

"Published with Financial Assistance from the Central Institute of Indian Languages, (Ministry of Human Resource Development, Dept. of Secondary and Higher Education, Govt. of India) Manasagangotri, Mysore - 570 006 vide sanction Letter No. F. 53-1/2001-2002/LM/GRNT dated 19th March, 2002 under the scheme of Grant-in-Aid L.M."



గుహ్యసమాజ : బహు అరుదైన తంకాపెయింటింగ్. ఇతడు తంత్ర పిత సంబంధి. గుహ్యసమాజ వజ్ర కుటుంబానికి చెందినవాడు. ఈ చిత్రంలో అతడు తన సహచరిని ముఖ్యకరములతో ఆలింగనం చేసుకొంటున్నాడు. కేంద్ర హస్తం వజ్రాన్ని, పైకుడిచేయి గంటను పట్టుకొన్నాయి. అతని పై కుడిచేయి (మరొక) ధర్మచక్రాన్ని, క్రింది కుడి చేయి పద్మాన్ని పట్టుకొన్నాయి. అతని పై ఎడమ చేయి మండుతున్న రత్న భూషణాన్ని, క్రింది ఎడమ చేయి ఖడ్గాన్ని పట్టుకొన్నాయి. ఈ విధంగా అతడు పంచసూత్ర ఐక్యతను ప్రదర్శిస్తాడు. అతడి సహచరి ప్రజ్ఞ అయితే, గుహ్యసమాజ వ్యూహము లేదా విధానం అవుతున్నాడు. ఆ ఇద్దరి ఆలింగనం శుద్ధ భ్రమైక దేహం, వాస్తవ స్పష్ట కాంతుల ఐక్యతను ప్రతీకకరిస్తున్నది.

MISIMI/మిసిమి RNI Regd.No.45042/90 Telugu Monthly, Hyderabad-500 020. Postal Regd. No.H/SD/SD



"పవిత్ర దంతధాతు దీవెన" (శ్రీలంక)